


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ | 02-04-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 317 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

# ఇంటి నుంచే భూ సేవలు

## నేడు ఐదు మండలాల్లో సమీకృత భూభారతి పోర్టల్ ప్రారంభం

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- సమీకృత భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు
- రేపటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూ సేవల లభ్యత
- కేరళ నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేటి నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.






**ఇంటి నుంచే భూ సేవలు :** గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లే పనిలేకుండా తమ ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించామని మంత్రి చెప్పారు. రైతులు ఇప్పటి వరకు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారన్నారు. ఇకపై ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయన్నారు. ఎన్నిఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంతచెల్లించాలో కనిపిస్తుందని చెప్పారు. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుందనీ ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారని మంత్రి చెప్పారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వే కూడా రోవర్లతో పూర్తి చేస్తారన్నారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుందనీ ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్‌ల కేటాయింపు జరుగుతుందని పొంగులేటి అన్నారు ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారనీ ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎమ్ ఎస్ అలర్ట్స్ పంపిస్తారని చెప్పారు.

**రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జత**

భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ ( ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు. ఈ ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నతర్వాత సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామన్నారు. అలాగే గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీంతో సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలు రైతు జీవితంలో పెద్ద అడ్డంకిగా మారాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అన్నారు. రైతు ఇంటి నుంచే అన్నిసేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని చెప్పారు.

# అమరావతికి చట్టబద్ధత

- బిల్లును ఆమోదించిన లోక్ సభ
- ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిత్యానందరాయ్
- ఏపీ పునర్విభజన సవరణ చట్టం పేరుతో బిల్లు
- రెండు గంటల పాటు చర్చ
- చర్చలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, వైసీపీ, జనసేన
- బిల్లుకు వ్యతిరేకంగా వైసీపీ వాకౌట్
- ప్రధాని మోడీకి కూటమి నేతల కృతజ్ఞతలు
- చర్చలో కేంద్రమంత్రి పెమ్మసాని భావోద్వేగం
- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు
- మచిలీపట్నం టు గుంటూరు కేపిటల్ ఏరియాగా ప్రటించాలన్న ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్



**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా మరో అడుగు ముందుకు పడింది. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభ ఆమోదించింది. ఏపీ పునర్విభజన సవరణ చట్టం బిల్లు పేరుతో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్.. ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం రెండు గంటల పాటు టీడీపీ, బీజేపీ, వైసీపీ, జనసేన సహా వివిధ పార్టీల సభ్యులు బిల్లుపై చర్చించారు. ఆ తర్వాత అమరావతి బిల్లును లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. చర్చ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బిల్లుకు మద్దతిచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా వాకౌట్ చేశారు. ఎంపీ మిథున్ రెడ్డి బృందంలోని ఎంపీలంతా లోక్ సభ నుంచి వెళ్లిపోయారు. మరోవైపు అమరావతికి చట్టబద్ధత తెలపడంపై ఏపీ కూటమి ఎంపీలు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. లోక్ సభ ఆమోదం తెలిపిన ఈ బిల్లును కేంద్రం నేడు రాజ్యసభ ముందుకు తీసుకురానుంది.

**పెమ్మసాని భావోద్వేగం : కేంద్రమంత్రి పెమ్మసాని**

అమరావతి చట్ట బద్ధత బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో కేంద్ర మంత్రి, టీడీపీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమానాలకు ఈ సవరణ ముగింపు పలుకుతుందని ఆయన స్పష్టం చేశారు. అమరావతి ఆంధ్రుల కలల రాజధానిగా అభివర్ణించారు.

మిగతా 2లో

# హైదరాబాధ లేదు

- నగరంలో సమృద్ధిగా ఇంధనం, ఎల్పీజీ
- అక్రమ, కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ జరగాలి
- సరఫరా వ్యవస్థపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు
- జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి






**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ జిల్లాలో ఇంధనం, ఎల్పిజి సమృద్ధిగా ఉందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి పునరుద్ఘాటించారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం పేరుతో ఎవరైనా అక్రమ నిల్వలతో కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో ఆటోవాలాలు, గృహ వినియోగదారులు అనవసరంగా ఆందోళన చెందవద్దని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ లభ్యత, నిల్వలు, సరఫరా పరిస్థితులపై ఏజెన్సీ నిర్వాహకులు, డిస్ట్రిబ్యూటర్లతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో సుమారు 18.62 లక్షల గృహ ఎల్పీజీ కనెక్షన్లు, 69 ఎల్పీజీ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ, దిగుమతుల తగ్గుదల కారణంగా ప్రైవేట్ ఆపరేటర్లు ప్రధానంగా నిర్వహిస్తున్న ఆటో ఎల్పీజీ విభాగంలో కొంత ఒత్తిడి ఉందని తెలిపారు. ఇటీవల ప్రజల్లో ఆందోళన కారణంగా గృహ ఎల్పీజీ బుకింగ్స్ తాత్కాలికంగా పెరిగి, రోజువారీ సగటు కంటే అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే 15 రోజుల్లో సరఫరాను పెంచి పరిస్థితిని స్థిరీకరించాలని అధికారులను ఆదేశించారు. ఇంధన పంపిణీ కేంద్రాల వద్ద ప్రజలకు సౌకర్యం కల్పించేందుకు, సరఫరా సజావుగా కొనసాగేందుకు ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సివిల్ సప్లైస్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలు వంటి అక్రమాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సహాయ సరఫరా అధికారులు ఇంధన అవుట్‌లెట్‌లు, ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీలను నిశితంగా పర్యవేక్షించి, నిల్వలు, సరఫరా స్థితి యొక్క వివరాలను అందించాలని ఆదేశించారు. ఇంధన పంపిణీ కేంద్రాలు, రవాణా వాహనాలు, సిబ్బందికి భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ మరింత పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. . ప్రజల్లో ఉన్న ఆందోళన తగ్గుముఖం పట్టిందని, డిమాండ్ క్రమంగా సాధారణ స్థితికి వస్తోందని వెల్లడించారు.

మిగతా 2లో

# పల్లెకు జాతీయ పురస్కారం

## మోతుకుపల్లి, ఫసల్వాడీ గ్రామాలకు దీన్ దయాళ్ అవార్డులు

### మంత్రి సీతక్క హర్షం



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఎఎంఎస్) :** గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రతిష్టాత్మక "దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు" లో రాష్ట్రానికి చెందిన రెండు గ్రామ పంచాయతీలు జాతీయ అవార్డులను దక్కించుకున్నాయి. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ క్రమంలో గుడ్ ఫర్ గవర్నెన్స్ విభాగంలో వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలం మోతుకుపల్లి గ్రామ పంచాయతీ పురస్కారం దక్కించుకుంది. గ్రామ స్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది.

మిగతా 2లో

# ఉద్యమకారులను కాల్చి చంపిన కాంగ్రెస్

- జై తెలంగాణ అన్నందుకు 369 మందిని తుపాకులతో కాల్చారు
- మలి దశ ఉద్యమంలోనూ 1 200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు
- కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నాం
- రాష్ట్రాల విభజన తర్వాతా తమ రాజధాని ఏదో చెప్పుకోలేని స్థితిలో ఏపీ : లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 1969లో కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న 369 మందిని తుపాకులతో కాల్చి చంపిందని విమర్శించారు. చివరి దశలో కూడా 1200 మంది ఆత్మ బలిదానంతో తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. చివరకు తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. బుధవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన అమరావతి చట్టబద్ధత బిల్లు సందర్భంగా కిషన్ రెడ్డి.. తెలంగాణ విభజన అంశాన్ని ప్రస్తావించారు.



మిగతా 2లో

# నాటో నుంచి తప్పుకుంటా : ట్రంప్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 1:** ఇరాన్‌పై అమెరికా ఇటీవల తీసుకున్న సైనిక చర్యకు మిత్రదేశాల మద్దతు లేకపోవడాన్ని కారణంగా చూపుతూ, నాటో నుండి వైదొలగడాన్ని వాషింగ్టన్ బలంగా ప రిశీలిస్తోంద ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. బ్రిటిష్ పత్రిక డైలీ టెలిగ్రాఫ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ నాటోను కాగితపు పులిగా అ భివ ర్ణించారు. కూటమి నుండి వైదొలగడం అనేది ఇప్పుడు పునఃపరిశీలనకు అతీతమైనది అని ఆయన సూచించారు. ఈ కూటమి విశ్వసనీయతపై దీర్ఘకాలంగా ఉన్న సందేహాలను ఆయన పునరుద్ఘాటించారు, వ్లాదిమిర్ పుతిన్ కూడా నాటోను బలహీనమైనదిగా భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ సంఘర్షణ ముగిసిన తర్వాత ఆ కూటమి నుంచి అమెరికా తొలగిపోయే అవకాశాన్ని పునఃపరిశీలిస్తారా అని అడిగినప్పుడు ట్రంప్ " అవును, [అది] పునఃపరిశీలనకు అతీతమని నా అభిప్రాయం అన్నారని రాయటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. కాగా, ట్రంప్ వ్యాఖ్యలకు యుకె ప్రధాని కీర్ స్టార్మర్ స్పందించారు. ఎంత రభస ఉన్నా, తాము తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. నాపైనా, ఇతరులపైనా ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ, ఎంతటి హడావిడి ఉన్నప్పటికీ, నేను తీసుకునే నిర్ణయాలలో బ్రిటిష్ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే వ్యవహరిస్తాను," అని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ బుధవారం విలేకరులతో అన్నారు.



# నేడు హనుమాన్ జయంతి

## హైదరాబాద్ నగరంలో 168 శోభాయాత్రలు



**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** హనుమాన్ జయంతి సందర్భంగా నేడు హైదరాబాద్ లో భారీ ఎత్తున హనుమాన్ శోభాయాత్రలకు నిర్వాహకులు సిద్ధం అయ్యారు. ఏకంగా 168 శోభయాత్రలతో నేడు నగరం దద్దరిల్లనుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. నగరంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సరే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు హనుమాన్ జయంతి సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులు, హనుమాన్ శోభాయాత్ర ఉత్సవ నిర్వాహకులతో కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో సమన్వయ సమావేశం నిర్వహించిన సీపీ సజ్జనార్.. నగరంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మూడు వేల మంది పోలీసులతో నిఘా ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మిగతా 2లో

# ధరల ఇంజిన్‌కు ఇంధనం

- భారత్ పై పశ్చిమాసియా యుద్ధం ప్రభావం
- అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరల పెంపు
- గ్యాస్ సరఫరాలో అంతరాయం
- పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
- ఆకాశానికి ఎగబాకిన కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు
- హైదరాబాద్ లో రూ.214.50 కు పెంపు
- భాగ్యనగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత
- 55 మెట్రోటన్నుల ఆటో ఎల్పీజీ కొరత
- సాగర్ రింగు రోడ్డు వద్ద ఆటో డ్రైవర్ల ఆందోళన
- భారీగా ట్రాఫిక్ జామ్, పోలీసుల రంగ ప్రవేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** పశ్చిమాసియాలో మొదలైన యుద్ధం భారత్‌లో ఇంధన ధరలకు రెక్కలు తొడుగుతున్నాయి. ఈ యుద్ధం కారణంగా దేశ ప్రజలు చమురు, గ్యాస్ ప్రభావాన్ని ఎదుర్కొంటుండగా తాజాగా ఇండియన్

**భారీగా పెరిగిన ఏటిఎఫ్ ధరలు**



ఆయిల్ కార్పొరేషన్ తమ ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచింది. వీటికి తోడు కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు ఆకాశానంటాయి. ఢిల్లీలో ఎక్స్ పీ100 పెట్రోల్ ధర రూ.149 నుంచి ఏకంగా రూ.160 కి ఎగబాకింది. మరోవైపు లీటరుకు రూ. 91.49 ఉన్న ఎక్స్‌ట్రా గ్రీన్ ప్రీమియం డీజిల్ ధర సుమారు రూ.1.50 మేర పెరిగి రూ.రూ. 92.99 కి చేరుకుంది. మియం పెట్రోల్ మెరుగైన ఇంజిన్ పనితీరు కోసం దీనిని హై-ఎండ్ కార్లు, సూపర్ బైక్‌లలో వాడుతారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, సరఫరాలో అంతరాయాల కారణంగా ఈ ధరల పెంపు అనివార్యమైంది.

**విమాన ఇంధన ధరలు భారీగా పెంపు**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన ఇంధన ధరలు భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో కిలోలీటర్ విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర రూ. 2.07 లక్షలకు చేరుకుంది. గత నెలలో ఏటీఎఫ్ కిలోలీటర్‌కు రూ.96,638 ఉండగా, ఏప్రిల్ నెలకు సంబంధించి చమురు సంస్థలు ధరలను రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఏటీఎఫ్ పెంపుతో విమానయాన సంస్థలు భారీగా టికెట్ ధరలను పెంచే అవకాశం ఉంది.

**పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధరలు**

తాజా పరిస్థితుల నేపథ్యంలో 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర భారీగా పెరిగింది. మార్చి 1న రూ. 1,768.50 ఉన్న సిలిండర్ ధర ఈనెల ఒకటో తేదిన ఏకంగా రూ. 2,078.50కి చేరింది. నెల రోజుల్లోనే రూ.310 పెరిగింది. హైదరాబాద్ 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.214.50కి పెరిగి రూ. 2,321 కి చేరుకుంది.

**సాగర్ రింగు రోడ్డు వద్ద ఆటో డ్రైవర్ల ఆందోళన**

హైదరాబాద్ నగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్ర రూపం దాల్చింది.

మిగతా 2లో

# కొత్తగా 62 వేల మందికి రైతు భరోసా

## 20 లోపు రెండో విడత



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఎఎంఎస్) :** కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందినవారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇప్పటివరకు కొత్త పాస్ బుక్కులు వచ్చిన వారికి రైతు భరోసా నిధులు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో ఇప్పటికే అప్లై చేసుకున్న 62 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి.. నిజానిజాలు నిర్ధారణ చేసుకున్న తర్వాత.. తుది జాబితాను రెడీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు గత ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఆ పథకానికి రైతు భరోసాగా పేరు మార్చి రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తోంది. అయితే కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి మాత్రం ఈ రైతు భరోసా అందడం లేదు. దీంతో ఆ రైతులు తమకు కూడా రైతు భరోసా నిధులు జమ చేయాలని కోరుతున్నారు.

మిగతా 2లో

## ఉద్యమకారులను కాల్చి చంపిన కాంగ్రెస్

**మొదటి పేజీ తరువాయి..**

ఆంధ్రప్రదేశ్ లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క ఎయిర్ పోర్టు మాత్రమే ఉందన్నారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలే కారణమన్నారు. రాష్ట్రాల విభజన తర్వాత ఏపీ ప్రజలు తమ రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితి రావడం బాధాకరమన్నారు. విభజన తర్వాత రెండురాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావలసి ఉన్నా.. సమన్వయ లోపాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలన్నారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. కాగా.. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వారిని కాంగ్రెస్ కాల్చి చంపిందన్న కేంద్రమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు.

## కాళేశ్వరంపై కేంద్రమంత్రి తప్పుదోవ

### సీఆర్ పాటిల్ పై మాజీ ఎంపీ వినోద్ అసహనం



**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ రాజ్యసభను తప్పుదోవ పట్టించారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని అనేకసార్లు బీఆర్ఎస్ ఎంపీలు డిమాండ్ చేశారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా రెండింతలు వ్యవసాయం పెరిగిందని చెప్తూనే, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం ద్వారా లక్ష కోట్లు నీళ్లలో కలిసిపోయాయని ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం ఏంటో తమ నాయకుడు హరీశ్‌రావు అనేక సార్లు వివరాలతో సహా చెప్పారన్నారు. ప్రాజెక్టులో భాగమైన అన్నీ కొట్టుకుపోయాయా అని ప్రశ్నించారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు కాలేదని తెలిపారు. పాటిల్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎంపీలు లేఖ రాసినట్లు చెప్పారు. రాజ్యసభ హుందాతనం కాపాడాలంటే పాటిల్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఏది చెప్తే కేంద్రం అది చేస్తున్నదని ఆరోపించారు.

## ధరల ఇంజిన్‌కు ఇంధనం

**మొదటి పేజీ తరువాయి..**

గ్యాస్ కోసం గంటల తరబడి ఎదురుచూసి విసిగిపోయిన ఆటో డ్రైవర్లు బుధవారం రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. సాగర్ రింగ్ రోడ్డు, ఎల్బీ నగర్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ వంటి పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు, ధర్నాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గత రెండు వారాలుగా ఈ సమస్య కొనసాగుతుండటంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరి, రాత్రంతా వేచి ఉన్నా గ్యాస్ దొరకడం లేదని వాపోతున్నారు. నిరసనలో భాగంగా కొందరు డ్రైవర్లు రాజేంద్రనగర్‌లో సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేయగా, బహదూర్‌పురాలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.

**55 మె.ట ఆటో ఎల్పీజీ కొరత..**

రాష్ట్రంలో రోజుకు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా విదేశాల నుంచి గ్యాస్ దిగుమతులు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించి, సరఫరాను పెంచాలని చమురు సంస్థలను ఆదేశించారు. ఆందోళనల నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. నిరసన చేస్తున్న డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, గ్యాస్ కొరత సమస్య పరిష్కారం కాకపోవడంతో తమ ఆందోళనలు కొనసాగిస్తామని ఆటో డ్రైవర్ల సంఘాలు చెబుతున్నాయి.

## పల్లెకు జాతీయ పురస్కారం

**మొదటి పేజీ తరువాయి..**

అలాగే సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన కృషికి గాను ఈ అవార్డు దక్కింది.

**మంత్రి సీతక్క అభినందనలు..**

రెండు విభాగాల్లో తెలంగాణకు జాతీయ అవార్డులు దక్కడంపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం గర్వకారణమని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనం అన్నారు. అవార్డులు అందుకున్న మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇలాంటి విజయాలు ఇతర పంచాయతీలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

# అమరావతికి చట్టబద్ధత



**మొదటి పేజీ తరువాయి..**

అమరావతి కోసం భూములను త్యాగం చేసిన రైతులకు అభినందనలు తెలియజేశారు. అమరావతి ఉద్యమంలో పోరాడిన మహిళలకు అభినందనలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని చెప్పారు. వికేంద్రీకరణ పేరుతో జగన్ ప్రభుత్వం మూడు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టిందన్నారు. అయితే జగన్ అణచివేత చర్యలతోనే అమరావతి ఒక గొప్ప ఉద్యమంగా మారి దేశం దృష్టిని ఆకర్షించిందని పెమ్మసాని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రాజధాని పాత్ర కీలకమని, బెంగళూరు, హైదరాబాద్ తరహాలో అమరావతి సైతం ఏపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలవాలని ఆకాంక్షించారు. అమరావతి కోసం భూములిచ్చిన 29 వేల మంది రైతులకు జరిగిన అన్యాయాన్ని గుర్తు చేస్తూ, వారి కన్నీళ్లే ఈ చట్టానికి పునాది అని భావోద్వేగానికి లోనయ్యారు. 'న్యాయస్థానం నుంచి దేవస్థానం' వరకు రైతులు పాదయాత్ర చేసినప్పుడు మహిళలపై జరిగిన లాఠీచార్జీలను ఆయన తీవ్రంగా ఖండించారు. కూటమి ఐక్యత కోసం పవన్ కల్యాణ్ కంకణబద్ధుడై ఉన్నారని పెమ్మసాని తెలిపారు. రాజధాని నిర్ణయం మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పెమ్మసాని గుర్తు చేశారు.

### అమరావతికి వైసీపీ వ్యతిరేకం కాదు: వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



మరోవైపు అమరావతికి వైసీపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. చర్చ సందర్భంగా మాట్లాడిన మిథున్‌రెడ్డి.. అమరావతి పేరుతో ప్రభుత్వం ప్రజాధనాన్ని దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగుల జీతాలు, ప్రజల సంక్షేమానికి డబ్బులు లేవంటున్న చంద్రబాబు.. అమరావతి అభివృద్ధి కోసం నిధులను ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ఏపీలో జరుగుతున్న అన్యాయాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అమరావతి డ్రామా అని మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి రైతులకు న్యాయం ఎలా చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అమరావతిలో అదనపు భూసమీకరణ అవసరం ఏముందని ప్రశ్నించిన మిథున్‌రెడ్డి.. ఢిల్లీలో చదరపు గజం నిర్మాణానికి 4 వేల రూపాయలు ఖర్చు చేస్తుంటే.. అమరావతిలో ఏకంగా రూ.12000 ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదన్న మిథున్‌రెడ్డి.. ప్రస్తుత ఫార్మాట్‌లో ఉన్న అమరావతి బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బిల్లుకు వ్యతిరేకంగా వాకౌట్ చేస్తున్నట్లు మిథున్‌రెడ్డి ప్రకటించారు.

### మచిలీపట్నం టు గుంటూరు కేపిటల్ ఏరియాగా ప్రకటించండి : ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



అమరావతి సహా ఏ ప్రాంతానికీ వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం కాదు. ఏ ప్లాన్ సాధ్యపడలేదు. కానీ మాకు ప్లాన్ బీ ఉంది. మచిలీపట్నం నుంచి గుంటూరు వరకు కేపిటల్ ఏరియా కింద డిక్లేర్ చేయాలి. ఆ కేపిటల్ ఏరియాకు 'మావిగన్' పేరు పెట్టాలి. మచిలీపట్నం నుంచి గుంటూరు వరకు 110 కిలోమీటర్లను 'కేపిటల్ ఏరియా కింద కారిడార్'గా ప్రకటించాలి. దానికి 'మా-వి-గన్' (మావిగన్-మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు) అని పేరు పెట్టాలి. ఈ ప్రాంతం భవిష్యత్తులో గ్రోత్ ఇంజిన్ అవుతుంది. ఈ మూడు ప్రాంతాల్లో 40 లక్షల జనాభా ఉన్నారు. కాస్త ఖర్చు పెడితే బాగా అభివృద్ధి జరుగుతుంది. రాజ్యాంగంలో ఎక్కడా రాష్ట్రానికి రాజధాని ఉండాలన్న నిబంధన లేదు. దేశానికి మాత్రమే రాజధాని ఉంటుంది. రాష్ట్రానికి రాజధాని ఏది ఉండాలన్న విషయాన్ని ఆయా రాష్ట్రాలే నిర్ణయించుకుంటాయి. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాజధానులను కేంద్రం నిర్ణయించలేదు, అవే నిర్ణయించుకున్నాయి. అమరావతి కేవలం చంద్రబాబు సెల్ఫ్ డబ్బా. ఏ దేశం పోతే ఆ దేశంలా అభివృద్ధి చేస్తానని సీఎం చెప్తాడే. నిజానికి లక్ష ఎకరాల అమరావతిలో ఇంతవరకూ కట్టిందెంత? సీఎం ఏడేళ్ల పాలనలో చేసిందేంటి? భూములిచ్చిన రైతులకు ఇచ్చిన హామీలనునెరవేర్చారా?. తొలిసారి తీసుకున్న 50 వేల ఎకరాల్లో రోడ్లు, కరెంట్, సీవరేజ్, వాటర్ వీటి కల్పనకు అయ్యే ఖర్చు అక్షరాలా రూ. లక్షకోట్లు ఉంటుందని చంద్రబాబే లెక్కలు వేశారు. ఇప్పుడు ఆ 50వేల ఎకరాలు లక్ష ఎకరాలు అయింది, ఒక్కొ ఎకరానికి రూ.2 కోట్లు అవుతుంది. రూ. లక్ష కోట్లకే దిక్కులేదనుకుంటే అదనంగా మరో 50వేల ఎకరాలను కేటాయించారు. అన్ని నిధులను ఎలా తీసుకువస్తారు? ఇది అదనపు ఖర్చు కాదా? ఒకప్పుడు అమరావతిని వరల్డ్ క్లాస్ సిటీగా మారుస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ ప్లాన్ ను ఎందుకు మారుస్తున్నారు..? అమరావతి మున్సిపాలిటీగా మిగిలిపోతుందని ఎందుకు అంటున్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో అప్పులు తీసుకొచ్చి స్కాములు చేస్తున్నారు. దేశంలో అతిపెద్ద అవినీతికి అమరావతిని రాజధానిని చేశారు. దాని ఎఫెక్ట్ ఇప్పటికే రాష్ట్రంలో పడుతోంది. అమరావతిపై ప్రజలకు వాస్తవాలు తెలియాలి. వాస్తవానికి అమరావతి చట్టబద్ధత బిల్లు తీర్మానంపై శాసనసభలో ఒక డ్రామా నడిచింది. బాబు దృష్టిలో పాలన అంటే దోపిడీ, అవినీతి మాత్రమే.

# హైదరాబాధ లేదు



**మొదటి పేజీ తరువాయి..**

ప్రభుత్వ వసతి గృహాలు, ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ, అంగన్వాడీ కేంద్రాలలో సరఫరా నిరంతరం ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

**అప్రమత్తంగా ఉన్నాం..**

షేక్‌పేట్ అలాగే పంజాగుట్ట ప్రాంతాల్లో నమోదైన ఎల్పీజీ ఘటనలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, తగిన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుకింగ్, రీఫిల్లింగ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. రెండు సిలిండర్ల కనెక్షన్ కలిగిన వినియోగదారులు డబుల్ బుకింగ్స్ పరిశీలన చేయాలని ఒక్క సిలిండర్ కనెక్షన్ ఉన్న కుటుంబాలకు ప్రాధాన్యతనిస్తూ, అందరికీ కనీస అవసరమైన ఒక సిలిండర్ అందిన తర్వాతే రెండో సిలిండర్ కేటాయింపులు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో డేటా ఆధారంగా బుకింగ్ లను ఎప్పటికప్పుడు పరిశీలించి అనవసర బుకింగ్స్, దుర్వినియోగాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయిల్ కంపెనీలు, ఎల్పీజీ ఏజెన్సీలకు సూచించారు. ప్రజలు, వాహన వినియోగదారులు అధికారిక సమాచారాన్ని మాత్రమే ఆధారంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా సమస్యలు లేదా అక్రమాలు గమనించిన పక్షంలో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. భయాందోళనలు సృష్టించడం, ప్రజా శాంతిని భంగం కలిగించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిస్థితిపై కమిటీ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, అవసరమైన చర్యలు వేగంగా చేపడుతుందని పునరుద్ఘాటించారు.

**సాంకేతిక సమస్యలు..**

సిలిండర్ డెలివరీ ఆలస్యాలపై చర్చ సందర్భంగా, అధిక బుకింగ్స్ కారణంగా ఓటీపీ ఆధారిత ధృవీకరణ వ్యవస్థపై ఒత్తిడి పెరగడంతో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని ఎల్పీజీ ఏజెన్సీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో సరిపడా నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నట్లు కలెక్టర్ కు తెలిపారు. సమావేశంలో చీఫ్ రేష్మి ఆఫీసర్ రాజిరెడ్డి, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (టాస్క్ ఫోర్స్) శ్రీనివాస్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వైద్య, రవాణా, సంక్షేమ అధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

## విభజన హామీలు ఏమయ్యాయా..?

**ఏపీకి అదనపు నిధులివ్వడంలో అభ్యంతరం లేదు**

**తెలంగాణ అభివృద్ధిని పరిగణలోకి తీసుకోండి**

**కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు సహకరించాలి**

**మూసీ ప్రాజెక్టుకు, రీజినల్ రింగ్ రోడ్డు, కేటీపీఎస్ విస్తరణకు నిధులివ్వాలి**

**ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అరోపించారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో చాలా వరకు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కు అదనపు నిధులివ్వడంపై తమకెలాంటి అభ్యంతరం లేదన్న ఆయన తెలంగాణకు కూడా నిధులు ఇవ్వాలని కోరారు. బుధవారం లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు. రాష్ట్రానికి ఎన్ఐటీ, ఐఐటీ వంటి విద్యాసంస్థలు కూడా ఇస్తామన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తామని మాటిచ్చారన్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ వంటి వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయడంతో పాటు.. బయ్యారంలో స్టీల్ ప్లాంటును కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఎంపీ పేర్కొన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మూసీ ప్రాజెక్టుకు, రీజినల్ రింగ్ రోడ్డు, కేటీపీఎస్ విస్తరణకూ కేంద్రం సహకరించాలని విన్నవించారు. భద్రాచలం బోర్డర్లో ఏపీలో కలిపిన నాలుగు గ్రామ పంచాయతీలను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ నాలుగు గ్రామ పంచాయతీలు అటు ఆంధ్రాలో కానీ.. ఇటు తెలంగాణలో కానీ ఉనికిలో లేవని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆ గ్రామ పంచాయతీలను తిరిగి వెనక్కి ఇవ్వాలన్నారు. జూన్ 2ను ఆంధ్రప్రదేశ్ బ్లాక్ డే గా పరిగణించవద్దని విజ్ఞప్తి చేశారు. ఆ రోజును రెండు రాష్ట్రాల అభివృద్ధి దినోత్సవంగా పరిగణించాలని సూచించారు.

## తెలంగాణపై కేంద్రం వివక్ష

- విభజన హామీల అమలు కేంద్రం విఫలం
- బనకచర్లకు. రూ.లక్ష కోట్ల కేటాయింపుతో తెలంగాణకు అన్యాయం
- ఏపీ సీఎంకు మద్దతు ఇచ్చే ఉద్దేశంతోనే కేంద్రం చర్యలు
- పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ

**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆరోపించారు. ప్రధానంగా బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లు కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర నిర్ణయంతో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకు మద్దతు ఇచ్చే ఉద్దేశంతోనే కేంద్రం ఈ కేటాయింపులకు అంగీకారం తెలిపిందని విమర్శించారు. బుధవారం లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ తెలంగాణ పట్ల వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే దాదాపు 9 విమానాశ్రయాలు ఉన్నాయన్న ఆయన కొత్త విమానాశ్రయాల కేటాయింపులో తెలంగాణను విస్మరించడం సరికాదన్నారు. విభజన హామీలను గాలికొదిలేసి, రాజకీయ ప్రయోజనాల కోసం ఒక రాష్ట్రానికి కొమ్ముకాస్తూ తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ నిలదీశారు.

## మీ సేవ యూజర్ ఛార్జీలు పెంపు

**కనిష్టంగా రూ.35 ఉన్న సర్వీస్ ఛార్జీ రూ.62**

**బి-కేటగిరీ సేవలకు రూ.80**

**విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఆర్టీఏ సేవలు, ఇతర ప్రభుత్వ అప్లికేషన్లపైనా భారం**




**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో వివిధ రకాల ధృవీకరణ పత్రాలు, బిల్లు చెల్లింపుల కోసం వసూలు చేసే యూజర్ ఛార్జీలు భారీగా పెరిగాయి. గతంలో కనిష్టంగా రూ. 35 ఉన్న సర్వీస్ ఛార్జీని ఇప్పుడు ఏకంగా రూ. 62కు పెరిగాయి. ఈ మేరకు ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన ధరలు బుధవారం నుంచే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తాజా పెంపు ప్రకారం.. తక్షణమే లభించే ఏ-కేటగిరీ సర్టిఫికెట్ ప్రింట్ వంటి సేవలకు రూ. 62 వసూలు చేయనుండగా.. ఇన్‌కం, క్యాస్ట్, నివాస ధృవీకరణ పత్రాల వంటి బి-కేటగిరీ సేవలకు రూ. 80గా ధరను నిర్ణయించారు. వీటితో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఆర్టీఏ సేవలు, ఇతర ప్రభుత్వ అప్లికేషన్లపై కూడా అదనపు భారం పడనుంది. ఇన్‌కం సర్టిఫికేట్‌కు గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా.. తాజా సవరణల ప్రకారం రూ.80కి చేరింది. కుల ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి 55 ఉంగా.. ఇప్పుడు రూ.80కి చేరింది. స్థానికత ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా.. ప్రస్తుతం రూ.80కి పెంచారు. అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ గతంలో రూ.40 నుంచి రూ.45 ఉండగా.. తాజాగా రూ.62కు పెంచారు. దీంతో సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు క్యాస్ట్, ఇన్‌కం, నివాస ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా ఈ మూడింటి ధరలను ఏకంగా రూ. 80కు పెంచడంతో మధ్యతరగతి, పేద వర్గాల విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. కాగా, చాలా కాలంగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు తమకు వచ్చే కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెరిగిన విద్యుత్బిల్లులు, ఇంటర్నెట్, సిబ్బంది ఖర్చుల దృష్ట్యా ఈ పెంపు అనివార్యమని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ క్రమంలోనే తాజాగా ఛార్జీలు పెంచారు. అయితే ఛార్జీలను భారీగా పెంచటంపై సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**వాట్సాప్ మీ-సేవ సూపర్ హిట్..**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ మీ-సేవ విధానానికి ప్రజల నుంచి భారీ ఆదరణ లభిస్తోంది. కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో 581 రకాల ప్రభుత్వ సేవలను పొందే వెసులుబాటును సర్కార్ కల్పించింది. 8096958096 నంబర్ ద్వారా 24 గంటల పాటు పదికి పైగా ప్రభుత్వ శాఖల సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ వంటి 10కి పైగా కీలక ప్రభుత్వ శాఖలకు చెందిన ధృవీకరణ పత్రాలు, బిల్లుల చెల్లింపులు వంటి సేవలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. మీ-సేవ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా తక్కువ సమయంలో పారదర్శకంగా సేవలు అందుతుండటంతో డిజిటల్ తెలంగాణ దిశగా ఇది ఒక కీలక అడుగుగా నిలిచింది.

## నేడు హనుమాన్ జయంతి



**మొదటి పేజీ తరువాయి..**

శోభాయాత్ర నిర్వహణలో పాల్గొనే వాలంటీర్లకు సరైన ట్రైనింగ్ ఇచ్చి.. రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిలు ఉన్న ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకుని.. శోభాయాత్రను చేపట్టాలని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే వాహనాల మళ్లింపులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్ర హెచ్చరికలు చేశారు. సమావేశం తర్వాత గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్.. అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల ప్రధాన శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. మరోవైపు.. శోభాయాత్ర సాగే ప్రాంతంలో రోడ్లపై చెత్తా చెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా.. రోడ్డుపైకి పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించే పనులను జీహెచ్ఎంసీ అధికారులు పూర్తి చేశారు.

**నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు...**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నగరంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. పౌరులు తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించి తగిన సాయం పొందవచ్చు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గౌలిగూడ రామ్ మందిర్ నుంచి ప్యారడైజ్ జంక్షన్ వరకు, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి కోటిలోని డీఎంహెచ్ఎస్ వరకు ప్రధాన శోభాయాత్రలు సాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోటి, అబిడ్స్, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, సికింద్రాబాద్ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయి. యాత్ర ముందుకు సాగే కొద్దీ విడతల వారీగా వాహనాల రాకపోకలను నియంత్రిస్తారు. వాహనదారులు ఈ మార్గాలను వదిలేసి ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్, మెహిదీపట్నం మీదుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రయాణాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురైతే తక్షణ సాయం కోసం 9010203626 నంబరును సంప్రదించవచ్చు.

## కొత్తగా 62 వేల మందికి రైతు భరోసా

**మొదటి పేజీ తరువాయి..**

ఈ నేపథ్యంలోనే రైతుల విజ్ఞప్తులపై స్పందించిన ప్రభుత్వం.. వారికి కూడా రైతు భరోసా నిధులు జమ చేయాలని నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో కొత్తగా పట్టాదారు పాసు బుక్కులు వచ్చిన రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే అమలు చేస్తున్న రైతు భరోసా పథకాన్ని.. కొత్తగా భూములు కొనుగోలు చేసి.. పట్టాలు పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా పట్టా పాస్ బుక్కులు పొందినవారు సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ 85 వేల మందిలో ఇప్పటికే 62 వేల మంది అన్నదాతలు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేస్తోంది. రైతు భరోసా పథకానికి ఆ రైతులు అర్హత కలిగి ఉన్నారా.. వారి భూమి వివరాలు.. పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత పది రోజుల్లో అర్హులకు సంబంధించిన ఫైనల్ లిస్ట్‌ను అధికారులు సిద్ధం చేయనున్నారు.

**ఈ నెల 20 లోపు రెండో విడత భరోసా...**

రైతు భరోసా పథకానికి అర్హులుగా తేలిన కొత్త అన్నదాతలకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను.. వారి బ్యాంకు అకౌంట్లలో జమా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సీజన్‌లో సుమారు రూ. 9 వేల కోట్లను అన్నదాతల అకౌంట్లలో జమా చేసే లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతీ రైతుకు.. ఈ యాసంగి సీజన్‌లో కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. ఇదీలా వుంటే.. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది అన్నదాతలకు ఎకరానికి రూ.6 వేల చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లు.. కేవలం 9 రోజుల వ్యవధిలోనే అకౌంట్లలో జమ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. ఇక రైతు భరోసా పథకం లబ్ధిదారుల సంఖ్యలో 5.22 లక్షల మందితో నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో 3.53 లక్షలతో సంగారెడ్డి.. ఖమ్మం 3.35 లక్షలు.. సిద్ధిపేట జిల్లా 3.18 లక్షలతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.





# గ్రేటర్ హైదరాబాద్



## మిత్రుని కుటుంబానికి రూ.12,500 ఆర్థిక సహాయం



**చేవెళ్ల, ఏప్రిల్ 1 (వుదయం):** అకాల మరణం పొందిన స్నేహితుని కుటుంబానికి అండగా నిలుస్తూ మైత్రి విలువను మరోసారి చాటారు పూర్వ విద్యార్థి మిత్రులు. అల్లావాడ గ్రామానికి చెందిన శివగాళ్ల యాదయ్య మానసిక ఒత్తిడితో ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న 201112 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమ స్నేహితుడి కుటుంబానికి సహాయం చేయాలని నిర్ణయించి రూ.12,500 నగదును సేకరించారు.మంగళవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో ఈ మొత్తాన్ని మృతుని తల్లి నీలమ్మకు అందజేశారు.ఈ కార్యక్రమం దళితమిత్ర యువజన సంఘం గ్రామ ఇంచార్జ్ శివగాళ్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.ఉపాధ్యక్షులు పానుగంటి ప్రవీణ్ సహకారం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అల్లావాడ గ్రామ 5వ వార్డ్ మెంబర్ శివగాళ్ల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

## జనగణనకు ప్రాథమిక ఉపాధ్యాయులను వినియోగించాలి

**చేవెళ్ల, ఏప్రిల్ 1 (వుదయం) :** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణన (సెన్సస్) ప్రక్రియను మరింత ఖచ్చితంగా, సమగ్రంగా నిర్వహించాలంటే ప్రతి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లుగా నియమించాలని ఎస్‌జీటీయూ జిల్లా నాయకులు డి.గణేష్, ఎం. శ్రీనివాస్ సూచించారు.గ్రామాల్లోని ప్రతి గృహం, కుటుంబాల వివరాలపై ప్రాథమిక ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన ఉండటంతో, వారి సేవలను వినియోగించడం ద్వారా ఒక్క గృహం కూడా



మిస్ కాకుండా జనగణన నిర్వహించవచ్చని వారు తెలిపారు. దీంతో ఈ ప్రక్రియ నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పూర్తవుతుందని అభిప్రాయపడ్డారు.

## పన్ను వసూళ్లలో సిద్దిపేట మున్సిపాలిటీ 86 శాతం పూర్తి



**ఉదయం, సిద్ధిపేట బ్యూరో (ఏప్రిల్ 01)** సిద్ధిపేట మున్సిపాలిటీలో 202526 ఆర్థిక సంవత్సరాంతానికి పన్నువసూళ్లు గణనీయంగా పెరిగాయని ఈ సంవత్సరపు చివరి రోజునే రూ. 35.02 లక్షలు వసూలు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ తెలిపారు. బుధవారం 202526 సంవత్సరానికి మొత్తానికిగానూ రూ.1877.80లక్షలు కాగా, అందులో రూ. 1615.24 లక్షలు వసూలు చేయడం జరిగిందన్నారు . పన్నువసూళ్ల శాతం సుమారు 86.00% నమోదై, గత సంవత్సరం 84.25%తో పోలిస్తే 1.75% అధికంగా ఉందన్నారు. గత సంవత్సరం పన్ను వసూళ్లు రూ. 1414.54 లక్షలు కాగా, ఈ సంవత్సరం రూ. 1615.54 లక్షలు వసూలు చేయడం ద్వారా సుమారు రూ. 2.00 కోట్లు అధికంగా వసూలు చేయడం జరిగిందని తెలిపారు .ఈ సంవత్సరంలో కొత్తగా 995 ఇళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి,ఇంటి నెంబర్లు కేటాయించగా 15వ ఫైనాన్స్ గ్రాంట్స్ విడుదలకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి, ఆ గ్రాంట్స్ పొందడానికి అర్హత సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇంటి పన్ను వసూళ్లలో సిద్దిపేట మున్సిపాలిటీ మొదటి పది స్థానాలలో చోటు దక్కించుకుంది.అదనంగా, ఈ సంవత్సరం కొత్తగా రూ. 144.10లక్షల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. కమిషనర్ అశ్రిత్ కుమార్ సారథ్యంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ విజయాలు సాధ్యమమైనట్లు మున్సిపల్ కార్యాలయ వర్గం తెలిపింది. వసూళ్ల శాతంలో సుమారు 86% పూర్తైనట్లు తెలుస్తోంది. పన్ను వసూళ్లలో సహకరించిన పాలకవర్గానికి, పట్టణ ప్రజలకు కమిషనర్ అశ్రిత్ కుమార్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## కార్మిక వ్యతిరేక కోడ్లను ఉపసంహరించుకోవాలి



**వికారాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):** కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించాలని,సీఐటీయూ ఇచ్చిన పిలుపు మేరకు, ఆ యూనియన్ జిల్లా కోశాధికారి బుస్స చంద్రయ్య ఆద్వర్యం లో దౌల్తాబాద్ మండల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయం ముందు కార్మికులు బ్లాక్ డే నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం లో కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలనును కాలరాస్తూ,వారికి వ్యతిరేకంగా ,కార్పొరేటర్లు కు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక చట్టాలను తీసుకొని రావడం దుర్మార్గమని కేంద్ర ప్రభుత్వ వైఖరి పై ఆయన మండిపడ్డారు.కార్మికులకు వ్యతిరేకంగా, వారి శ్రమ దోపిడి చేసే నాలుగు కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,రాష్ట్ర ప్రభుత్వం సైతం అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన కోరారు. ఈ బ్లాక్ డే నిరసన కార్యక్రమం లో గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షులు కుర్మని సాయిలు, మ్యాతరి రాములు దాస్, అంగన్వాడీ తాలూకా కార్యదర్శి సంతోష, ఎం. నరసింగమ్మ, అన్నపూర్ణ, అంబిక, మిషన్ భగీరథ కార్మికులు రాములు, వెంకటయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు ఏర్పుల భారతమ్మ, అనంతమ్మ, ఎల్లమ్మ, ఆశా వర్కర్ లు నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా ఘాటు విమర్శలు

**భూ ఖబ్జాలు, అవినీతి ఆరోపణలపై సవాల్.. శివాలయంలో ప్రమాణానికి సిద్ధమా?**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 1 (వుదయం) :** పటాన్‌చెరు నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వైఖరిపై మండిపడ్డారు. తమ కుటుంబంపై స్థాయి గురించి మాట్లాడటం సరికాదని, పేదలకు అండగా నిలబడిన చరిత్ర తమ కుటుంబానిదని పేర్కొన్నారు. "మా కుటుంబం పేరుతో అనేక కాలనీలు ఉన్నాయి. ఇలాంటి చరిత్ర కలిగిన కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదు" అని అన్నారు. గతంలో గూడెం ఎమ్మెల్యేగా గెలవడంలో తమ కుటుంబం రాజకీయంగా సహకరించిందని, ఇప్పుడు అదే కుటుంబంపై ఆరోపణలు చేయడం తగదని విమర్శించారు. "స్థాయి అంటే భూ ఖబ్జాలు చేయడమా..? పార్టీలు మారడమా..?" అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో భూముల ఆక్రమణలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఆరోపించిన కాటా శ్రీనివాస్ గౌడ్, పలు సర్వే





నంబర్లను ప్రస్తావించారు. 62 సర్వే నంబర్‌లో కేటాయింపులు జరిగిన భూములను ప్లాట్లుగా మార్చి అమ్మకాలు జరిపారని, 64, 65 సర్వే నంబర్లకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అలాగే 453 సర్వే నంబర్‌లో ఎం ఎల్ ఏ అనుచరులు ప్లాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఇంద్రేశం ప్రాంతంలోని 178 సర్వే నంబర్‌లో కూడా అక్రమంగా ప్లాట్లు వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గతం లో అధికారంలో ఉన్న కారణంగా అక్రమంగా వందల కోట్లు సంపాదించుకున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏం ఎల్ ఏ గా రెండు లక్షల జీతం తీసుకుంటున్న గూడెం ఇంతటి ఆస్తులు సంపాదించలేరు. అంత డబ్బు ఎలా వస్తుందో ప్రజలకు చెప్పాలి" అని ప్రశ్నించారు. గతంలో గూడెం కుందంబండించిన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన పత్రాలను బహిరంగం చేస్తున్నామని తెలిపారు. తాను చేసిన ఆరోపణలు నిజమని నిరూపించేందుకు సిద్ధమని, అవసరమైతే తల నరుక్కుంటానని తీవ్ర వ్యాఖ్య చేశారు. "నాపై గూడెం చేసిన ఆరోపణలు నిజమైతే నిరూపించాలి. శివాలయంలో ప్రమాణం చేద్దాం" అంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.రేపు ఉదయం 11గంటలకు బీరంగూడ శివాలయంలో పసుపు బట్టలతో ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే కూడా రావాలని అన్నారు. అలాగే, తన సర్పంచ్ పదవి తీసివేయడంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, హరీశ్ రావు పాత్ర ఉందని ఆరోపించారు. తనను కాపాడుకోవడానికి పార్టీలు మారే చరిత్ర ఎమ్మెల్యేకి ఉందని విమర్శించారు. ఇద్దరి ఆస్తులను బహిరంగం చేద్దామని, ఎవరు ఎంత సంపాదించారో ప్రజలకు తెలిసేలా చేస్తామని తెలిపారు. "నాకు ముందుగా అవకాశం ఇచ్చి ఉంటే ఎన్నికల్లో ఫలితం వేరేలా ఉండేదని" వ్యాఖ్యానించారు. ఇంకా రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యే అవినీతి వ్యవహారాలను పూర్తిగా బయటపెడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎవరినైనా అడిగినా ఆయన అవినీతి గురించి చెబుతారని అన్నారు. పార్క్ స్థలాలను కూడా వదలకుండా ఆక్రమించుకున్న చరిత్ర ఉందని తీవ్రంగా విమర్శించారు.

## తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

**హైదరాబాద్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ ఉపాధ్యక్షుడు (న్యూఢిల్లీ) మోహన్ కుమార్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ పంపారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా సేవలందిస్తున్న పాత్రికేయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపు, చిన్న, మధ్యతరహా పత్రికల ప్రకటనల బకాయిల చెల్లింపు, ఎంప్యానెల్‌మెంట్, పింఛను పథకం, అక్రిడిటేషన్ కార్డులు, కేబుల్ ఛానెళ్ల గుర్తింపు, పాత్రికేయుల రక్షణ చట్టం అమలు



చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన పాత్రికేయులందరికీ ప్రాధాన్యతా క్రమంలో అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు జారీ చేయడంతో పాటు పాత్రికేయులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని లేఖలో విన్నవించారు. ఎలాంటి వివక్ష లేకుండా, పెద్ద వార్తాపత్రికలతో సమానంగా చిన్న వార్తాపత్రికలకు కూడా ప్రభుత్వ ప్రకటనలు క్రమం తప్పకుండా విడుదల చేయాలన్నారు. కేబుల్ టీవీ ఛానెళ్లకు పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి. ఈ సౌకర్యాన్ని పునరుద్ధరించడానికి జీవో 252ను తగిన విధంగా సవరించాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**సంగారెడ్డి ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :** సంగారెడ్డి పట్టణంలో జగ్గారెడ్డి గారి క్యాంప్ కార్యక్రమంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది . 17మంది లబ్ధి దారులకు సుమారు 6 లక్షల విలువైన చెక్కులు మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి పట్టణ అధ్యక్షులు జార్జ్ గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది . ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్,మహేష్, మహేష్ గౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడి ఎన్నిక

**బీరంగూడ జగన్ మోహన్ రెడ్డికి న్యాయవాదుల శుభాకాంక్షలు**

**షాద్ నగర్, ఏప్రిల్ 1 (వుదయం):** షాద్ నగర్ అదనపు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం మధ్యాహ్నం నూతన అధ్యక్షులు బీరంగూడ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిలుగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సునీల్ గౌడ్, ఏవి కృష్ణ రావు హాజరైనారు. ఈ కార్యక్రమంలో నూతన బార్ అసోసియేషన్ సభ్యులు అందరూ అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర మరియు ఖచ్చితమైన న్యాయ సేవలు అందించడానికి చక్కటి బార్ మరియు బెంచ్ రిలేషన్ కొనసాగించవలసిన అవసరం పాలకవర్గంతో పాటు, బార్ సభ్యులపై ఉందని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని అలాగే పార్కింగ్ సమస్యలు, వెల్ఫేర్ స్టాంప్ అందుబాటులో ఉంచుతామనీ ,గార్డెనింగ్, టాయిలెట్ పునర్నిర్మాణం చేస్తామన్నారు. ఇంకా ఏమైనా సమస్య లు ఉంటే మా కమిటీ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. సీనియర్ న్యాయవాదులు పలువురు మాట్లాడుతూ షాద్ నగర్ కోర్టుకు రంగారెడ్డి జిల్లాలో





ప్రత్యేక స్థానం ఉందని సుమారు 40 సంవత్సరాల క్రితం మున్సిఫ్ కోర్టుగా నలుగురు న్యాయవాదులతో ఏర్పడిన కోర్టు ఈరోజు జిల్లా కోర్టుగా 168 మంది సభ్యులతో నడవడం షాద్ నగర్ ప్రాంత అభివృద్ధికి సూచికగా పేర్కొన్నారు. న్యాయవాదులు నూతన పాలకవర్గం మరియు గత పాలకవర్గంకు సీనియర్ న్యాయవాదులు ఎంఏ కరీం, కంచి రాజగోపాల్, చెంది మహేందర్ రెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భారీ గజమాలతో ఐదవ సారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన జగన్మోహన్ రెడ్డికి సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో షాద్ నగర్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సబియా సుల్తానా, జనరల్ సెక్రెటరీ చెక్కలి శ్రీనివాస మూర్తి, జాయింట్ సెక్రెటరీ, శ్రీకాంత్ గౌడ్, ట్రెజరర్. ఎండి రహిమోద్దీన్ , స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రెటరీ డ్యాగ శంకర్, లైబ్రేరి సెక్రటరీ జయమ్మ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్స్ గంజాయి నర్సింలు, కనకమల్లి, గూడూరు గణేష్, రేవల్లి విజయ్ కుమార్ గౌడ్,సునీత, పబ్బే శ్రీశైలం, నరేష్, గూడూరు ప్రశాంత్, పాత్లావత్ రూప్ సింగ్, సంతోష్ నాయక్ మరియు సీనియర్ న్యాయవాదులు మాజీ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు, రాజశేఖర్ రాజు, శివయ్య, కేవీ చారీ, ఎంఏ కరీం, కే మోహన్ రావు, కంచి రాజగోపాల్, చెంది మహేందర్ రెడ్డి, చంద్రయ్య, శ్రీధర్ గౌడ్,, చెట్ల శంకర్, చంద్రశేఖర్, మల్లయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, మాధవ్ రెడ్డి, లింగం గౌడ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు..

## బీహెచ్‌ఈఎల్ ఎం.ఐ.జి కాలనీలో హనుమాన్ విజయోత్సవ కార్యక్రమం

**27 అడుగుల అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ**

**రామచంద్రాపురం,ఏప్రిల్ 1 (వదయం):** బీహెచ్‌ఈఎల్ ఎం.ఐ.జి కాలనీలో నిర్వహించిన శ్రీ రామాలయము - శ్రీ హనుమాన్ విజయోత్సవం కార్యక్రమంలో భాగంగా 27 అడుగుల శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పటాన్చెరు ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆదర్శ్ రెడ్డి ,భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డిలు భక్తి శ్రద్ధలతో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆలయాలు ప్రజలకు ఆధ్యాత్మిక శాంతి, సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భీమ్ రెడ్డి,



సత్యనారాయణ, టి.వి. రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్లు మోహన్ గౌడ్, నాగమణి, సొసైటీ మాజీ డైరెక్టర్లు వెంకట్ రావు, నారాయణ గౌడ్, నీలకంఠం, రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, సంపత్ గౌడ్, చిన్న, రాకేష్ రెడ్డి, కుమార్, స్థానిక నాయకులు భాస్కర్ ముదిరాజ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన!

**శంకర్ పల్లి, ఏప్రిల్ 01 (వుదయం):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని రెడ్డి కాలనీ, టీచర్స్ కాలనీ, భవాని నగర్ ప్రాంతాల్లో కోటి 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. కాలనీల్లో ఎన్నో ఏళ్లుగా రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడం స్థానికులకు ఎంతో ఊరట కలిగించింది. రోడ్లు నిర్మాణం పూర్తయితే ఆయా కాలనీల రూపురేఖలు మారిపోతాయని, పట్టణ అభివృద్ధికి ఇది కీలక ముందడుగుగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు. శంకుస్థాపన అనంతరం చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. అభివృద్ధి అనేది ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రతి కాలనీ, ప్రతి వీధికి చేరాల్సిందేనని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, రాకపోకలు సులభతరం చేయడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం మున్సిపాలిటీ ప్రధాన



లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు తీసుకువస్తామని చైర్ పర్సన్ తెలిపారు. ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించి పట్టణాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో పాలకవర్గం ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు, వర్షాకాలంలో నీటి నిల్వలు, రోడ్లపై గుంతలు వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. శంకర్ పల్లిని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడమే తమ ప్రధాన ఉద్దేశమని సాతా ప్రవీణ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి పాల్గొని అభివృద్ధి పనులకు తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అలాగే ఒకటో వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు, 11వ వార్డు కౌన్సిలర్ పై ముద బేగం, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి తదితర ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శంకర్ పల్లి పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతుల పనులను కూడా వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై చైర్ పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ, రెడ్డి కాలనీ, టీచర్స్ కాలనీ, భవాని నగర్‌లలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేదని చెప్పారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి బురదగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారని, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERBAD/HYDERABAD.**
**O.S. No. 671 OF 2026**

**Between:**
1.Eega Padmavathi and others **...Plaintiffs**

**AND**

1. Tahsildar, Nampally Mandal, Hyderabad – 500001. **...Defendant**
2. All Concerned

1. Whereas in the above Suit filed by Smt. Eega Padmavathi and others Suit for Declaration of Legal Heirs to declaring them as legal heirs of late. Mr. Eega Kannaiah, and Declaring them as the. The Hon'ble Court was pleased to order for publication to All Concerned. Therefore All concerned who have any claim or objection against the Plaintiffs claim are hereby summoned to appear before the **Hon'ble xx junior civil judge,ccc at:**.Hyderabad District in person or through a pleader on: **09-04-2026 at 10.30 A.M** and further you are hereby directed to file your objections/claims and to produce the relevant documents in your support, otherwise the above case will be heard and determined on merits and in your absence. Hence this Court Notice.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**B.PARSHURAM**
**K.SANDEEP**
**Advocates,**
**Counsel for the Plaintiffs.**
**H.No.1-9-129/17/a/2**
**Ramnagar, Hyderabad – 20**
**Ph no.9701305487**

**IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.No. 825 of 2026**

**Between:**
Sunkari Hari Narayana & Others **...Plaintiffs**

**AND**

The Tahsildar /Mandal Revenue Officer, Bandlaguda Mandal
And another **...Defendant**

To,
All Concerned **... Defendant No.2**

**NOTICE**

Please take notice that the plaintiff's i.e... Sunkari Hari Narayana & others had filed a suit for declaration of legal heirs of deceased Late. S.K. Laxmi Narayana & Late S.K. Shakuntala Bai who died on 11-01-1996 & 09-05-2019 vide O.S.No. 825 of 2026 on the file of the Hon'ble VIII Junior Civil Judge City Civil Court At Hyderabad, and the same is posted on 17-04-2026 at 10:30 A.M, for submitting objections if any, and also appear in person or through an Advocate, if you fail to appear before the above said Hon'ble Court on the said day the case will be decided on merits in your absence.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**M/S A.Manik Prabhu Goud**
**Advocate**
**R/o: 18-6-636,**
**Laldarwaza, Hyderabad,**
**TG – 500053, Cell: - 9391350841**



"* విదేశీ విరాళాల (క్రమబద్ధీకరణ) చట్టానికి (ఎఫ్‌సిఆర్‌ఎ) సంబంధించి ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాలపై ప్రాథమిక సమాచారాన్ని అడిగినా ప్రభుత్వం దానిని ఇవ్వడానికి నిరాకరిస్తోంది. అందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటోంది. ఈ విషయంలో పార్లమెంట్ లో అడిగే మామూలు ప్రశ్నలను కూడా "రహస్యమైనవి" గా పరిగణించి సమాధానాలను దాటవేస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఎ సంబంధించి 2024 నుంచి ఎనిమిది ప్రశ్నలు అడిగాను. ఎఫ్‌సిఆర్‌ఎ సౌకర్యాన్ని రద్దు చేయడం సస్పెండ్ చేయడం, గడువు పొడిగించకపోవడం, కొత్త రిజిస్ట్రేషన్ కు నిరాకరించడం, వాటి సమాచారాన్ని ఎన్జీవో (ప్రభుత్వేతర సంస్థలు)లకు అందుబాటులో ఉంచకపోవడానికి సంబంధించినవే ఈ ఎనిమిది ప్రశ్నలు ఇప్పటి వరకు వీటిలో ఏ ఒక్కదానికి ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఎఫ్ సిఆర్‌ఎ లైసెన్స్ రద్దుకు సంబంధించిన అన్ని ప్రశ్నలను రాజ్యసభ నిబంధనల కింద నిరాకరిస్తున్నారు. అది రహస్య సమాచారం అని చెప్పి వాటికి జవాబు ఇవ్వడం లేదు. "

* ఎక్స్‌లో జాన్ బ్రిట్టాస్, రాజ్యసభ సీనియర్ (సిపిఐ(ఎం)) సభ్యుడు

## వే'మన'పద్యం

కల్ల నిజములెల్ల గరళకంఠు డెరుగు  
నీరు పల్లమెరుగు నిజముగాను  
తల్లితానెరుగును తనయుని జన్మంబు  
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# దేశాల మధ్య మారనున్న సంబంధాలు!

అమెరికా అధ్యక్షుడు గా ట్రంప్ పాలన మొదలైనప్పుడే అంతర్జాతీయ వ్యవస్థ క్రమశిక్షణ కోల్పోవడం ప్రారంభమైంది.వాతావరణంలో వేడి గాలుల ప్రభావాన్ని తగ్గించి మానవాళిని కాపాడడానికి కుదుర్చుకున్న పారిస్ ఒప్పందం నుంచి అమెరికాను తప్పించిన ప్రభుత్వ ఉత్తర్వు మీద ట్రంప్ రెండు సార్లు సంతకం చేశారు.మొదటి విడత అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత 2017 లో ఈ ఒప్పందం నుంచి తప్పుకున్న నిర్ణయం మీద చేవ్రాలు చేశారు. అయితే ఆయన తర్వాత 2021లో అధికారానికి వచ్చిన డెమోక్రాటిక్ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో అమెరికా మళ్ళీ ఈ ఒప్పందంలో చేరింది. ఒక పదవీకాలం వ్యవధి తర్వాత మళ్ళీ అధ్యక్షుడైన ట్రంప్ ప్రభుత్వం 2025 జనవరి 25 న పారిస్ ఒప్పందం నుంచి రెండోసారి తప్పుకుంది.రాతి రూపెత్తిన శిలాజ ఇంధనాల వాడకాన్ని పరిమితం చేసుకోడం ద్వారా వాతావరణాన్ని కాపాడుకోవాలన్న ప్రపంచ విజ్ఞుల సంకల్పాన్ని ట్రంప్ త్రోసిపుచ్చాడు. విద్యుత్తు తయారీలో బొగ్గు వినియోగాన్ని పెంచాడు. అలాగే కోవిడ్ -19 సంక్షోభ సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ తో గొడవ పడి దానికి విరాళాలు మానుకుని దాని నుంచి సైతం అమెరికాను తప్పించాడు . ఇలా 62 ఐక్యరాజ్య సమితి సంస్థల నుంచి వైదొలగే చర్యలను ట్రంప్ చేపట్టినట్టు సమాచారం.రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ సమ్మంధాల్లో శాంతి సుస్థిరతల కోసం ఐక్యరాజ్యసమితి గొడుగు కింద ఎన్నో అంతర్జాతీయ సంస్థలు వెలిశాయి. ఇరాక్ పై సాగించిన గల్ఫ్ యుద్ధంలో అమెరికా, దాని మిత్ర దేశాలు ఐక్య రాజ్య సమితి అధికార పరిధిని ఉల్లంఘించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నడుస్తున్న ఇరాన్ యుద్ధం తర్వాత దేశాల సమ్మంధాల్లో ఊహించని మార్పులు చోటుచేసుకోగల అవకాశాలున్నాయి. ఆర్థిక చక్రాన్ని శాసించేవారి ప్రాబల్యం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి . కేవలం ఆయుధ బలంతో కాకుండా వనరులు దండిగా ఉండి సైనికంగానూ బలవంతులైన వారి నిర్ణయాధికారం బలపడితే ఆశ్చర్యపోనవసరం లేదు. అది జరగకుండా చేయడం కోసమే ఈ యుద్ధంలో ఇరాన్ ను తిరిగి లేవకుండా తొక్కివేయాలని ట్రంప్ చూస్తున్నాడు,అందుకు సహకరించనందుకు బ్రిటన్ ఫ్రాన్స్ లపై కారాలు, మిరియాలు నూరుతున్నాడు,బుధవారం నాడు మరో మెట్టెక్కి నాటో నుంచి అమెరికా తప్పుకుంతుందని బెదిరించాడు. అసలు మనవాళికి నాటో అవసరమే లేదు.ఉత్తర అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ పేరిట 1949 లో అవతరించింది.అట్లాంటిక్ దేశాల భద్రత పేరిట అమెరికా, బ్రిటన్ ఫ్రాన్స్ తదితర దేశాలు దీనిని నెలకొల్పాయి. అన్ని అంతర్జాతీయ సంస్థల విషయంలో మాదిరిగానే దీనిని మేపడానికి అధికంగా నిధులు చేకూర్చేది అమెరికాయే. వాస్తవానికి నాటో కారణంగానే ఉక్రెయిన్ రష్యా యుద్ధమై చిరకాలంగా కొనసాగుతున్నది. నాటో మాదిరిగానే నాటి సోవియెట్ యూనియన్ కూటమి తరపున అవతరించిన వార్సా కూటమి ఎప్పుడో రద్దు అయింది. విచిత్రంగా ఇరాన్ తో అమెరికా, ఇజ్రాయెల్ కాలుదువ్వి కొనసాగిస్తున్న యుద్ధం ఇటు పశ్చిమాసియా దేశాల మధ్య దూరాన్ని పెంచింది. అలాగే అమెరికా దాని మిత్రదేశాలనూ ఎడంగా జరిపింది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com  
website : www.voodayam.com  
Editor : 9247698676  
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# ఐపిఎల్ ఆటలో గల్లీ కుర్రాళ్లు

జింక పరుగుల చిన్నారి హిమ దాస్ అస్సాం లోని పేద రైతు బిడ్డ. పరుగులో పతకాలు సాధించి 22 వ ఏటనే రాష్ట్ర స్పోర్ట్స్ పాలసీ కోటాలో భాగంగా పోలీసు శాఖలో డి ఎస్ పి ఉద్యోగంలో చేరింది. ఆమె విజయం దేశంలో ఎందరికో స్ఫూర్తినే కాకుండా సంతోషాల్ని పంచింది. జాతీయ అంతర్జాతీయ ఆటలపోటీల్లో పాల్గొనేందుకు శ్రమతో పాటు ఎంతో ఖర్చుతో కూడుకున్నశిక్షణ, సాధన అవసరం. వీటికి సవాలుగా కనీస సౌకర్యాలు లేని ఊర్లలోంచి, పేదరిక కుటుంబాల్లోంచి ఎదిగివచ్చిన క్రీడాకారుల సాధనసంపత్తులు చూస్తుంటే గర్వంగా ఉంటుంది.

ధనికులకే పరిమితమైన క్రీడల్లోకి ఈ మధ్య వస్తున్న పేద, దిగువ సామాజిక వర్గాల నుండి వస్తున్నవారు విజయపతాకాల్ని ఎగరేస్తున్నారు. ప్రస్తుతం రోజు సాయంత్రాలు టివి తెరపై ఆడుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆట 'టి 20' ఎందరో సాధారణ కుటుంబాల పిల్లలకు ఆశ్రయమయింది. 2007 లో మొదలైన ఈ ఐ పి ఎల్ లో 8 టీములుగా 8 భారతీయ నగరాల్లో ఏటా ఆడుతున్నాయి. మార్చి 26న మొదలైన మే 31 దాకా సాగే ఐ పి ఎల్ 19 లో 10 జట్లు తలపడుతున్నాయి. 11 మంది మైదానంలో దిగే ఈ ఆటలో నలుగురికి మించి విదేశీ ఆటగాళ్లు ఉండ రాదు. మిగతావాళ్లంతా భారతీయులే. వీరేకాకుండా ఒక్కో టీముకు ఆరేడుగురు తోడు ఆటగాళ్లు కూడా ఉంటారు. ఈ విధంగా సుమారుగా వందకు పైగా మన యువకులకు అవకాశం దొరుకుతుంది. ఎంపికలో పక్షపాతం, సిఫారసులకు చోటు లేకుండా వేలం పాటలో క్రీడాకారులను కొనుగోలు చేయడం జరుగుతుంది.

సామర్థ్యమే ప్రమాణంగా ఎంపికవుతున్నందున గ్రామీణ, పేదల బిడ్డలకు కూడా ఇందులో ఆడే అవకాశం చిక్కుతోంది. సొంత కలలను సాకారం చేసుకునేందుకు , తల్లిదండ్రుల ఆశల్ని నెరవేర్చేందుకో దేశంలో ఎందరో పేద పిల్లలు ఆటల్ని తమ లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. వసతుల లేమిని దాటి కఠోర శ్రమతో ఐ పి ఎల్ దాక వచ్చిన వారు కోట్ల సంపాదనతో తరాలుగా తోడు వస్తున్న దారిద్ర్యాన్ని తుడిచిపెడుతున్నారు. అంతకంతకు బతుకుతున్నవారికి పేరుకు పేరు, డబ్బుకు డబ్బు రావడం గొప్ప ప్రాసంగిక అంశం.



సామర్థ్యమే ప్రమాణంగా ఎంపికవుతున్నందున గ్రామీణ, పేదల బిడ్డలకు కూడా ఇందులో ఆడే అవకాశం చిక్కుతోంది. సొంత కలలను సాకారం చేసుకునేందుకు , తల్లిదండ్రుల ఆశల్ని నెరవేర్చేందుకో దేశంలో ఎందరో పేద పిల్లలు ఆటల్ని తమ లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. వసతుల లేమిని దాటి కఠోర శ్రమతో ఐ పి ఎల్ దాక వచ్చిన వారు కోట్ల సంపాదనతో తరాలుగా తోడు వస్తున్న దారిద్ర్యాన్ని తుడిచిపెడుతున్నారు. అంతకంతకు బతుకుతున్నవారికి పేరుకు పేరు, డబ్బుకు డబ్బు రావడం గొప్ప ప్రాసంగిక అంశం.

యూపీలోని భాదోహి చెందిన ఇరువై ఏళ్ల యశస్వి జైస్వాల్ తండ్రి చిన్న షాపు యజమాని. యశస్వి క్రికెట్ సాధనకోసం ముంబైలో ఉన్న బాబాయి దగ్గరి కెళ్ళాడు. బాబాయిది రోడ్డు మీద చాట్ దుకాణం. పగలంతా ప్రాక్టీసు చేస్తూ పొద్దున పాల ప్యాకెట్లు పంచాడు, రాత్రి పానీపూరి అమ్మేవాడు. నీరు, విద్యుత్తు లేని టెంట్ కింద బతికాడు. 2019 లోమహారాష్ట్ర రాష్ట్రస్థాయి విజయ హజారీ ట్రోఫీ పోటీలో 12 సిక్సులు కొట్టాడు. 2020 ఐ పి ఎల్, టి 20 లో రాజస్థాన్ రాయల్స్ యశస్వికి రూ. 2 .4 కోట్లు ఇచ్చి ఎంపిక చేసుకుంది. ఈసారి రాజస్థాన్ రాయల్స్ ఆయనకు రూ .18 కోట్లు ఇచ్చింది. చిన్న వయసులో ఇలాంటి విజయం అరుదైన సందర్భంగానే చెప్పుకోవాలి. దాంతోపాటు ఆ చిరుత శక్తియుక్తులను జేజేలు పలకాలి.

రాజస్థాన్ కు చెందిన నట్టు సింగ్ కు 27 ఏళ్ళు. ఫాస్ట్ బౌలర్ గా రకరకాల క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాడు. అయన తండ్రి ఓ కేబుల్ ఫ్యాక్టరీలో పని చేస్తాడు .ఆర్థిక ఇబ్బందుల నడమ నట్టు క్రికెట్ సాధన చేశాడు. 2016 లో ఆయన్ని ముంబై ఇండియన్స్ రూ.3 .2 కోట్లు పోసి కొనుక్కుంది. 2017 గుజరాత్ లయన్స్ ఐ పి ఎల్ కోసం 50 లక్షలు ఇచ్చింది. ఆ తర్వాత ఆయన 2018 లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడే అవకాశం లభించింది. అయితే ఆటలో రాణించకపోవడంతో ప్రస్తుతానికి ఆయన ఐ పి ఎల్ కు దూరంగా ఉన్నట్లే. అయినా కుటుంబం పైసకు లోటు లేకుండా బతుకుతుంది.

ఫాస్ట్ బౌలర్ గా రాణిస్తున్న తంగరసు నటరాజన్ ది పుట్టు పేదరికం. తండ్రి పవర్ లూమ్ కూలీ. తల్లి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతోంది. తాను పుట్టిన సేలం సమీపంలోని గ్రామంలో గవర్నమెంట్ స్కూల్ చదువు. ఊరి గ్రౌండ్స్ లో టెన్నిస్ బాల్ తో క్రికెట్ ఆట. ప్రసారమయ్యే క్రీడలను చూసేందుకు ఇంట్లో టీవీ కూడా లేదు. ఎవరి దగ్గర బౌలింగ్ నేర్చుకోలేదు. నటరాజన్ బంతి వేగాన్ని చూసిన జయ ప్రకాష్ అనే కోచ్ ఆయన తల్లిదండ్రులను ఒప్పించి చెన్నై తీసికెళ్ళి కోచింగ్ ఇప్పించాడు. గురు దక్షిణగా నటరాజన్ ఎడమ చేయిపై జెపి అనే పచ్చబొట్టు ఉంటుంది. జెర్సీపై నటరాజన్ కు బదులు జెపి నట్టు అని రాసి ఉంటుంది. 2017 నుండి ప్రతి ఐ పి ఎల్ లో చోటు సంపాదిస్తున్న క్రికెటర్ ఈయన.ఆ సంవత్సరం కింగ్స్ లెవెన్ పంజాబ్ 3 కోట్లు ఇచ్చి జట్టులోకి తీసుకుంది. ఆ తర్వాత నటరాజన్ వెనక్కి తిరిగి చూడలేదు. వచ్చిన సొమ్ముతో తల్లిదండ్రులకు సుఖమైనా జీవితం, సొంత ఇల్లును అందించాడు. పేదలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. ఈసారి రూ. 10 కోట్లు తీసుకోని ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్నాడు.

నవదీప్ సైనీ విషయానికొస్తే ఆయన హర్యానా, కర్నల్ లోని ఓ ప్రభుత్వ వాహన డ్రైవర్ కొడుకు.సైనీ కూడా క్రికెట్ అకాడెమీకి ఫీజు కట్టె స్తొమత లేక టెన్నిస్ బాల్ తో ప్రాక్టీసు చేసేవాడు. గౌతమ్ గంభీర్ కు నెట్ బౌలర్ గా ఉండి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. 2017 లో ఢిల్లీ డేర్ డెవిల్స్ పది లక్షలకు కొనుగోలు చేస్తే 2018 లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 3 కోట్లు ఇచ్చి ఆడించింది.

యూపీకి చెందిన రింకు సింగ్ తండ్రి ఇంటింటికి ఎల్ పి జి సిలిండర్లు వేస్తుంటాడు. ఇద్దరి అన్నలు ఆటో నడుపుతారు. రింకుని ఐ పి ఎల్ తరపున 2017 లో పది లక్షలతో కింగ్స్ లెవెన్ పంజాబ్ తీసుకుంది. ఆ తర్వాత 2018 లో కోల్ కతా నైట్ రైడర్స్ 80 లక్షలకు కొన్నది. ఈసారి ఆయన ధర రూ . 13 కోట్లు. హైదరాబాద్ కు చెందిన ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ సంగతి తెలిసిందే. ఇటీవల మరణించిన సిరాజ్ తండ్రి నగర వీధుల్లో ఆటో నడిపేవాడు. 2017 లో ఐ పి ఎల్ కోసం హైదరాబాద్ సన్ రైజర్స్ 2.6 కోట్లు పెట్టి కొన్నది. దాంతో ఆ కుటుంబం దశ తిరిగింది. ఇరుకైన వీధుల్లో బతికిన సిరాజ్ ఆ సొమ్ముతో తనవారి కోసం మొదట సౌకర్యవంతమైన ఇంటిని కొన్నాడు. తండ్రికి విశ్రాంతినిచ్చాడు. నమ్మకమైన అట తీరుతో, వివిధ రికార్డులతో సిరాజ్ భారత క్రికెట్ జట్టులో తన చోటును స్థిరం చేసుకొనే ప్రయత్నంలో ఉన్నాడు. ఐ పి ఎల్ 2026 ఆయనకు రూ. 12 కోట్లు తెచ్చిపెడుతోంది. హార్దిక్, కృనాల్ పాండేల తండ్రి కూడా పిల్లల క్రికెట్ శిక్షణకు కోసం సూరత్ నుండి వడొదరకు మారి, కిరాయి ఇంట్లో ఉంటూ చిన్న ఉద్యోగాలు చేశాడు. ఇప్పుడు పాండే సోదరులు భారత జట్టులో తొలి అయిదు స్థానాల్లో ఉన్నారు.రవీంద్ర జడేజా తండ్రి సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేయగా తల్లి నర్స్ గా పని చేసేవారు. తల్లి మరణానికి కుంగిపోయిన జడేజా కొంతకాలం ఆటకు దూరమున్నాడు. ఉమేష్ యాదవ్ తండ్రి మైన్స్ లో పనిచేసేవాడు. మునాఫ్ పటేల్ తండ్రి సొంత భూమిలేని కౌలు రైతు. ఇలా ఆటల్లో రాణింపుతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకోవడం పేద క్రీడాకారుల జీవితాల్లో వచ్చిన కొత్త మలుపు. ఇది మరిన్ని కుటుంబాలకు మార్గదర్శనం కావాలి.



బి.నర్సన్  
9440128169

# కురుక్షేత్రం నుండి కర్తవ్యం వరకు

మానవ నాగరికత ఎంత అభివృద్ధి చెందినా, సాంకేతికత ఎన్ని అద్భుతాలు సృష్టించినా, మనిషి మనస్సులో ఒక అపరిష్కృత ప్రశ్న ఎప్పుడూ మెదులుతూనే ఉంటుంది నేను ఎవరు? నా జీవిత గమ్యం ఏమిటి? ఇంతటి భౌతిక సంపద ఉన్నా నాలో ఈ వెలితి ఎందుకు? ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకోబోయే వరకు ఏదో ఒక లక్ష్యం కోసం, పరుగు తీస్తున్న ఈ కాలంలో, మనకు దిశానిర్దేశం చేసే ఒక లైఫ్ కోచ్ అవసరం ఎంతైనా ఉంది. ఐదు వేల ఏళ్ల క్రితం కురుక్షేత్ర రణరంగంలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి అందించిన బోధనలు, నేటి కార్పొరేట్ రణరంగంలో అలసిపోతున్న ప్రతి మనిషికి అమృత గుళికల వంటివి.మహాభారత యుద్ధం అంటే కేవలం రెండు సైన్యాల మధ్య జరిగిన పోరాటం కాదు. అది ప్రతి మనిషి అంతరంగంలో నిరంతరం సాగే మథనం. అర్జునుడు కేవలం ఒక పాత్ర కాదు, అతడు మనందరి ప్రతినిధి. తన వారు, తన



బంధువులు అనే మమకారం ముందు తన కర్తవ్యాన్ని మరచి పోయిన అర్జునుడు, నేటి సగటు మనిషి పడుతున్న సంఘర్షణకు నిదర్శనం. యుద్ధం చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్న అర్జునుడికి కృష్ణుడు చేసిన ఉపదేశం 'గీత'.మనం కూడా ప్రతిరోజూ అనేక కురుక్షేత్రాలను ఎదుర్కొంటుంటాం. కార్యాలయంలో రాజకీయాలు, కుటుంబంలో కలహాలు, మనసులో ఆశలు-నిరాశల మధ్య పోరాటం. ఈ యుద్ధంలో మనం వెనకడుగు వేయకుండా, ధైర్యంతో ఎలా ముందుకు సాగాలో భగవద్గీత మనకు నేర్పిస్తుంది. జీవితం ఒక పూలబాట కాదు, అది ఒక బాధ్యత అని గుర్తించినప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడు. భగవద్గీతలో ధర్మం అనే పదానికి చాలా విస్తృతమైన అర్థం ఉంది. ధర్మం అంటే కేవలం పూజలు, పునస్కారాలు కాదు. ధర్మం అంటే కర్తవ్యం . సమాజంలో మనకున్న స్థానాన్ని బట్టి మనం చేయవలసిన పనిని చిత్తశుద్ధితో చేయడమే నిజమైన ధర్మం.శ్రీకృష్ణుడు అర్జునుడితో అంటాడు శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ . అంటే, ఇతరుల ధర్మాన్ని అద్భుతంగా అనుసరించడం కంటే, లోపాలు ఉన్నా సరే నీ స్వధర్మాన్ని నువ్వు నిర్వహించడం మిన్న. నేడు మనం పక్కవారిని చూసి అసూయ పడుతుంటాం, వారిలా బ్రతకాలని తాపత్రయపడుతుంటాం. కానీ గీత ఏం చెబుతుందంటే, ప్రతి మనిషికి ఒక ప్రత్యేకమైన స్వభావం (Nature) ఉంటుంది. ఆ స్వభావానికి అనుగుణంగా మన వృత్తిని, ప్రవృత్తిని ఎంచుకున్నప్పుడే మనకు మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఒక డాక్టరుగా, ఇంజనీరుగా లేదా ఒక సామాన్య కార్మికుడిగా మనం చేసే పనిలో దైవత్వాన్ని చూడటమే ధర్మం.నేటి కాలంలో అత్యధికంగా చర్చించబడే అంశం స్ట్రెస్ లేదా ఒత్తిడి. ఈ ఒత్తిడికి ప్రధాన కారణం ఏమిటి? మనం చేసే పని కంటే, ఆ పని వల్ల వచ్చే ఫలితం మీద మనకు ధ్యాస ఎక్కువ ఉండటమే. నేను ఇంత కష్టపడుతున్నాను కదా, నాకు ప్రమోషన్ వస్తుందా? నా వ్యాపారంలో లాభం వస్తుందా? అనే ఆలోచనలే మనల్ని కృంగదీస్తున్నాయి.

జీవితం ఒక పూలబాట కాదు, అది ఒక బాధ్యత అని గుర్తించినప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడు. భగవద్గీతలో ధర్మం అనే పదానికి చాలా విస్తృతమైన అర్థం ఉంది. ధర్మం అంటే కేవలం పూజలు, పునస్కారాలు కాదు. ధర్మం అంటే కర్తవ్యం . సమాజంలో మనకున్న స్థానాన్ని బట్టి మనం చేయవలసిన పనిని చిత్తశుద్ధితో చేయడమే నిజమైన ధర్మం.శ్రీకృష్ణుడు అర్జునుడితో అంటాడు శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ . అంటే, ఇతరుల ధర్మాన్ని అద్భుతంగా అనుసరించడం కంటే, లోపాలు ఉన్నా సరే నీ స్వధర్మాన్ని నువ్వు నిర్వహించడం మిన్న. నేడు మనం పక్కవారిని చూసి అసూయ పడుతుంటాం, వారిలా బ్రతకాలని తాపత్రయపడుతుంటాం. కానీ గీత ఏం చెబుతుందంటే, ప్రతి మనిషికి ఒక ప్రత్యేకమైన స్వభావం (Nature) ఉంటుంది. ఆ స్వభావానికి అనుగుణంగా మన వృత్తిని, ప్రవృత్తిని ఎంచుకున్నప్పుడే మనకు మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఒక డాక్టరుగా, ఇంజనీరుగా లేదా ఒక సామాన్య కార్మికుడిగా మనం చేసే పనిలో దైవత్వాన్ని చూడటమే ధర్మం.

ఇక్కడే శ్రీకృష్ణుడు "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అనే మహోన్నత సూత్రాన్ని బోధించాడు. నీ అధికారం కేవలం పని చేయడం వరకే, ఫలితం మీద నీకు నియంత్రణ లేదు. ఇది వినడానికి కొంచెం కఠినంగా అనిపించినా, ఇందులో అద్భుతమైన శాస్త్రీయ దృక్పథం ఉంది. మనం ఫలితం గురించి ఆలోచిస్తున్నప్పుడు మన ఏకాగ్రత దెబ్బతింటుంది. అదే పని మీద మాత్రమే దృష్టి పెడితే, ఆ పని నాణ్యత పెరుగుతుంది. ఫలితం అనేది ఆటోమేటిక్ గా వస్తుంది. ఫలితాన్ని దైవ ప్రసాదంగా స్వీకరించడం నేర్చుకుంటే, గెలుపుకు పొంగిపోము, ఓటమికి కుంగిపోము. ఇదే నిజమైన సక్సెస్ మంత్రం.మనిషికి ఉన్న అన్ని భయాల్లో పెద్దది మరణ భయం . ఈ భయం వల్లే మనిషి స్వార్థపరుడిగా మారుతున్నాడు. భగవద్గీత రెండవ అధ్యాయం (సాంఖ్య యోగం) లో కృష్ణుడు ఆత్మ గురించి వివరిస్తూ, "ఆత్మకు చావు లేదు, అది పుట్టదు, గిట్టదు" అని చెబుతాడు. శరీరం అనేది ఒక వస్త్రం లాంటిది. పాత బట్టలు తీసేసి కొత్తవి ధరించి నట్లు, ఆత్మ ఒక శరీరం నుండి మరో శరీరానికి మారుతుంది.ఈ జ్ఞానం మనకు కలిగితే, జీవితం పట్ల ఒక నిర్లిప్తత కాకుండా, ఒక గొప్ప స్పష్టత వస్తుంది. మనం ఇక్కడికి వచ్చింది కేవలం సంపాదించడానికి కాదు, ఒక ఉన్నతమైన ప్రయాణంలో భాగంగా ఇక్కడ ఉన్నామని అర్థమవుతుంది. మరణం అనేది అంతం కాదు, అది ఒక మార్పు మాత్రమే అనే సత్యం మనల్ని ధైర్యవంతులుగా చేస్తుంది.మానవ స్వభావాన్ని గీత మూడు గుణాలుగా విభజించింది: సత్వ, రజో, తమో గుణాలు.సత్వ గుణం జ్ఞానం, శాంతి, నిర్మలత్వం.రజో గుణం ఆశ, కోరిక, అతిగా శ్రమించడం, అశాంతి.తమో గుణం బద్ధకం, అజ్ఞానం, నిద్ర.మనం ఏ గుణంలో ఉన్నామో పరీక్షించుకోవాలి. ఆధునిక ప్రపంచం ఎక్కువగా రజో గుణం వైపు పరుగులు తీస్తోంది. దీనివల్ల వేగం పెరిగింది కానీ గమ్యం దొరకడం లేదు. గీత మనల్ని తమో గుణం నుండి రజో గుణానికి, అక్కడి నుండి సత్వ గుణానికి చేరుకోమని ఉద్బోధిస్తుంది. సాత్విక ఆహారం, సాత్విక ఆలోచనలు మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి.జ్ఞానం మరియు కర్మ మార్గాలు కష్టమనిపించే వారికి భక్తి మార్గం ఒక వరప్రసాదం. భగవంతుడు అంటే ఎక్కడో ఆకాశంలో ఉండే శక్తి కాదు, నీ హృదయంలో ఉండే అంతర్యామి. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని కృష్ణుడు అభయమిచ్చాడు. అంటే, నీవు నీ సర్వ భారాలను నాపై వేసి, నీ కర్తవ్యాన్ని నిర్వహించు, నేను నిన్ను చూసుకుంటాను అని అర్థం. ఇక్కడ శరణాగతి అంటే బాధ్యతల నుండి పారిపోవడం కాదు, భగవంతుని అపారమైన కరుణపై నమ్మకం ఉంచి ధైర్యంగా ముందుకు సాగడం.జీవితంలో ఆనందాలు వచ్చినప్పుడు గెంతులేయడం, కష్టాలు వచ్చినప్పుడు కుప్పకూలిపోవడం సామాన్యుల లక్షణం. కానీ గీత మనల్ని స్థితప్రజ్ఞులు గా ఉండమంటుంది. శీతోష్ణ సుఖదుఃఖేషు అంటే చలి ఎండలను ఎలా భరిస్తామో, సుఖదుఃఖాలను కూడా అలాగే స్వీకరించాలి. ఈ సమత్వంబి అలవడితే, మనిషి ఏ పరిస్థితిలోనూ చలించడు. సముద్రంలో ఎన్ని నదులు కలిసినా అది ఎలా గంభీరంగా ఉంటుందో, మనిషి కూడా ఎన్ని కష్టాలు వచ్చినా అంత గంభీరంగా ఉండాలి.ఆధునిక సమస్యలకు పరిష్కారంనేటి యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలు ఆందోళన (Anxiety), ఒంటరితనం (Loneliness), మరియు అర్థం లేని పోటీ. భగవద్గీత వీటన్నింటికీ విరుగుడు.నీవు ఒంటరివి కావు, పరమాత్మ నీతోనే ఉన్నాడు.

నీ గతం గురించి చింతించకు, భవిష్యత్తు గురించి భయపడకు, వర్తమానంలో జీవించు.కోపం అనేది నరకానికి ద్వారం, దానిని అదుపులో ఉంచుకో.కోపం వల్ల బుద్ధి నశిస్తుంది, బుద్ధి నశిస్తే మనిషి పతనం అవుతాడు. నేడు చిన్న చిన్న విషయాలకే ఆవేశపడి జీవితాలను నాశనం చేసుకుంటున్న వారికి గీత ఒక గొప్ప హెచ్చరిక.చివరగా, భగవద్గీత అనేది కేవలం హిందువులకు సంబంధించిన గ్రంథం కాదు. అది మానవజాతి అంతటికీ అన్వయించే ఒక యూనివర్సల్ మాన్యువల్ . యంత్రానికి యూజర్ మాన్యువల్ ఎలాగో, మనిషికి గీత అలాగ. ఇది మనల్ని సన్యాసులుగా మారి అడవులకు వెళ్లమని చెప్పదు. సంసారంలో ఉంటూనే, బాధ్యతలు నెరవేరుస్తూనే, తామరాకు మీద నీటిబొట్టులా ఎలా నిర్లిప్తంగా ఉండాలో నేర్పిస్తుంది.మన జీవిత రథానికి కృష్ణుడిని సారథిగా చేసుకుంటే, అంటే మన బుద్ధిని భగవత్ చింతనతో నింపితే, ఏ యుద్ధమైనా మనం గెలవగలము. గీత చదవడం అంటే ఒక పుస్తకం చదవడం కాదు, మనల్ని మనం చదువుకోవడం. ఈ దివ్య సందేశాన్ని ఆచరణలో పెట్టినప్పుడు, మన జీవితం ఒక అందమైన కావ్యంగా మారుతుంది. శాంతి, సంతృప్తి, ఆనందం మన సొంతమవుతాయి.



డా .సూర్యదేవర రామకృష్ణ  
9490754169

## రూట్ కెనాల్స్

మతాల మంటలు రేపుతూనే  
అధికారపు అంట కాగుతారు  
ఎన్నికల వాసన తగిలితే చాలు  
ఎగేసుకుంటూ పోతారు

కేకలు మీవే కేకులు మీవే  
సోకులు మీవి అరుపులు మావి

హిజాబ్ అని తేజాబ్ అని  
విద్వేషపు ప్రళయ  
బంధాలు మీవి  
సినిమా ఫైల్స్ ను పార్ట్  
పార్ట్ గా తీస్తూ  
బతుకులను విడగొట్టే  
కుట్రలు మీవి

మేం మనుషులం  
కేవలం మనుషులం  
ఈ దేశం ఏ మత నేరగాళ్ల  
అడ్డా కాదు  
ఈ దేశం సామాన్యులది  
రెక్కలకు - డొక్కలకు  
పొంతన కుదరని  
సగటు జీవులది.

మండాది గోపీనాథ్  
98850 45344

## తెరిచిన హృదయం

నా హృదయం సంకుచితం  
కాదు,  
దారి తప్పిన ప్రతిఒక్కరికీ తెరిచి  
ఉన్న రాజమార్గం

గుండెల్లో వెలిగే కాంతిదీపం  
తనకోసమే కాదు,  
చీకట్లలో తచ్చాడే ప్రతి  
బాటసారికి దారి చూపాలి

నది తన ప్రవాహాన్ని ఎప్పుడూ  
దాచుకోదు,  
ఎదురైన ప్రతి దాహార్తిని ఒడిలో  
చేర్చుకుంటుంది

మేఘం కురిసేటప్పుడు  
పొలమేదో, పల్లెదో అని  
తేడా చూపదు

చెట్టు తన నీడను  
కొలవదు,  
వాలిన ప్రతి శరీరానికి  
విశ్రాంతి ఇస్తుంది

మనసు కూడా అలానే  
విస్తరించగలిగితే  
సరిహద్దులు కేవలం గీతలుగానే  
మిగులుతాయి

ఒకరి గాయం మరొకరి నొప్పిగా  
అనిపించిన క్షణమే  
మానవత్వం నిజంగా  
వికసిస్తుంది  
ఆకలితో ఉన్న కళ్లలో  
మన బాధ్యత ప్రతిబింబించాలి

సహాయం అనేది దానం కాదు,  
మన మధ్య ఉన్న గోడల్ని కూల్చే చర్య

చిరునవ్వు ఒక చిన్న వెలుగు,  
కానీ ఎన్నో చీకట్లను చీల్చగల శక్తి

చేతులు కలవడం మాత్రమే  
కాదు,  
హృదయాలు కలిసినప్పుడే  
ప్రపంచం మారుతుంది



సర్వజనహితం అంటే  
ప్రతి మనిషి మరొకరిని  
గౌరవించడం

ఎవరూ పరాయి కాని  
ప్రపంచం,  
ఎవరూ ఒంటరిగా మిగలని  
జీవితం అదే నా అభిమతం

- యండి. ఉస్మాన్ ఖాన్



# జాతీయం-అంతర్జాతీయం



## ఇంధన కొరత లేదు: కేంద్రం

### భారతదేశం వద్ద రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (వుదయం) :**



పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం నేపథ్యంలో, భారతదేశ ముడి చమురు నిల్వలు తగినంత స్థాయిలో ఉన్నాయని, రాబోయే రెండు నెలలకు సరిపడా సరఫరాలను ప్రభుత్వం సమకూర్చుకుందని పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారం జరిగిన అంతర్‌మంత్రిత్వ శాఖల సమావేశంలో తెలిపారు. ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని భరోసా ఇస్తూ, మా శుద్ధి కర్మాగారాలు అత్యున్నత స్థాయిలో పనిచేస్తున్నాయి. రిటైల్ విక్రయ కేంద్రాలలో ఇంధనం నిండుకున్నట్లు ఎటువంటి నివేదికలూ రాలేదు అని శర్మ తెలిపారు.

ప్రపంచ ధరల పోకడలను ప్రస్తావిస్తూ, సుమారు రెండు నెలల క్రితం, బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల శ్రేణిలో ఉండేది; నేడు అది బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును అధిగమించింది అని ఆమె పేర్కొన్నారు. ఈ భారీ పెరుగుదల ఉన్నప్పటికీ, దేశీయ వినియోగదారుల కోసం పెట్రోల్, డీజిల్ ధరలలో ఎటువంటి పెంపూ చేయలేదని ఆమె నొక్కి చెప్పారు. ఏప్రిల్ 6, 2022 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదు; అంతేకాక, మార్చి 2024లో ధరలు రూ. 2 తగ్గించాం. ఆ తగ్గింపు ఇప్పటికీ అమలులో ఉందని ఆమె వివరించారు.

ప్రభుత్వ చర్యల గురించి వివరిస్తూ, అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల నుండి దేశీయ వినియోగదారులను రక్షించేందుకు, ధరలు పెరగకుండా చూసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. అయితే, ధరలను స్థిరంగా కొనసాగించడం వల్ల, పెట్రోల్, డీజిల్ రెండింటిపైనా చమురు మార్కెటింగ్ సంస్థలు నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని ఆమె అంగీకరించారు.

దేశీయ మార్కెట్‌లో ఎటిఎఫ్, డీజిల్ లభ్యతకు భరోసా కల్పించేందుకు, భారత ప్రభుత్వం ఎగుమతి సుంకాన్ని విధించిందని తెలిపారు. శాంతంగా ఉండాలని కోరుతూ, మన వద్ద తగినంత పరిమాణంలో పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉన్నాయని తాను హామీ ఇస్తున్నానని, పౌరులందరూ దయచేసి భయాందోళనలతో కొనుగోళ్లు చేయడం మానుకోవాలని అభ్యర్థిస్తున్నానని శర్మ అన్నారు.

సహజ వాయువు సరఫరాపై ఆమె మాట్లాడుతూ, గృహ వినియోగదారులకు, సిఎన్‌జి రవాణాకు 100 శాతం సరఫరాను నిర్ధారించడం జరిగిందని, విస్తరణ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు, మార్చి నెలలో సుమారు 325,000 కనెక్షన్లకు గ్యాస్ సరఫరా చేశామని, 285,000 కొత్త కనెక్షన్లు అందించామని, 350,000 మంది కొత్త వినియోగదారులు కనెక్షన్ల కోసం నమోదు చేసుకున్నారని వివరించారు.

ఎల్‌పిజి విషయమై మాట్లాడుతూ, సుమారు 60 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎల్‌పిజి ధరలు (సౌదీ సిపి బెంచ్‌మార్క్) 522 డాలర్ల నుండి 780 డాలర్లకి గణనీయంగా పెరిగాయి. ఇంతటి పెరుగుదల ఉన్నప్పటికీ, గృహ వినియోగదారులకు ఎల్‌పిజి సిలిండర్ ధరలలో ఎటువంటి పెంపు లేదని ఆమె పట్టి చూపారు. సరఫరా స్థితిపై మాట్లాడుతూ, ఏ ఎల్పీజీ పంపిణీ కేంద్రంలోనూ సరఫరా నిలిచిపోయినట్లు నివేదికలు లేవు. నిన్న సుమారు 60 లక్షల సిలిండర్లను పంపిణీ చేశాం అని అన్నారు. వాణిజ్య ఎల్పీజీ విషయంలో ప్రభుత్వం సుమారు 70 శాతం సరఫరాను నిర్ధారించింది, అని పేర్కొంటూ, ప్రత్యామ్నాయ ఇంధనంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అదనపు కిరోసిన్‌ను కూడా కేటాయించాం, అని తెలిపారు. వదంతులు, భయాందోళనలను సమర్థవంతంగా నియంత్రించడంలో సహాయపడాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరిగింది. సుమారు 2,800 దాడులు నిర్వహించగా, దాదాపు 500 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ భయాందోళనలతో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీలను కొనుగోలు చేయవద్దని కోరుతున్నాననీ, గృహ వినియోగం కోసం ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచలేదని ఆమె పునరుద్ఘాటించారు.

## కేజ్రీవాల్‌కు నోటీసులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (వుదయం) :**

ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఢిల్లీ హైకోర్టు బుధవారంనాడు నోటీసులు పంపింది. ఎక్సైజ్ పాలసీ కేసులో సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ హాజరుకాలేదంటూ ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో ఆయనను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్ మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన ఉద్దేశపూర్వకంగానే విచారణకు హాజరుకాలేదని ఈడీ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించి ట్రయల్ కోర్టు తప్పిందం చేసిందన్నారు. ఈడీ వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ ఈనెల 29వ తేదీకి కేసును వాయిదా వేసింది.

## దేశాన్ని కొల్లగొట్టడంపైనే బిజెపి దృష్టి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (వుదయం) :**



కొన్ని నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ బుధవారంనాడు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. మోదీ ప్రభుత్వం దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను పూర్తిగా ధ్వంసం చేసిందని ఆరోపించింది.

ఉపశమనం కోసం సామాన్య పౌరులు ఆశిస్తుండగా, ఈ సంక్షోభం నడుమ బీజేపీ నాయకత్వం మాత్రం ప్రజలను దోచుకోవడం, దేశాన్ని కొల్లగొట్టడం'పైనే పూర్తిగా దృష్టి పెట్టిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

మోదీ ప్రభుత్వం దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని దీని ప్రత్యక్ష పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారని, ఎక్స్‌పై చేసిన పోస్టులో ఖర్గే విమర్శించారు.

నేటి నుంచి అనేక నిత్యావసర వస్తువుల ధరలు పెరగనున్నాయని ఆయన అదే పోస్టులో తెలిపారు. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి, సరఫరా అడుగంటిపోయింది. రోడ్డు పక్కన టీ అమ్మే చోట్ల ధరల పెరుగుదల నుంచి మధ్యాహ్న భోజన పథకంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ఖరీదవుతోందని ఆయన అన్నారు. ఒకప్పుడు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చిన విమాన ప్రయాణం ఇప్పుడు అందని కలగా మారిందని, ప్రభుత్వం ధరల పరిమితిని కూడా ఎత్తివేసిందని విమర్శించారు. 900కు పైగా అత్యవసర మందుల ధరలు పెరిగాయని, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు మరింతగా పెరిగాయని అన్నారు. కరోనరీ స్టెంట్ల ధరలు పెరిగాయి, మీరు అధిక టోల్ పన్నులు చెల్లించాల్సి ఉంటుంది, 'హైవే దోపిడీ' జోరుగా సాగుతోంది, స్పీడ్ పోస్ట్ ఛార్జీలు కూడా 34% పెరిగాయని, ప్లాస్టిక్ వస్తువులు, ఉక్కు, సిరామిక్స్‌పై తీవ్ర ప్రభావం పడిందని, రైతులకు పీవీసీ పైపుల ధరలు పెరిగాయి; బిటుమెన్ ధరలు 50% వరకు పెరిగాయి; నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, ఖర్గే వరుసపెట్టి వివరించారు.

సామాన్య పౌరులు, రైతులు, కార్మికులు, ఎంఎస్ ఎంఇ పరిశ్రమలు ఉపశమనం కోసం ఆశతో ఎదురుచూస్తున్న ఈ తరుణంలో, వారి దుస్థితిని పూర్తిగా విస్మరిస్తూ, బీజేపీ నాయకత్వం ఈ సంక్షోభ సమయంలో ప్రజలను దోచుకోవడం, దేశాన్ని కొల్లగొట్టడంపైనే పూర్తిగా దృష్టి సారించిందని ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి లూట్ దివస్ (లూటీ రోజు) అనే శీర్షికతో కూడిన ఒక వీడియో సంకలనాన్ని ఆయన పంచుకున్నారు.

**అందులో వివిధ వస్తువుల ధరల పెరుగుదలకు సంబంధించిన అంశాలు ఇలా ఉన్నాయి**

పశ్చిమ ఆసియాలో విస్తరిస్తున్న సంఘర్షణ కారణంగా ప్రపంచ చమురు ధరలు భారీగా పెరగడంతో, బుధవారం నాడు వాణిజ్య ఎల్పీజీ ధరలు రూ. 195.50 మేర పెంచారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థల గణాంకాల ప్రకారం, ఢిల్లీలో ప్రస్తుతం 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి ధర రూ. 2,078.50గా ఉంది. మార్చి 1న, 19 కిలోల సిలిండర్‌పై ధరలను చివరిసారిగా రూ. 114.5 మేర పెంచారు. మార్చి 7న 14.2 కిలోల గృహ వినియోగ ఎల్.పి.జి. సిలిండర్‌పై రూ. 60 మేర చివరిసారిగా పెంచిన ధరలు ప్రస్తుతం ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతున్నాయి. ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రూ. 913గా ఉంది. గత నెలలో ప్రపంచ చమురు ధరలలో వచ్చిన భారీ పెరుగుదలను ప్రతిబింబిస్తూ, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) లేదా జెట్ ఇంధన ధర బుధవారం నాడు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి, కిలోలీటరుకు రికార్డు స్థాయిలో రూ. 2.07 లక్షలకు చేరుకుంది; అయితే, దేశీయ విమానయాన సంస్థలకు మాత్రం ఈ ధరల పెరుగుదల కేవలం 8.5 శాతంగానే ఉంటుంది. నాన్‌షెడ్యూల్డ్, అడ్‌హాక్, చార్టర్ వంటి ఇతర విమానయాన సంస్థలు చెల్లించే దానిలో సగం దేశీయ విమానయాన సంస్థలు చెల్లిస్తాయి.

వాటికి ధరలు కిలోలీటర్‌కు రూ. 110,703.08 లేదా 114.5 శాతం పెరిగి, రూ. 207,341.22కు చేరాయి. రెండు దశాబ్దాల క్రితం జెట్ ఇంధన ధరలపై నియంత్రణను తొలగించారు. అప్పటి నుండి, విమానయాన సంస్థలతో కుదిరిన ఒక లిఖితపూర్వక అవగాహన ప్రకారం, ఈ ధరలు ప్రామాణిక అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ఉన్నాయి. అయితే, మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన ధరలు పెరగడంతో ఏటీఎఫ్ ధరలను మునుపెన్నడూ లేనంత భారీగా పెంచాల్సిన అవసరం ఏర్పడటంతో, ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఒక క్రమబద్ధమైన విధానాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. పశ్చిమ ఆసియాలో యుద్ధం ఇంధన సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించిన తర్వాత ప్రపంచ చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. గత ఏడాది మార్చిలో లీటరుకు రూ. 2 తగ్గించిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు స్తంభించిపోయాయి; ప్రస్తుతం ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.72, డీజిల్ ధర రూ. 87.62గా ఉంది.

## 25 మంది నక్సలైట్లు లొంగుబాటు



**బీజాపూర్, ఏప్రిల్ 1 (వుదయం) :**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో, 12 మంది మహిళలతో సహా మొత్తం 25 మంది నక్సలైట్లు భద్రతా దళాల ఎదుట లొంగిపోయారు. వీరి నుండి అధికారులు 7 కిలోల బంగారం, రూ. 2.92 కోట్ల నగదు, 93 ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరి అరెస్టు అనంతరం, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో ఇది ఒక కీలక మైలురాయి అని పోలీసులు అభివర్ణించారు.

**నక్సల్ కార్యకలాపాలు దాదాపుగా నిర్మూలితమయ్యాయి**

నక్సలిజం నిర్మూలనకు జరుగుతున్న ప్రయత్నాల మధ్య, బస్తర్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలు దాదాపు పూర్తిగా నిర్మూలితమయ్యాయని బస్తర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) పి. సుందర్‌రాజ్ ఏఎన్ఐ వార్తా సంస్థకి చెప్పారు. ఈ క్షణానికి సాక్ష్యంగా నిలిచేందుకు తామంతా బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్ జిల్లాలో సమావేశమయ్యామని, ఈ రోజు, బస్తర్ డివిజన్‌లో నక్సలైట్ కార్యకలాపాలు పూర్తిగా నిర్మూలితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. తాము తమ పూర్తి లక్ష్యాన్ని దాదాపుగా సాధించామని అన్నారు. మిగిలిన నక్సలైట్లకు సమయం తక్కువగా ఉందని ఆయన ఏఎన్ఐకి తెలిపారు. మిగిలిన నక్సలైట్లు కూడా ఇదే బాటలో నడిచి, జనజీవన స్రవంతిలో కలుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**పాఠశాలల ఏర్పాటుకు ఉద్యమం ప్రారంభం**

ఇదిలా ఉండగా, బస్తర్ ప్రాంతం నుంచి నక్సలిజం పూర్తిగా నిర్మూలితమైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. లోక్‌సభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆయన, నేడు బస్తర్ నుండి నక్సలిజం దాదాపుగా నిర్మూలితమైంది. బస్తర్ వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్క గ్రామంలోనూ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ఒక ఉద్యమం ప్రారంభమైంది. ఈ ప్రాంతంలోని ప్రతి గ్రామంలోనూ రేషన్ దుకాణాన్ని తెరిచేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టబడింది. ప్రతి తహసీల్, పంచాయతీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సిలు), సామాజిక ఆరోగ్య ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని; ప్రస్తుతం వారు ఐదు కిలోల ఆహార ధాన్యాలను పొందుతున్నారు అని పేర్కొన్నారు.

### పెద్ద సంఖ్యలో ఉద్యోగులను

## తొలగించిన ఒరాకిల్

**బెంగళూరు, ఏప్రిల్ 1 (వుదయం) :**




అమెరికాకు చెందిన దిగ్గజ ఐటీ సంస్థ ఒరాకిల్ చేపట్టిన భారీ స్థాయి ఉద్యోగుల కోత ప్రక్రియ ఇప్పుడు భారతదేశానికి కూడా విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించే విస్తృత ప్రణాళికలో భాగంగా భారత్‌లో జరిగిన ప్రక్రియలో, సుమారు 2,000 నుండి 2,500 మంది ఉద్యోగులు ప్రభావితమైనట్లు సమాచారం. అయితే, మరికొన్ని నివేదికల ప్రకారం ఈ సంఖ్య 12,000 వరకు ఉండవచ్చని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులపై ప్రభావం చూపగల ఒక విస్తృత ప్రణాళికలో భాగంగా ఈ తాజా కోతలు ఉన్నాయి. వచ్చే నెలలో మరో విడత తొలగింపులు జరిగే అవకాశం ఉందని వార్తలు వస్తుండటంతో, భారతదేశంతో పాటు ఒరాకిల్ ప్రపంచవ్యాప్త కార్యకలాపాల్లోని ఉద్యోగులలో అనిశ్చితి మరింత పెరుగుతోంది. భారతదేశంలో సుమారు 12,000 మంది ఉద్యోగులను తొలగించారు. ఒక నెలలోపే కంపెనీ మరో భారీ తొలగింపునకు ప్రణాళిక రచిస్తోంది, అని ఈ తొలగింపుల వల్ల ప్రభావితమైన ఇద్దరు వ్యక్తులు పీటీఐకి తెలిపారు. వీరిలో ఒకరు కంపెనీ మానవ వనరుల విభాగానికి చెందినవారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), క్లౌడ్ మౌలిక సదుపాయాల దిశగా వనరులను మళ్లిస్తున్న ఒరాకిల్ పునర్నిర్మాణంలో ఈ తొలగింపులు ఒక భాగం. ఎఐ మౌలిక సదుపాయాలలో సుమారు 50 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని కంపెనీ ప్రణాళికలను ప్రకటించింది. తదుపరి విస్తరణ కోసం 50 బిలియన్ డాలర్ల రుణాన్ని కూడా సేకరించినట్లు సమాచారం. వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, బుధవారం ఉదయం, కొందరైతే తెల్లవారుజామున 6 గంటలకే వారి ఉద్యోగ బాధ్యతలు తక్షణమే రద్దు చేసినట్టు టెర్మినేషన్ (తొలగింపు) ఈమెయిళ్లను అందుకున్నట్లు సమాచారం. ఉద్యోగ విరమణ పత్రాలు, పరిహార వివరాలను స్వీకరించడానికి, ప్రభావిత సిబ్బంది తమ వ్యక్తిగత ఇమెయిల్ చిరునామాను అందించాలని ఆ సందేశంలో సూచించారు. ఇమెయిల్, ఫైళ్లతో సహా కంపెనీ సిస్టమ్‌లకు యాక్సెస్ త్వరలో నిలిపివేస్తామని కూడా అది తెలిపింది. దీనిపై సోషల్ మీడియా వేదికలపై తీవ్ర చర్చ చోటు చేసుకుంటోంది. కంపెనీ తన దృష్టిని ఎఐ పెట్టుబడులపై పెడుతుండటంతో గత ఏడాదే దాదాపు 3000 ఉద్యోగాలను, ఆ పాత్రలను తొలగించింది.

## ఐసిటి తీర్పును సవాలు చేసిన హసీనా

### తీర్పు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 1 :**



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి)కి సవాలు విసిరారు. ఆమెకు ఇటీవల విధించిన మరణశిక్షను రద్దు చేయాలని కోరుతూ ఆమె న్యాయ బృందం అప్పీల్ దాఖలు చేసింది. ఈ మొత్తం న్యాయ ప్రక్రియ అంతర్జాతీయ చట్టాలను దారుణంగా ఉల్లంఘించే రాజకీయ ప్రేరిత బూటకం అని వారు పేర్కొన్నారు. హసీనా న్యాయవాదులు 2026 మార్చి 30న, ట్రిబ్యునల్‌కు ఒక సమగ్ర లేఖను సమర్పించి, ఉరిశిక్ష అమలును తక్షణమే నిలిపివేయాలని, తీర్పును పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం అరుదుగా అనుమతించే పద్ధతి అయిన ఆమె గైర్హాజరులో విచారణ జరిగిందనే వాదనపై ఈ అప్పీల్ కేంద్రీకృతమై ఉంది.

ఆమెకు అభియోగాలను సరిగ్గా సర్వ్ చేయలేదని, అలాగే తనను తాను సమర్థించుకోవడానికి చట్టబద్ధమైన అవకాశం ఇవ్వలేదని, తద్వారా విచారణలో కనీస న్యాయబద్ధతను దెబ్బతీశారని ఆమె తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు.

ఈ సవాలు ఐసిటి సమగ్రతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. న్యాయమూర్తులను యోగ్యత ఆధారంగా కాకుండా రాజకీయ విధేయత ఆధారంగా నియమించారని, వారికి ప్రతిపక్ష పార్టీలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు.

ప్రధాన ప్రాసిక్యూటర్ అవామీ లీగ్‌కు వ్యతిరేకంగా చురుకైన రాజకీయ ప్రచారకర్తగా ఉన్నారని ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ట్రిబ్యునల్ పరిపాలనా ప్రక్రియలో లంచం, అవినీతికి సంబంధించిన వేర్వేరు ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి.

**అధికార పరిధిని అతిక్రమించి...**

ఈ అప్పీల్‌లో ఒక ముఖ్యమైన అంశం ఐసిటి చట్టపరమైన ఆదేశం. వాస్తవానికి 1971 స్వాతంత్ర్య యుద్ధంలోని యుద్ధ నేరాలపై తీర్పు చెప్పడానికి స్థాపించిన ఈ ట్రిబ్యునల్‌ను, 2024లో పౌర నిరసనలకు సంబంధించిన కేసులను విచారించడానికి ఉపయోగిస్తున్నారు. ఇది ట్రిబ్యునల్ అధికార పరిధిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని, ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని సమకాలీన రాజకీయ ప్రతీకారానికి సాధనంగా మారుస్తోందని హసీనా న్యాయవాదులు వాదిస్తున్నారు.

**ప్రపంచ పర్యవేక్షక సంస్థలుహెచ్చరిక**

ఈ కేసు ప్రధాన అంతర్జాతీయ సంస్థల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ రెండూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఇంతటి సందేహాస్పదమైన చట్టపరమైన పరిస్థితులలో అమలు చేసిన మరణశిక్షను తక్షణ ఉరిశిక్ష లేదా న్యాయేతర హత్యగా వర్గీకరిస్తారని హెచ్చరించాయి. తీర్పును తక్షణమే రద్దు చేయాలని, మరణశిక్షను నిలిపివేయాలని, తదుపరి విచారణను పూర్తిగా అంతర్జాతీయ చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని హసీనా న్యాయవాదులు డిమాండ్ చేశారు.

### అంతరిక్ష అంకుర సంస్థల కోసం

## వెంచర్ క్యాపిటల్ ఫండ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (వుదయం) :**

అంతరిక్ష రంగం కోసం కేటాయించిన భారత ప్రత్యేక వెంచర్ క్యాపిటల్ ఫండ్ స్థిరంగా పురోగమిస్తోందని, ఎంపిక చేసిన స్టార్టప్‌లలో 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి పెట్టుబడులు ప్రారంభమవుతాయని భావిస్తున్నట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ప్రధాన మంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు ఇంధనం, అంతరిక్ష విభాగాల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

అభివృద్ధి చెందుతున్న భారత స్పేస్‌టెక్ వ్యవస్థను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన "అంతరిక్ష వెంచర్ క్యాపిటల్ ఫండ్" కీలకమైన సంస్థాగత యంత్రాంగాలతో ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. అంతరిక్ష రంగం కోసం కేటాయించిన వెంచర్ క్యాపిటల్ ఫండ్ స్థితిగతులు, పెట్టుబడులు, లబ్ధిదారులు, రాబడి, ఉపాధి కల్పన గురించి బస్తిపాటి నాగరాజు ఈ ప్రశ్న అడిగారు. సిడ్బీ వెంచర్ క్యాపిటల్ లిమిటెడ్ (ఎస్వీసీఎల్)ను ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా నియమిస్తూ ఈ నిధిని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

**వుదయం డెస్క్, ఏప్రిల్ 1 :**

బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించనున్న నేపథ్యంలో, ఇరాన్, ఇజ్రాయెల్ ,గల్ఫ్ ప్రాంతాల వ్యాప్తంగా దాడులు కొనసాగాయి. ఇలా ఉండగా, టెహ్రాన్‌లోని మాజీ అమెరికా రాయబార కార్యాలయ ప్రాంగణం లోపల ఒక వైమానిక దాడి జరిగినట్లు కనిపించింది. యుద్ధం రెండు, మూడు వారాల్లో ముగుస్తుందని, ఆ వెంటనే అమెరికా దళాలు ఇరాన్‌ను విడిచిపెడతాయని ట్రంప్ పేర్కొన్నప్పటికీ, ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి.

వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రెటరీ కేరోలిన్ లెవిట్ ప్రకారం, ఇరాన్‌పై ఒక తాజా అప్‌డేట్‌ను ఇచ్చేందుకు బుధవారం రాత్రి యుఎస్ అధ్యక్షుడు దేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

టెహ్రాన్‌లో ఇక చేయాల్సింది ఏమీ మిగిలి లేదని పేర్కొంటూ, అమెరికా తాను నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించిందని ట్రంప్ పరోక్షంగా సూచించారు. తనకు ఒక్కటే లక్ష్యం ఉందని, వారి వద్ద ఎటువంటి అణు ఆయుధాలు ఉండకూడదు; ఆ లక్ష్యం ఇప్పుడు నెరవేరిందని, వారి వద్ద ఇక అణ్వాయుధాలు ఉండవని ట్రంప్ పేర్కొన్నారు.

**ఇరాన్ యుద్ధానికి ముగింపు సమీపిస్తోంది**

ఇరాన్‌లో యుద్ధానికి ముగింపు సమీపిస్తోందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నట్లు సమాచారం. ఇరాన్ యుద్ధానికి ముగింపు ఈ రోజే రాకపోవచ్చు, రేపూ రాకపోవచ్చు, కానీ అది కచ్చితంగా రాబోతోంది, అని ఆయన ఫాక్స్‌న్యూస్‌తో అన్నారు.

**అమెరికాపై ఇరాన్‌కు సున్నా నమ్మకం**

అమెరికాపై తమకు ఏమాత్రం విశ్వాసం లేదని, టెహ్రాన్‌లోని ఒక పక్షంతో చర్చలు జరుగుతున్నాయన్న వాదనలో ఎటువంటి నిజం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి పేర్కొన్నట్లు సమాచారం. ఇరాన్‌లో అమెరికా సైన్యం భూతల దాడులకు దిగే అవకాశం ఉందన్న వార్తలపై స్పందిస్తూ, టెహ్రాన్ వారి కోసం వేచి చూస్తోందని అరఘ్చి అన్నారు. అటువంటి సాహసం చేయడానికి వారు తెగిస్తారని నేను అనుకోను. వారిని ఎదుర్కోవడానికి అక్కడ అపారమైన శక్తి సిద్ధంగా ఉంటుంది, అని ఆయన అల్ జజీరా ఛానెల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. మమ్మల్ని మేము ఎలా రక్షించుకోవాలో మాకు బాగా తెలుసు. ఒకవేళ భూతల యుద్ధం సంభవిస్తే, మేము దానిని మరింత సమర్థవంతంగా ఎదుర్కోగలం. ఎటువంటి భూతల దాడినైనా తిప్పికొట్టడానికి మేం పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారు అటువంటి పొరపాటు చేయరని ఆశిస్తున్నాం," అని అరఘ్చి స్పష్టం చేశారు.

**చమురు ధరలు**

ఇరాన్ యుద్ధం త్వరలో ముగుస్తుందన్న ట్రంప్ వ్యాఖ్యలు వ్యాపారులలో ఆశలు రేకెత్తించడంతో బుధవారం చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. అయినప్పటికీ, మార్కెట్ అస్థిరంగానే కొనసాగింది.

రోజు ప్రారంభంలో, జూన్ ఫ్రంట్‌మంత్ బ్రెంట్ కాంట్రాక్ట్ 1.4 శాతం పెరిగి బ్యారెల్‌కు 105.37 డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో, మే నెలకు సంబంధించిన యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఫ్యూచర్స్ 1.6 శాతం పెరిగి బ్యారెల్‌కు 102.97 డాలర్లకు చేరుకుంది.

అయితే, రోజు గడిచే కొద్దీ చమురు ధరలు పడిపోయాయి. బ్రెంట్ క్రూడ్ ధర 5 శాతం తగ్గి, బ్యారెల్‌కు 100 డాలర్ల కంటే దిగువకు పడిపోగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర బ్యారెల్‌కు సుమారు 97 డాలర్ల వద్ద ఉంది.

**ఖతార్ తీరంలో ట్యాంకర్‌పై దాడి: యూకే**

ఖతార్‌లోని దోహాకు ఉత్తరాన సుమారు 17 నాటికల్ మైళ్ల దూరంలో ఒక ట్యాంకర్‌పై రెండు క్షిపణులు దాడి చేశాయని, దీనివల్ల నీటిమట్టానికి పైన ఉన్న ఓడ భాగానికి నష్టం వాటిల్లిందని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యుకెఎంటిఒ) బుధవారం తెలిపింది.

దాడి చేసిన రెండు క్షిపణులలో ఒకటి పేలకుండా ఉన్నట్లు గుర్తించామని బ్రిటిష్ ఏజెన్సీ పేర్కొంది. ఆ ఒక్క క్షిపణి వల్ల చెలరేగిన మంటలను ఆర్పివేశారని కూడా అది తర్వాత తెలిపింది. ఓడలోని సిబ్బంది సురక్షితంగా ఉన్నారని, దీని వల్ల పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడలేదని బ్రిటిష్ ఏజెన్సీ పేర్కొంది. తర్వాత, ఇరాన్ నుంచి మూడు క్రూయిజ్ క్షిపణులతో తమ దేశాన్ని లక్ష్యంగా చేసుకున్నారని ఖతార్ తెలిపింది. తమ సైన్యం రెండు క్రూయిజ్ క్షిపణులను అడ్డుకోగా, మూడో క్షిపణి ఖతార్ ప్రాదేశిక జలాల్లో ఖతార్ ఎనర్జీకి లీజుకు ఇచ్చిన ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది అని గల్ఫ్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

**అమెరికా-ఇజ్రాయెల్ ఇరాన్‌ను క్రమపద్ధతిలో అణచివేశాయి**

ఇరాన్‌తో కొనసాగుతున్న సంఘర్షణలో సాధించిన భారీ విజయాలను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం ప్రశంసించారు. అమెరికాఇజ్రాయెల్ సంయుక్త ప్రయత్నాలు ఇరాన్ ప్రభుత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తున్నాయని ఆయన అన్నారు.

టెహ్రాన్ ప్రభుత్వం ఎప్పుడో ఒకప్పుడు కూలిపోతుందని ఆయన అన్నారు. భారీ ఆంక్షల నుండి బయటపడటానికి ప్రయత్నిస్తూనే, అణు అభివృద్ధి, బాలిస్టిక్ క్షిపణులు మొదలైన వాటి ద్వారా ఇరాన్ తన దారుణ ఆశయాలను సాధించాలని చూసిందని నెతన్యాహు ఆరోపించారు. ఇన్నేళ్లుగా, వీటన్నింటికీ ఇరాన్ దాదాపు ఒక ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇప్పుడు అది అంతా వృధా అయిపోయింది, అని ఆయన పేర్కొన్నారు.

## ముగుస్తుందన్న వార్తల నడుమ తీవ్రమైన యుద్ధం






# కరీంనగర్ |అదిలాబాద్| నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ పూర్తి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- జనగణన 2027 పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :**
జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.
సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం జనగణన 2027 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జనగణన 2027 రెండు దశలలో జరుగుతుందని, ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం మే 10 నుంచి ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించి 35 ప్రశ్నల వివరాలు నెల రోజుల వ్యవధిలో సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 2027 లో హౌస్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాల సేకరణ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి 300 ఇండ్లు/800 జనాభా ఒక బ్లాక్ గా (హెచ్.ఎల్.బీ) నిర్దేశించి జనాభా లెక్కల చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫీల్డ్ సర్వే సమయంలో మనం వేసుకునే అంచనా కంటే ఎక్కువ ఇండ్లు ఉండే అవకాశం ఉన్నందున 15 శాతం అధికంగా ఎన్యుమరేటర్లు నియామకం చేపట్టాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో హెచ్.ఎల్.బీ లు మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్.ఎల్.బీ. పేపర్ మీద రిపోర్ట్ సిద్ధం చేసుకొని ఆన్ లైన్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హెచ్.ఎల్.బీ పరిధిలో ఉన్న ఇండ్లు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఆట స్థలాలు, ఆసుపత్రులు ఏం ఉన్నాయో సరిగ్గా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. హెచ్.ఎల్.బీ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేసుకోగలిగితే రాబోయే 1.5 సంవత్సరాల కాలం పాటు జనాభా లెక్కల కార్యక్రమం అంత ప్రశాంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్.ఎల్.బీ విభజన రాబోయే 10 రోజులలో తహసిల్దారులు స్థానిక పంచాయతీ కార్యదర్శి మున్సిపల్ కమిషనర్లు సహకారంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 200 నుంచి 300 ఇండ్లు ఉన్న చిన్న చిన్న గ్రామ పంచాయతీలు, వార్డుల హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 15 లోపు తుది హెచ్.ఎల్.బీ నిర్ధారణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జనగణన 2027 కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. హౌస్ లిస్టింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 1400 ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశామని, ప్రతి గ్రామం మున్సిపాలిటీ పరిధిలో ఎంతమంది ఎన్యుమరేటర్ అవసరం ఉన్నారో వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు బి. గంగయ్య, సురేష్, ఎంపీడీవోలు, తహసిల్దారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వయోవృద్ధుల సంక్షేమం భద్రతే ప్రభుత్వ లక్ష్యం



- తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ పర్యవేక్షణ బిల్లు 2026 ఆమోదం...
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు...
- ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగులు ట్రాన్స్ జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**
వయోవృద్ధుల సంక్షేమం భద్రత గౌరవప్రదమైన జీవనాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ పర్యవేక్షణ బిల్లు 2026 ను ప్రవేశపెట్టినట్లు అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో బుధవారం వయోవృద్ధు లతో సమావేశ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు తమ వయోవృద్ధుల సంరక్షణకు బాధ్యతగా తీసుకోవాలని తల్లిదండ్రుల ఆర్థిక వైద్య అవసరాలను తీర్చేందుకు ఉద్యోగులు తమ వేతనం నుండి కనీసం 15 శాతం లేదా 10 వేల రూపాయలు (ఏది ఎక్కువైతే అది) మొత్తాన్ని కేటాయించి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు ఈ బిల్లు అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు ఇందులో భాగస్వాములై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రయివేట్ ఉద్యోగులు ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకునేలా బిల్లు నిబంధనలు రూపొందించబడినట్లు తెలిపారు ఈ క్రమంలో ఫిర్యాదులను స్వీకరించి 60 రోజుల లోపు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు అదే విధంగా అప్పీల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి కమిటీలకు క్వాసి జ్యుడీషియల్ అధికారాలు కల్పించనున్నట్లు తెలిపారు బయోలాజికల్ దత్తత తల్లి దండ్రులు వృద్ధాప్య కారణంగా ఆధారపడే తల్లిదండ్రులు ఈ బిల్లులో అర్హులుగా పేర్కొన్నారు ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 సీఆర్పీసీ సెక్షన్ 125 సీనియర్ సిటిజన్స్ చట్టం 2007 నిబంధనల ప్రకారం రూపొందించబడినట్లు తెలిపారు ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసి కుటుంబ బాధ్యతలను చట్టబద్ధంగా అమలు చేయడం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు వయోవృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక నైతిక బాధ్యత అని పేర్కొన్నారు మారుతున్న సామాజిక పరిస్థితుల్లో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని వారికి ఆర్థిక భద్రత గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించినట్లు తెలిపారు ఈ బిల్లుతో ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు ప్రజా ప్రతినిధులు తమ తల్లిదండ్రుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం పెరుగుతుందని కుటుంబ విలువలను కాపాడటానికి ఇది దోహదపడుతుందని మంత్రి వివరించారు తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా బలమైన నిబంధనలు అమలు చేస్తున్నామని తెలిపారు ప్రతి శాఖలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఈ బిల్లును సమర్థవంతంగా అమలు చేయాలని వృద్ధుల సంక్షేమానికి అందరూ కలిసి కృషి చేయాలని కోరారు ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమం మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు వయోవృద్ధుల కొరకు దేశంలోనే మొట్ట మొదటి సారిగా పూర్తి స్థాయిలో పటిష్టమైన బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదం తెలిపేలా కృషి చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల భవనానికి కావాల్సిన వసతులు కల్పిస్తామని తెలిపారు అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లు సమాజానికి ఎంతో అవసరమైనదని పేర్కొన్నారు ఆధునిక జీవన శైలిలో కుటుంబ బంధాలు కొంత వరకు తగ్గుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల పట్ల బాధ్యతను గుర్తు చేసేలా ఈ చట్టం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు ఉద్యోగులు తమ తల్లిదండ్రుల ఆర్థిక ఆరోగ్య అవసరాలను తీర్చడం ద్వారా కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన తెలిపారు ఈ బిల్లులో పొందుపరిచిన నిబంధనలు వృద్ధుల భద్రతను పెంపొందించడంతో పాటు వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు వయోవృద్ధుల కొరకు ఏర్పాటు చేసిన సదన్ భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని మంజూరు చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బిల్లును సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు బిల్లులో పేర్కొన్న నిబంధనల మేరకు ప్రతి శాఖలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి తల్లిదండ్రుల సంరక్షణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామన్నారు తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా స్వీకరించి 60 రోజుల లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపే ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు అదే విధంగా అర్హులైన వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు పథకాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు అంతకు ముందు కార్యక్రమం ప్రారంభంలో ఈ బిల్లు యొక్క ఉద్దేశాల గురించి వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ వివరించడం జరిగింది వయోవృద్ధుల ప్రతినిధులు వారి అభిప్రాయాలను వెలువరించడం జరిగింది రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ పర్యవేక్షణ బిల్లు 2026ను ప్రవేశ పెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు అలాగే రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు గజమాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం సీనియర్ సిటిజన్స్ పత్రిక పిలుపు గోడ పత్రికను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్ లత బి రాజ గౌడ్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్ జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్ సంబంధిత జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరు

**కరీంనగర్, ఏప్రిల్ 1 (వుదయం ప్రతినిధి):**
మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామంలో నేలవేణి జ్యోతి రవి దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి బుధవారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల పరిషత్ అభివృద్ధి వి.వి రాజేశ్వరి,కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు రొంటాల లక్ష్మారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి జన్మదిన వేడుకలు

- ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

**ధర్మపురి ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**
సోదర భావంఆపన్నా హస్తం నినాదంతో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు నియోజక వర్గంలో ఘనంగా జరిగాయి.ఈ సంద ర్భాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగన భట్ల దినేష్ ఆధ్వర్యంలో ఒక గొప్ప సేవా కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. నిరు పేద ఆటో డ్రైవర్ సయ్యద్ అలీమ్ గత కొంతకాలంగా కంటి సమస్యతో బాధప డుతున్నారు.ఆపరేషన్ చేయించుకోవ డానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడు తున్న అలీమ్ విషయం తెలుసుకున్న ఎన్నారై రామడుగు శివకుమార్ స్పందించారు.మంత్రి అడ్లూరి జన్మదినం సందర్భంగా తన వంతు సామాజిక బాధ్యతగా అలీమ్ కంటి ఆపరేషన్ నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆశయాలకు అనుగుణంగా పేదల సేవలో నిమగ్నమవ్వడం సంతోషకరమన్నారు.ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన జన్మదిన వేడుకని ఆయన పేర్కొన్నారు.తమ విన్నపానికి స్పందించి సాయం చేసిన ఎన్నారై శివకుమార్‌ను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సంగ.నరసింహులు,ఎఎంసి డైరెక్టర్ ఎండి.రఫీ దిన్,వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ మెంబెర్ ఎండి షబ్బీర్, కౌన్సిలర్ సంగనభట్ల సంతోషి ,సౌల్ల భీమయ్య ,నరేందర్, బొల్లారం పోచయ్య,పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు బారికేడ్ల వితరణ

**నిజామాబాద్, వుదయం,ఏప్రిల్ 01 :**
జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు బారికేడ్లను, హోర్డింగులను వితరణ చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా వీటిని లాంఛనంగా అందజేశారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికల లింగ నిష్పత్తిని పెంచేందుకు ప్రజలలో అవగాహన పెంపొందించేలా బారికేడ్లు, హోర్డింగులు అందజేయడం అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా సాధికారత విభాగం వారిని ప్రశంసించారు. బాలికలు, మహిళల సహాయం కోసం ఉద్దేశించిన హెల్ప్ లైన్ నెంబర్లతో రూపొందించిన హోర్డింగ్ లను కలెక్టర్ పరిశీలించారు. వీటిని నగరంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాలలో ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఇవి ఉపకరించడంతో పాటు మహిళా సాధికారత పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందేందుకు దోహదపడతాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి పద్మ అనిల్, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు, నీటి సరఫరా పకడ్బందీగా చేయాలి

- వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ మెరుగైన సేవలు అందించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పన్నులు 100 శాతం వసూలు చేయించాలి
- వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ హాజరు




**వేములవాడ, ఏప్రిల్ -01**
వేములవాడ మున్సిపల్ పరిధిలో నిత్యం పారిశుధ్య పనులు, నీటి సరఫరా పనులు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో బుధవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. అందరి సహకారంతో ఇటీవల మున్సిపల్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామని, నూతన సభ్యులకు అభినందనలు తెలియజేసారు. వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపు, పారిశుధ్య పనులకు చెల్లింపులు, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, సంరక్షణ కు ఖర్చు చేయాలని సూచించారు. మున్సిపల్ మొత్తం బడ్జెట్ లో 1/3 శాతం విలీన గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ కార్మికులందరికీ వెంటనే బీమా చేయించాలని కమిషనర్ ను ఆదేశించారు. మున్సిపల్ కు రావాల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని వెల్లడించారు. మున్సిపల్ వార్డ్ సభ్యులు తమ పరిధిలో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలని, అన్ని షాప్ లు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపల్ నిధులతో నిర్మించిన భవనాలు అన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. తడి చెత్తను ఎరువుగా చేసి విక్రయించాలని, పొడి చెత్తను విక్రయిస్తే బల్దియాకు ఆదాయం వస్తుందని తెలిపారు. పార్క్ లు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభానికి సిద్ధం అవుతుందని, నిర్వహణ పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. డీఆర్ సీసీ కేంద్రం పక్కాగా నిర్వహించాలని సూచించారు. నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా వార్డు సభ్యులు, అధికారులు చూసుకోవాలని తెలిపారు. ఏమైనా మరమ్మత్తు ఉంటే చేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించాలి



- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, ఏప్రిల్ 1 (వుదయం ప్రతినిధి):-**
రానున్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి , డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. బుధవారం మినీ సమావేశ మందిరంలో అసోసియేషన్ సభ్యులు, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలు ఎటువంటి లోపాలు లేకుండా సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.వేదిక వద్ద కూర్చునే సౌకర్యాలు, త్రాగునీరు, భోజన ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో ఎన్ వి గిరి, సంఘ సభ్యులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ ప్రచారములో కార్యకర్తలు ముందుండాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ -01 (వుదయం ప్రతినిధి):- :**
ఆధునిక రాజకీయాల్లో డిజిటల్ ప్రచారం కీలకమవుతున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలకు ప్రత్యేక డిజిటల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (AI) వినియోగంతో పాటు పార్టీకి సంబంధించిన డిజిటల్ అప్లికేషన్ల వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా NaMo App వినియోగ విధానం, పార్టీ కార్యక్రమాల సమాచారం పొందడం, ప్రజలతో నేరుగా అనుసంధానం ఏర్పరచడం వంటి అంశాలను కార్యకర్తలకు వివరించారు. అదేవిధంగా SARAL App ద్వారా బూత్ స్థాయి డేటా నమోదు, కార్యకర్తల వివరాల నిర్వహణ, ఎన్నికల సమన్వయం ఎలా చేయాలో ప్రాక్టికల్‌గా చూపించారు. ఐటీ సెల్ కన్వీనర్ అనూప్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సోషల్ మీడియా మరియు మొబైల్ యాప్‌ల వినియోగం ద్వారా పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడం సులభమవుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని చేరవేయడంలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.పండిట్ దినదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలైన అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రజల్లో విస్తరించడంలో డిజిటల్ ప్రచారం కీలకమని నాయకులు తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం డిజిటల్ ఇండియా దిశగా వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, ఐటీ సెల్ ప్రతినిధులు, యువ మోర్చా నాయకులు, మండల స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మెన్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.

**నిర్మల్ ,1 ఏప్రిల్ 2026 (వుదయం ప్రతినిధి):**
ఈనెల నాలుగవ తేదీన (శనివారం) ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లకు పార్టీల వారిగా సీటింగ్ ఏర్పాటు చేసి, త్రాగునీరు అందించాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి, తొలిసారి ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చినందున అదనపు కలెక్టర్ ను, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉసిక ట్రాక్టర్లను పట్టుకున్న జిల్లా కలెక్టర్ కె హరిత

**ఆసిఫాబాద్ ఏప్రిల్ 1 (వుదయం ప్రతినిధి)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత బుధవారం అక్రమంగా ఉచిత తరలిస్తున్న ట్రాక్టర్లను స్వయంగా పట్టుకున్నారు. జిల్లాలోని కాగజ్నగర్ పెద్దవాగు నుండి ఇలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఉసిక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెబ్బెన మండలం రాంపూర్ శివారులో పట్టుకున్నారు. ఎలాంటి కనీస అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వైనంపై కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహిస్తూ అక్రమంగా ఉషిక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. జిల్లాలో గత వారం రోజులుగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రెవెన్యూ పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ అక్రమంగా ఉసిక తరలిస్తున్న వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేయడం జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించింది.



## మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందిస్తుంది

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఏప్రిల్ 1 వుదయం ప్రతినిధి) :**
ప్రభుత్వం మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అలీప్ సంస్థ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు వివిధ వ్యాపారాలు చేసేందుకు గాను రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి కొరకు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యార్థుల దుస్తుల తయారీకి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో అందించారని తెలిపారు. ఎం ఎస్ ఎం ఈ కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహకంలో భాగంగా రాంప్ పథకంలో ఎం ఎస్ ఎం ఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, అలీప్ సంయుక్తంగా రాష్ట్రంలోని మహిళల ఆర్థిక స్వావలంబన కృషి చేస్తున్నాయని తెలిపారు. 1 వేయి 500 స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళల నేతృత్వంలో ఉన్న 500 అంకుర సంస్థల అభ్యున్నతి సాధించాలనే సంకల్పంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ 15 రోజుల పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా పౌరసంబంధాల అధికారిచే జారీ చేయనైనది.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## 20 వార్డుల్లో గ్రామసభనిర్వహణ

◆ దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కే. రమేష్

**వుదయం, దుబ్బాక (ఏప్రిల్ 01):**
దుబ్బాక మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో గురువారం రోజున ఉదయం 10 గంటల నుంచి 11:30 వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభ (వార్డు సభ)ను నిర్వహిస్తున్నట్టు దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ తెలిపారు.బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో గ్రామసభ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవడంతో పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామ సభలో భాగంగా ముందుగా తెలంగాణ తల్లి గీతాలాపనతో పాటు సీఎం సందేశము , ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, నూతనంగా తీసుకువచ్చిన పథకాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. దానితోపాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి నూతనంగా దరఖాస్తులను తీసుకుంటామన్నారు. వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు గ్రామసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి





**సిద్దిపేట, ఏప్రిల్ 1(వుదయం):**
జిల్లాలో రబీ (యాసంగి) 202526 సీజన్‌లో ప్యాడీ కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు.బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వరి ధాన్యం సేకరణ, మద్దతు ధర అమలు అంశాలపై డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా తదితర శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి జిల్లాలో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన మంచినీటి సదుపాయం, టెంట్లు, బ్యానర్లు, ప్యాడీ క్లీనర్లు, రిజిస్టర్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రం బార్డర్ వరకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు.అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి నష్టపోకుండా ఎత్తైన ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలని, రైతులు పండించిన పంటను కల్లాల్లో బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేల రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా, రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు తెలియజేయాలని సూచించారు.ధాన్యాన్ని బాగా తూర్పారబెట్టిన తరువాత మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేలా చూడాలని, రైతులతో పూర్తి బాధ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కన్సెంట్ తీసుకోవాలని తెలిపారు.ఈ నెలలో ధాన్యం దిగుబడి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మీటర్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మధ్యాహ్నం కల్లా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మిల్లుల సామర్థ్యాన్ని బట్టి కేటాయించిన ధాన్యం దిగుమతి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, స్టోరేజ్ సామర్థ్యాన్ని ముందుగానే సమీక్షించుకోవాలని, అవసరమైతే అదనపు నిల్వ స్థలాన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎక్కడైనా లోపాలు తలెత్తితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలను ధృవీకరించడంలో నిర్లక్ష్యం వహిస్తే వ్యవసాయ శాఖ అధికారులపై కూడా తీవ్ర చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై అధికారి తనూజ, డియం సివిల్ సప్లై అధికారి గోపీకృష్ణ, ఎల్డియం హరిబాబు, మార్కెటింగ్ అధికారి నాగరాజు, అడిషనల్ డిఆర్డిఏ సుధీర్ బాబు, మెప్మా పిడి హన్మంత్ రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రానివ్వొద్దు

◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**అలంపూర్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ అలంపూర్ తహసిల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులతో సమావేశమై మాట్లాడారు. సెన్సస్ పై ఇప్పటికే జిల్లాలో కార్యకలాపాలు మొదలయ్యాయని, సంబంధిత అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు గది, ఇతర పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం అలంపూర్ మున్సిపల్ కార్మికులు తమకు పెండింగ్ లో ఉన్న జీతాలను ఇప్పించాలని కలెక్టర్ ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అలంపూర్ లోని నిర్మాణంలో ఉన్న పలు ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అలంపూర్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో తిరుగుతూ పలువురు రోగులు, సహాయకులతో మాట్లాడారు. ఫార్మసీ, ఎక్స్రే, డయాలసిస్ యూనిట్, తదితర విభాగాలను పరిశీలించారు. హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఓపిల సంఖ్య పెరగాలని, సబ్ సెంటర్స్ నుంచి రోగులను రెఫర్ చేయాల్సి వస్తే ప్రభుత్వ ఆసుపత్రులకే పంపించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తి, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అలంపూర్ దేవాలయాల విశిష్టతను కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అలంపూర్ ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలను పెద్ద ఎత్తున పెంచి పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో అలంపూర్ మండల ప్రత్యేక అధికారి విమల, తహసిల్దారు ప్రభాకర్, ఎంపీడీవో పద్మావతి, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ రెండవ తేదీన నిర్వహించే గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దారులు, మండల అభివృద్ధి అధికారులు, పురపాలక సంఘాల కమిషనర్లు, తదితరులతో జిల్లా కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా గ్రామసభల నిర్వహణపై మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ, వార్డ్ సభలను ఉదయం 9 గంటలకే ప్రారంభించాలని, సభలకు వచ్చే ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సభల్లో సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొనేలా చూడాలన్నారు. ఇప్పటికే అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకాలు, చేపట్టిన ఆయా అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఆయా పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలను ఇప్పటికే సంబంధిత మండలాలకు పంపించినందున సభల్లో వివరించాలన్నారు. కొంతమంది లబ్ధిదారులతో సభల్లో మాట్లాడించాలని, ఆయా పథకాలపై వారి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యలపై కూడా చర్చించాలన్నారు. సభల్లో ప్రజలు ఏమైనా సమస్యలు తెలియజేస్తే వాటిని నోట్ చేసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

**వేసవిలో త్రాగునీటి సమస్యల నివారణకు చర్యలు**

వేసవిలో జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడకుండా సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని, వడదెబ్బ బారిన పడిన వారికి అవసరమైన వైద్య సహాయం చేయాలన్నారు. దాతల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకునేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలన్నారు. 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాల గురించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినందున అమలు చేయాలన్నారు. సంబంధిత మండలాల అధికారులు తమ పరిధిలోని గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలను తరచు సందర్శించాలని అక్కడి కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. జనాభా గణనకు సంబంధించి ఇప్పటికే జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వ విధి విధానాల ప్రకారం సంబంధిత సిబ్బంది ముందుకెళ్లాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో సంబంధిత అధికారులు ఎల్లవేళలా ముందుండాలని, జిల్లా అధికార యంత్రాంగం తరపున తాము కూడా ఏ సమస్య వచ్చిన పరిష్కరించేందుకు సహకరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి వేడుకకు చీకోటి ప్రవీణ్ రాక

**నారాయణపేట, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి)**
నారాయణపేట జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 2న సాయంత్రం బారంబావి నుంచి నిర్వహించనున్న వీర హనుమాన్ శోభాయాత్రకు ముఖ్య అతిథిగా చికోటి ప్రవీణ్, మదన్ గుప్తా హాజ రవుతున్నట్లు విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నాయకు లు కన్న శివకుమార్, ప్రవీణ్, శ్రవణ్, ప్రకాష్ భట్టాడ్, సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం సాయంత్రం నిర్వ హించే వీర హనుమాన్ శోభా యాత్రకు జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల నుంచి, బస్తీల నుంచి పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. శోభా యాత్ర అనంతరం గొడుగు గేరీ హనుమాన్ మందిరం వద్ద సభ ఉంటుందన్నారు. కాషాయ ధ్వజాల తో ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నిబంధనలు తప్పనిసరి పాటించాలి





**వనపర్తి, ఏప్రిల్ 1 (వుదయం పతినిధి ):**
ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం రేట్ చార్టులను ప్రదర్శించడంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం ఐ.డి. ఓ.సి కాన్ఫరెన్స్ హాల్లో ప్రయివేట్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి, పలు దరఖాస్తులను సమీక్షించారు.3 ఆసుపత్రులు, 3 క్లినిక్ లు, 1 డయాగ్నొస్టిక్ సెంటర్, 4 స్కానింగ్ కేంద్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేసింది. కొత్తగా ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న కిరణ్ గ్యాస్ ట్రోల్ లివర్ ఎండోస్కోపీ సెంటర్ క్లినిక్, డాక్టర్ మనిషా రెడ్డి పాలి క్లినిక్, గాయత్రి డెంటల్ క్లినిక్ లకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా కొత్త హాస్పిటల్ కోసం దరఖాస్తు చేసుకున్న రవీంద్రబాబు హాస్పిటల్, హైందవ్ న్యూరో హాస్పిటల్, ఆర్య హాస్పిటల్ కి కమిటీ ఆమోదం తెలిపింది. వీటితోపాటు ఒక డయాగ్నస్టిక్ సెంటర్, నాలుగు(2కొత్తవి +2 రెన్యువల్) స్కానింగ్ కేంద్రాలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్q మాట్లాడుతూ ఆసుపత్రులు నిబంధనలకు తు.చ. తప్పకుండ పాటించాలని, సకాలంలో రెన్యువల్ కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆస్పత్రులు పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులు, క్లినిక్ లలో రేట్ ఛార్ట్స్ తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా స్కానింగ్ కేంద్రాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా జాగ్రత్త పడాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని తెలిపారు. అటువంటి సంఘటనలు ఏవైనా జిల్లాలో ఉంటే దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, డి ఎస్పీ బాలాజీ నాయక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాసులు, డాక్టర్ బాబు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ




**సంగారెడ్డి, ఏప్రిల్ 01 (వుదయం):**
స్వామియే శరణం అయ్యప్ప స్వామి జన్మదినం పురస్కరించుకొని బుధవారం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో సాహితీ హాస్పిటల్ ఎండి రాము సాహితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది రోగులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాము మాట్లాడుతూ అన్న ప్రసాదం ప్రతి బుధవారం హాస్పిటల్లో రోగులకు ఏర్పాటు చేస్తున్నామని అన్న ప్రసాద వితరణ ప్రారంభించి 100 వారాలు పూర్తయిందని అయ్యప్ప స్వామి దయతో భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు

## ఆలయాల పరిశీలనలో కలెక్టర్

**గద్వాల,ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**



అలంపూర్ ఆలయాలను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తి ఆధ్వర్యంలో అధికారులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు కలెక్టర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం, జోగులాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పర్యటనలో మండల ప్రత్యేక అధికారి విమల, తహసిల్దార్ ప్రభాకర్ ఎంపీడీవో పద్మావతి, మున్సిపల్ కమిషనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిగిలో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు





**వికారాబాద్, ఏప్రిల్ 01 వుదయం ప్రతినిధి:**
జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి పట్టణ పరిధిలో టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.ఇన్‌స్పెక్టర్ ఎస్కే అన్వర్ పాషా మరియు వారి బృందం నిర్వహించిన ఈ దాడులలో అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వ, కుళ్ళిన మాంసం విక్రయం మరియు నిబంధనలకు విరుద్ధంగా ఐస్‌క్రీమ్‌ల తయారీ చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.మొదటగా, పరిగి విద్యానగర్ కాలనీకి చెందిన కృష్ణ (35) అనే వ్యక్తి తన నివాసంలో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ తనిఖీల్లో 5 నిండుగా ఉన్న సబ్సిడీ సిలిండర్లు, 4 ఖాళీ సిలిండర్లు మరియు 3 కమర్షియల్ నిండు సిలిండర్లతో కలిపి మొత్తం *12 సిలిండర్లను *టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండో ఘటనలో,పరిగి విద్యానగర్ కాలనీలో నివాసముండే మహ్మద్ ఖలీల్ (34) అనే వ్యక్తి తన మటన్ షాపునకు సంబంధించి సుమారు 35 కిలోల కుళ్ళిన మాంసాన్ని * నిల్వ ఉంచినట్లు గుర్తించి, దానిని అధికారులు సీజ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటలాడుతున్న ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.అదేవిధంగా, పరిగి మెయిన్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా, గడువు ముగిసిన ముడి సరుకులు మరియు పారిశ్రామిక రంగులు ఉపయోగించి ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న *శ్రీ నిత్య ఐస్‌క్రీమ్ యూనిట్‌పై పోలీసులు దాడి చేశారు. దీని నిర్వాహకుడు వికారాబాద్‌కు చెందిన వర్కాల హన్మంతు (45),కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో సిద్ధార్థ కాలనీకి చెందిన కె. రమేష్ (42), తన నివాసంలోనే తయారీ తేదీ, గడువు తేదీలు లేకుండా మహా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితులందరినీ తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పరిగి పోలీస్ స్టేషన్‌లో అప్పగించి,కేసులు నమోదు చేసి నట్లు ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా గా వెల్లడించారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ,**

"ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఎటువంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని ఆమె హెచ్చరించారు కేవలం లాభాల కోసం కల్తీ ఆహార పదార్థాలు తయారు చేయడం, గడువు ముగిసిన లేదా కుళ్ళిన పదార్థాలను విక్రయించడం చాలా తీవ్రమైన నేరంగా తెలియజేస్తూ ,ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ చేయడం కూడా చట్ట విరుద్ధమే కాకుండా, అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉందని. ఇటువంటి నిర్లక్ష్య చర్యలు సమీప ప్రాంత ప్రజల భద్రతకు కూడా ముప్పుగా మారుతాయని,ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ప్రత్యేకంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల నాణ్యతపై అధికారులు మరింత కఠినంగా నిఘా ఉంచాలని ఆమె ఆదేశించారు. హోటళ్లు, మాంసం దుకాణాలు, ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని ఎస్పీ తెలిపారు. లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహించడం లేదా నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉంచడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఇక పై ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయని,నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ,ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## గ్రామ సభలు, మున్సిపల్ వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలి

**గూగుల్ మీట్లో అధికారులకు పలు సూచనలు**
**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**






**ఉమ్మడి మెదక్ , ఏప్రిల్ 01(వుదయం):**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలు, మున్సిపల్ వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా బుధవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆమె పలు సూచనలు చేశారు.గ్రామ సభలు, మున్సిపల్ సభలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో టామ్‌టామ్ నిర్వహించి సభలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత గత రెండున్నర సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను గ్రామ సభల ద్వారా ప్రజలకు వివరించాలని చెప్పారు. అలాగే కొత్తగా అమలు చేయబోయే పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.రైతు భరోసా, రుణ మాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించి కరదీపికలు తయారు చేసి గ్రామ సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ అందజేయాలని సూచించారు. లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించాలని పేర్కొన్నారు.గ్రామ సభలలో అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. గ్రామ సభలకు ఎక్కువ మంది హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టెంట్, షామియానా, తాగునీరు, ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించేందుకు టీవీ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. సభలను ఉదయం 10 గంటలకు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, సభ నిర్వహణపై మినిట్ టు మినిట్ కార్యాచరణను అధికారులు పాటించాలని ఆదేశించారు.
ఈ గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్య, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## మూసాపేట్ మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**మహబూబ్ నగర్ ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి)**



ప్రభుత్వ ఆదేశాల ననుసరించి ఏప్రిల్ 1 నుండి జిల్లాలో ఇసుక బుకింగ్,సరఫరా ను మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్ లో మాత్రమే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మూసాపేట మండలం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృత పర్యటన నిర్వహించి, మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, చౌకధర దుకాణం, ఇందిరమ్మ ఇళ్లు, అనంతరం పోల్కంపల్లి గ్రామంలో ఇసుక రీచ్, పిఎసిఎస్ ఎరువుల దుకాణం ను తనిఖీ చేశారు.తొలుత మూసాపేట్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మన ఇసుక విధానం ద్వారా ఇసుక బుకింగ్ ఏ విధంగా నిర్వహిస్తున్నారు పరిశీలించారు .జిల్లాలో ఇసుక బుకింగ్,సరఫరా నూరు శాతం ఆన్లైన్ లో ద్వారానే నిర్వహించనున్నట్లు,మాన్యువల్ గా కూపన్ లు జారీ చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.భూ భారతి దరఖాస్తుల పై సమీక్షించారు.14 దరఖాస్తులు పరిష్కరించవలసి ఉందని తహశీల్దార్ తెలిపారు.నిర్ణీత పెండింగ్ లో నున్న భూ సమస్యల దరఖాస్తులను నిర్ణీత వ్యవధి లో పరిష్కారం చేయాలని ఆదేశించారు .అనంతరం మండల కేంద్రంలో ఉన్న చౌకధర దుకాణం నెంబర్ 4 ను సందర్శించారు లబ్ధిదారుల తో మాట్లాడి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. బియ్యం నాణ్యత బాగుందని కలెక్టర్ కు తెలిపారు.ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు సన్న బియ్యం ఉచితంగా ఏప్రిల్ 30 వరకు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.మండలకేంద్రంలో ఉన్న ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపుల గురించి తెలుసుకున్నారు.

**పోల్కం పల్లి లో ఇసుక రీచ్ ను,ఎరువుల దుకాణం తనిఖీ ......**

అనంతరం జిల్లా కలెక్టర్ మండలంలోని పోల్కంపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ ఉన్న ఇసుక రీచ్ ను సందర్శించారు. రీచ్ నుండి ఇసుక సరఫరా కేటాయింపు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లాలో ఇసుక కేటాయింపులు ఏప్రిల్ 1 నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని,

### ఇసుక రీచ్ ఎరువుల దుకాణాల తనిఖీ

తదనుగుణంగా ఇసుక బుకింగ్ ను ఆన్లైన్లోనే నిర్వహించాలని అధికారులకు అన్నారు.ఈ సందర్భంగా అక్కడున్న స్యాండ్ రీచ్ అధికారి రంగయ్యాతో మాట్లాడుతూ ఇసుక బుకింగ్ ఆన్లైన్ ద్వారానే తీసుకుంటున్నారా, రోజుకు ఎన్ని బుకింగ్స్ వస్తున్నాయి, 10 కిలోమీటర్ల పరిధిలో ఇసుకను తరలించేందుకు ఎంత పేమెంట్ తీసుకుంటున్నారు, లేబర్ కు ఎంత చెల్లిస్తున్నారు, ఇసుక అక్రమ తవ్వకాలేమైనా జరుగుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ఇసుక కేటాయింపులో పారదర్శకత పాటించడంతో పాటు ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. తదనంతరం కలెక్టర్ ఖుష్బూ గుప్తా పోల్కంపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని సందర్శించి, అక్కడ ఉన్న పి.ఏ.సి.ఎస్ ఎరువుల దుకాణం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మూసాపేట వ్యవసాయ అధికారి అనిల్ తో మాట్లాడుతూ యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్ గురించి తెలుసుకున్నారు. అలాగే రైతులకు ఎరువులు సమయానికి అందుతున్నాయా, అందుబాటులో ఉన్న నిల్వలు రైతుల అవసరాలకు సరిపోతున్నాయా అనే విషయాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం అక్కడున్న ఎరువుల స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఎరువుల విక్రయం, నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని, రికార్డులను సరిగా నిర్వహించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, ఆర్.డి. ఓ నవీన్,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్,పౌర సరఫరాల డి.ఎం. రవి నాయక్,గృహ నిర్మాణ పి.డి.ఉపేందర్ రెడ్డి,మైన్స్ ఏ.డి.గోవింద రాజులు,తహశీల్దార్ రాజు తదితరులు ఉన్నారు.

## బాలింతలకు పౌష్టికాహార పంపిణీ



**వుదయం టేకుమట్ల, ఏప్రిల్ 01(వుదయం జిల్లా ప్రతినిధి):**
మండలంలోని ఎంపేడు గ్రామంలో బాలింతలకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
సర్పంచ్ ఇసంపల్లి హారిక హాజరై గ్రామంలోని బాలింతలకు కోడి గుడ్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రసవానంతరం బాలింతలు ఎదుర్కొనే శారీరక బలహీనత,
రక్తహీనత వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రోటీన్‌లు అధికంగా ఉండే కోడిగుడ్లు, పౌష్టికాహారం అందించాలని ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలపై శ్రద్ధ వహించాలని సూచించారు.

## అజహర్ షరీఫ్‌కు ట్రెజరీ సహాయ కోశాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు



**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 01(వుదయం జిల్లా ప్రతినిధి):**
భూపాలపల్లి ట్రెజరీ కార్యాలయంలో ఉపకోషాధికారిగా విధులు నిర్వహిస్తున్న అజహర్ షరీఫ్‌కు సహాయ కోశాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, హైదరాబాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు జారీ చేసిన ఆదేశాల ప్రకారం, అజహర్ షరీఫ్ తన ప్రస్తుత విధులతో పాటు సహాయ కోశాధికారిగా అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.
శాఖ కార్యకలాపాలు మరింత సమర్ధవంతంగా కొనసాగేందుకు ఈ నియామకం దోహదపడుతుందని డిటిఓ జ్యోతిరావు తెలిపారు. అజహర్ షరీఫ్ గతంలో కూడా తన విధులను సమర్థంగా నిర్వహించిన అనుభవం ఉండటంతో, కొత్త బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
సహాయ కోశాధికారి పదవీ బాధ్యతలు చేపట్టిన అజహర్ షరీఫ్ ను సిబ్బంది అభినందించారు.

## 5గురు గంజాయి స్మగ్లర్లకు 20 ఏళ్ల జైలు శిక్ష



**ఆత్మకూర్, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :**
ఆత్మకూర్ గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడిన ఐదుగురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి బి. అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు శాయంపేట, ఆత్మకూర్ మండలాలకు చెందిన పావురాల వెంకటేష్, అబ్బోజు వెంకటేష్,పరుపల్లి కార్తీక్, అనంతుల సాంబయ్య కొక్కరకొండ చంద్రయ్యలు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన నిందితులందరు, ఓ ముఠాగా ఏర్పడి, ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం ప్రాంతంలో పెద్ద మొత్తంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, ఎక్కువ మొత్తంలో మహారాష్ట్రలో విక్రయించేందుకు, రహస్యంగా కార్లో స్మగ్లింగ్ పాల్పడుతున్న ఐదు నిందితులను ఆత్మకూరు పోలీసులు చౌలపల్లి గ్రామ శివారు ప్రాంతంలో అరెస్ట్ చేసి వీరి నుండి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఆత్మకూరు ఇన్స్పెక్టర్ రాజలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నేరం రుజువు కావడంతో న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాజమల్లారెడ్డి వాదించగా, ప్రస్తుతం ఇన్స్ స్పెక్టర్ ఆర్.సంతోష్,కోర్టు లైజన్ మహిళా ఆఫీసర్ కె. పరమేశ్వరి, కానిస్టేబుల్ ఆర్. ఉమేష్ పలువురు సాక్షులను కోర్టులో హాజరుపర్చారు.

## మాజీ జడ్పీటీసీ భౌతిక కాయానికి పూలమాల వేసిన ఎర్రబెల్లి



**రాయపర్తి ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :**
మండలం కొలన్ పల్లి గ్రామంలో రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ వంగళ యాకమ్మ ఉదయం గుండె పోటుతో మరణించగా వారి భౌతిక కాయానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పూలమాల వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు .ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మునవత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి పూసమధు నాయకులు లేతకుల రంగారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గుగులోత్ జాజు నాయక్,
తోట నర్సింగం,గారే నర్సయ్య , కర్రె రవీందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి,పల్లె ఎల్ల గౌడ్, చందు రాము, గజ్జవెల్లి ప్రసాద్,స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన సదానందం



**పరకాల, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :**
కౌకొండ గ్రామంలో మూర్తాల శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుక బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభ కార్యానికి పలువురు రాజకీయ ప్రముఖులు మరియు గ్రామ పెద్దలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ముఖ్య అతిథులుగా మాజీ జిల్లా ఓడిసిఎంఎస్ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం, ప్రముఖ నాయకులు ముక్కెర సురేష్ గౌడ్, రామారావు హాజరయ్యారు. కళ్యాణ వేదిక వద్ద వారు వధూవరులకు పూలమాలలు వేసి, అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన జంట నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి - సురక్షితంగా ఇంటికి చేరండి

**ప్రమాదాల నివారణకే హెల్మెట్ ధారణ**
**గూడూరు సీఐ. వినయ్**



**కొత్తగూడ, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి ):**
రహదారి భద్రతపై అవగాహన కల్పించడం, వంద శాతం హెల్మెట్ ధారణను ప్రోత్సహించడమే లక్ష్యంగా కొత్తగూడ మండలంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ శబరిష్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, మంగళవారం కొత్తగూడ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గూడూరు సీఐ వినయ్, కొత్తగూడ ఎస్సై రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు.50 మంది వాహనదారులను గుర్తించి, వారికి పోలీసు శాఖ తరపున 50 హెల్మెట్లను బహుకరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం చట్టం కోసం కాదని, ప్రాణ రక్షణ కోసమని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ శ్రీ శబరిష్ ఐపిఎస్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సీఐ వినయ్ తెలిపారు.ఈ సందర్భంగా సీఐ వినయ్ మాట్లాడుతూ....
"ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తగిలే గాయాల వల్లనే ఎక్కువ ప్రాణ నష్టం జరుగుతోంది. దీనిని అరికట్టాలంటే ప్రతి వాహనదారుడు బాధ్యతగా హెల్మెట్ ధరించాలి" అని అన్నారు. ఎస్సై రాజ్ కుమార్ మాట్లాడుతూ, పెగడపల్లి గ్రామంలో వంద శాతం హెల్మెట్ ధారణ లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.మండల పోలీసులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం పట్ల స్థానిక ప్రజలు మరియు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. హెల్మెట్లు అందుకున్న వారు ఇకపై నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## తప్పుడు వార్త పై మండిపడ్డ పులిగిల్ల గ్రామ రైతులు

**మేం ఎక్కడ తుమ్మ చెట్లు నరక లేదు**
**గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ఎలాంటి సంబంధం లేదు**
**పులిగిల్ల గ్రామ రైతులు**



**పరకాల, ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి) :**
హనుమకొండ జిల్లా నడికుడ మండలం పులిగిల్ల గ్రామంలో గ్రామ శివారులో ఉన్న నల్లచెరువు కట్టపై తుమ్మ చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారంటూ గ్రామస్తులు అడ్డుకున్నారు అనే కథనంపై ఓ పేపర్లో వచ్చిన కథనంపై పులిగిల్ల రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టం చేసి వ్యవసాయ పంటలు పండిస్తే తుమ్మ చెట్ల నీడ వల్ల ఆ పంట ఏపుగా పెరగడం లేదని ఆ చెట్ల పైన ఉన్న ఆకులను తొలగించామే తప్ప ఎక్కడ కూడా నరికి వేయలేదు ఈ విషయంపై పులిగిల్ల గ్రామ పాలకవర్గానికి ఎలాంటి సంబంధం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురించే వారిపైన ప్రచురించేందుకు అవకాశం ఇస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలనీ రైతులు అన్నారు.త్వరలోనే ఉన్నతాధికారాలు కలిసి అన్ని విషయాలు చేర్చిస్తమంటూ రైతులు చెప్పారు.. 17 ఎకరాల విస్తీర్ణంలో 50 ఏళ్ల నాటి సుమారు 100 తుమ్మ చెట్లు నరికారని వీటి బహిరంగ మార్కెట్లో 10 లక్షలు ఉంటుందని ఓ పేపరు వచ్చిన కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలు తప్పుడు కథనాలు రాస్తే రాసిన వారు రాపిచ్చిన వారి పైన చర్యలు తీసుకుంటామని పులిగిల్ల రైతులు హెచ్చరించారు.
ఆరుగాలం కష్టం చేసి వ్యవసాయం చేస్తే మీకు తెలుస్తుంది. ఊరు మీద తిరిగి రాజకీయాలు చేస్తే మీకేం తెలుస్తుంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వార్తలు రాసేవారు, రాపిచ్చే వారి పైన చర్యలు ఉంటాయి ఊళ్ళో తిరగకుండా చేస్తామంటూ కూడా పులిగిల్ల రైతులు హెచ్చరించారు.

## గ్రామ సమస్యలు తక్షణ పరిష్కారం కోసమే గ్రామ సభలు

**ఎంపీడీవో ఏ. రవీంద్రనాథ్**




**మహాదేవపూర్ ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**
గ్రామ సమస్యలు తక్షణ పరిష్కారం కోసమే గ్రామ సభ కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించడం జరుగుతుందని మహాదేవపూర్ ఎంపీడీవో ఏ. రవీంద్రనాథ్ అన్నారు మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం మండల ప్రత్యేక ఎంపీడీవో రవీంద్రనాథ్ అధ్యక్షతన మండలంలోని సర్పంచ్ లు పంచాయతీ కార్యదర్శులతోపాటు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల తో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళిక లో భాగంగా ఏప్రిల్ 2 వ తేది న అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభ లు నిర్వహించాలని, గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం గ్రామ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించడం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యొక్క లక్ష్యమని తెలిపారు. అంతేకాకుండా గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా ముందస్తుగా గ్రామంలో టాంటాం చేయించి గ్రామ సభ నిర్వహించాలని సూచించారు.గ్రామసభల్లో తాగునీరు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కూడా సూచించారు. గ్రామసభ యొక్క ఎజెండాను ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించాలని, గ్రామసభలలో సమగ్ర చర్చ జరిగేలా చూడాలని తెలిపారు. గ్రామసభలలో రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి,గృహ జ్యోతి, పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై ప్రత్యేకంగా చర్చించాలని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయినందున గ్రామసభల ద్వారా త్రాగునీరు, పారిశుద్ధము వంటి పనులకు చేపట్టుటకు గ్రామసభల ద్వారా చర్చించి పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సర్పంచులకు పలు సూచనలు ఇచ్చారు.
ఈసమావేశంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్, గ్రామ పంచాయతీల సర్పంచులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల తోపాటు పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించిన ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు

**వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్**



**పర్వతగిరి, ఏప్రిల్ ఒకటి (వుదయం ప్రతినిధి ) :**
పర్వతగిరి మండల కేంద్రంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ బుధవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు కుమార్తె పిన్నింటి అపూర్వ రావు వివాహ మహోత్సవంలో భాగంగా బుధవారం హల్దీ వేడుక నిర్వహించిన వేడుకలో నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించినారు.ఎమ్మెల్యే వెంట హన్మకొండ కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగళి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జాటోతు శ్రీనివాస్ నాయక్, పిన్నింటి సునీల్ రావు, కర్ర హరీష్‌రెడ్డి, జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, పత్రి భాను ప్రసాద్, కత్తి సుధీర్ గౌడ్, నిఖిల్ రావు తో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడి పోషకాహారంపై అవగాహన

**వంటల పోటీలు**
**బహుమతుల ప్రధానోత్సవం.**
**తాహసిల్దార్ నంగునూరి రమేష్.**



**ఖానాపురం, ఏప్రిల్ 1 (వుదయం ప్రతినిధి):**
అంగన్వాడి కేంద్రాల నుండి అందజేసే పోషకాహారంపై అంగన్వాడి పిల్ల తలులకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అవగాహన కల్పించినట్లు తాహసిల్దార్ నంగునూరి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించి వంటల పోటీలను ఏర్పాటు చేసి రుచికరమైన వంటలను తయారుచేసిన పిల్లల తల్లులకు బహుమతులు అందజేసినట్లు తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రమ, గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, సిహెచ్ఓ లీల, ఏఎన్ఎం రాగం సునీత ఐకెపి సిసి కరుణ, వార్డు సభ్యులు
వేములపల్లి వెంకటప్రసాదరావు, గుల్లపల్లి విజయ్, చలికంటి మల్లికార్జున్, కందుల రమసాంబయ్య, పాంశెట్టి లక్ష్మి, తోటకూరి సంధ్య, పల్నాటి నిర్మలశ్రీను, అంగన్వాడి టీచర్స్ మల్లికాంబ, సుజాత, నాగమణి, ఇందిరా, హైమావతి పిల్లల తల్లులు గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో క్రమశిక్షణ నేర్పించే విషయంలో అంగన్వాడి టీచర్లు బాధ్యతగా వ్యవహరించాలి

**సర్పంచ్ హసీనా బానో**



**మహాదేవపూర్ ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**
పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్‌వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరించాలని మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బానో అన్నారు మహాదేవపూర్ మండల కేంద్రంలోని 1మరియు 8 అంగన్వాడి సెంటర్ లలో బుధవారం చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం తోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ హసీనా బానో పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే తరం దృఢంగా ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు గర్భిణీలకు బాలింతలకు పౌష్టిక ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందని తెలిపారు అదే కాకుండా అంగన్వాడీ కేంద్రాలలో 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని అన్నారు.
చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్‌వాడీ టీచరే తల్లి వంటి వారన్నారు. వారిని ప్రేమగా చూసుకుంటూ ప్రాథమిక విద్యను అందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలని, చిన్నతనం నుంచే బడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలనే సదుద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్‌వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పిన్నింటి సుజాత, నాగలత,తోపాటు బాలింతలు గర్భిణీలు చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి ముక్త్ భారత్ రెండో దశ



**ధర్మసాగర్ ఏప్రిల్ 01 ( వుదయం ప్రతినిధి ):**
ఈరోజు జిల్లా క్షయ నివారణ అధికారి డా. హిమబిందు మాట్లాడుతూ, టిబి ముక్త్ భారత్ రెండో దశ కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండలంలో మూడు గ్రామాలు ధర్మసాగర్, ఎల్కుర్తి, మల్లక్కపల్లి గ్రామ పంచాయతీలలో వంద రోజుల పాటు ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాలు ద్వారా 14 సంవత్సరాలు పైబడిన అందరికీ సర్వే చేసి లక్షణాలు వున్న వారికీ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు ఎక్స్ రే పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వాడుకొని రెండు వారాల మించి దగ్గు, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం, రెమెడీలో రక్తం పడటం, ఆయాసం, ఆకలి తగ్గిపోవడం లాంటి లక్షణాలు వున్నమీ దగ్గర లో వున్న ఆరోగ్య ఉప కేంద్రం లేదా పల్లె దవాఖానలో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి అలాగే మీ చుట్టూ ప్రక్కల ఉన్న వారికి అవగాహన కల్పించి వారిని ఉచిత ఎక్స్రేలు ఉచిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 112 కు పైగా ధర్మసాగర్ ప్రజలు దీన్ని ఉపయోగించుకున్నారు. టిబి ముక్త్ భారత్ మొదటి ఫేజ్ లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కు గాను హన్మకొండ జిల్లా అవార్డు అందుకున్న సందర్భంగా ధర్మ సాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది జిల్లా క్షయ నివారణ అధికారి డా. హిమబిందు ని సన్మానించారు.
ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ ,
పల్లె దవకాన డాక్టర్ మహేందర్ రావు, సూపర్వైజర్స్ రామ్మోహన్, సులోచన,ప్రసన్నకుమారి, సీనియర్ అసిస్టెంట్ రాధిక ఆయుష్ ఫార్మసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ ఏఎన్ఎమ్స్ ఆశాలు మరియు జిల్లా స్థాయి నుండి టిబి సంబంధించిన టెక్నీషియన్స్ పాల్గొని విజయవంతం చేశారు.

## పొంగులేటిని విమర్శించే అర్హత లేదు



**గార్ల ఏప్రిల్ 01(వుదయం):-**
తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించే అర్హత బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు లేదని పొంగులేటిపై చేస్తున్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని గార్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు.
బుదవారం స్థానిక గార్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండా వెంకట్ రెడ్డి, జాతీయ శ్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్త నుంచి అసమాన్య నాయకుడిగా ఎదిగిన పొంగులేటిపై అర్థం లేని విమర్శలు చేయడం అవివేకమని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2012 నుంచి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రాష్ట్ర ప్రజల ప్రేమాభిమానాలు పొందుతున్న జననాయకుడు పొంగులేటి అని ఆయన మీద అర్థికపరమైన విమర్శలు చేస్తున్నవారు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు.పొంగులేటి ఎదుగుదలను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్న వారి వ్యాఖ్యాలని వెనిక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ బాపనపల్లి సుందర్,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు షైక్ యాకూబ్ పాషా, కోలా కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టు సాయన్న, పిల్లలమర్రి వీరస్వామి, కోలా రుత్విక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పై అవగాహన సదస్సు



**సర్పంచ్ గారే సంహేద్ర బిక్షపతి**
**రాయపర్తి ఏప్రిల్ 01 (వుదయం ప్రతినిధి):**
పిల్లలకు పౌష్టికాహారం అందించాలనీ గ్రామ ప్రథమ పౌరాలు గారే సంహేద్ర బిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని కొత్త రాయప
అంగన్వాడి సెంటర్ లలో బుధవారం చిన్నారులకు పౌష్టికాహారం కార్యక్రమంతోపాటు గర్భిణీలకు బాలింతలకు కిశోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ గారే సంహేద్ర బిక్షపతి హాజరై అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలు రాబోయే తరం దృఢంగా ఉండాలని
ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు గర్భిణీలకు బాలింతలకు పౌష్టిక ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందని తెలిపారు. అదే కాకుండా అంగన్వాడీ కేంద్రాలలో 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల చిన్నారులకు కార్యక్రమం చేపట్టిందని అన్నారు.చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్‌వాడీ టీచరే తల్లి వంటి వారన్నారు. వారిని ప్రేమగా చూసుకుంటూ ప్రాథమిక విద్యను అందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలని, చిన్నతనం నుంచే బడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలనే సదుద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు తెలిపారు.
పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్‌వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి డెబోర, అంగన్వాడీ టీచర్ లు ఐత కృష్ణవేణి, ఐత విజయరాణి, చంద్రకళ గారే కవిత తోపాటు బాలింతలు గర్భిణీలు చిన్నారులు పాల్గొన్నారు.

## మూడు నెలల ఉచిత సన్నబియ్యాన్ని పంపిణీ

**గ్రామ సర్పంచ్ గారే సంహేద్ర బిక్షపతి**
**రాయపర్తి ఏప్రిల్ 1 (వుదయం ప్రతినిధి):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూడు నెలలకు సరిపడ సన్నబియ్యాన్ని రాయపర్తి మండల కేంద్రంలోని రేషన్ చౌక్ దుకాణం లో గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకంలో ఇది ఒకటి నిరుపేదలకు సన్న బియ్యం ఇవ్వాలి అనే ఉద్దేశంతో సమాజంలో అందరూ సమానులే దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మచ్చ రమేష్, మైనార్టీ మండల నాయకులు ఎండి గౌసు ఖాన్, డీలర్ పరకాల నాగరాజు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## చెమటతో తిప్పలా?

ఎండలో పొరపాటున బయట అడుగుపెట్టామంటే చాలు... చెమటతో ఒళ్లంతా తడిసిపోతుంది. శరీరానికి పట్టింది కాసేపటి ఆరిపోతుంది. కురులతోనే సమస్య. ఓ పట్టాన ఆరదు. పైగా దుర్వాసన, ఇన్‌ఫెక్షన్లు. తిప్పలు తప్పాలంటే... ఈ చిట్కాలు ప్రయత్నించండి. తలలో చెమట తగ్గాలంటే ముందు చేయాల్సింది కేశ ఉత్పత్తులను మార్చడమే. ఈకాలం జిడ్డుగా ఉండే నూనెలు, క్రీమీ షాంపూలకు దూరంగా ఉండాలి. వీటికి మాడునుంచి విడుదలయ్యే నూనెలు, దుమ్మూ చేరి సూక్ష్మజీవులకు ఆవాసాలుగా మారతాయి. కాబట్టి, నీటి, జెల్ ఆధారిత షాంపూలను ఉపయోగించాలి. ఎండ వేడి నుంచి తప్పించుకోవడానికి చల్లదనం కోసం వెదుకుతుంటాం కదా! కురులకీ అది అవసరమే. అందుకని తల స్నానానికి ముందు కలబంద గుజ్జును కానీ, పుదీనా రసాన్ని కానీ మాడుకి పట్టించండి. ఇవి ఇన్‌ఫెక్షన్లను దూరంగా ఉంచడంతోపాటు, మాడునీ తాజాగా ఉంచుతాయి. ప్రతి రెండు రోజులకో సారి తలస్నానం తప్పని సరి. అప్పుడు మాడు శుభ్రంగా ఉంటుంది. అయితే కురులు పూర్తిగా ఆరాకే జడ వేసుకోవాలి. జడనీ వీలైనంత వదులుగా వేసుకోండి. తలమీద నేరుగా పడే ఎండ కూడా చెమటకి కారణమే. కాబట్టి, ఎండలోకి వెళ్తున్నప్పుడు కాటన్, గాలి ప్రసరణ బాగుండే వస్త్రాలు లేదా టోపీతో తలని కవర్ చేయడం అలవాటు చేసుకుంటే మంచిది. చెమట నుంచి పూర్తిగా తప్పించుకోవడం కష్టం. కానీ కొన్ని జాగ్రత్తలతో సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. కురులనీ ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ప్రయత్నించండి మరి.



## కొబ్బరి నీళ్లు తాగొద్దు అంటున్నారా..!

గర్భిణులు తినే ఆహారం మీద ఎన్ని అపోహలో. పుచ్చకాయ తింటే పిల్లలకు జలుబు చేస్తుంది అంటారు. కొబ్బరి నీళ్లు తాగితే జుట్టు సరిగా పెరగదు అంటారు. ఆఖరికి చపాతీ తిన్నా వేడిచేస్తుందని మందలిస్తారు. కానీ వీటన్నింటి వల్లా ఎన్ని ప్రయోజనాలో తెలుసా? ఇవి తింటే మొదటి త్రైమాసికంలో వచ్చే చాలా సమస్యలకు చెక్ పెట్టేయొచ్చు అంటున్నారు వైద్యులు. కొబ్బరినీళ్లు తాగితే... మొదటి మూడునెలల్లో చాలామందికి మార్నింగ్ సిక్‌నెస్ ఎక్కువగా ఉంటుంది. వాంతులు అవుతూ ఉంటాయి. నీళ్లు తాగినా నిలవవు. దాంతో శరీరాన్ని నిస్సత్తువ ఆవరిస్తుంది. డీహైడ్రేషన్ సమస్యలూ ఎక్కువే. ఈ సమయంలో రోజుకి గ్లాస్ కొబ్బరినీళ్లు తాగడం వల్ల ఈ సమస్యలు అన్నింటి నుంచి ఉపశమనం పొందొచ్చు. శరీరం కోల్పోయే ఎలక్ట్రొలైట్లు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. మెగ్నీషియం, పొటాషియం వంటి సూక్ష్మపోషకాలు కూడా దీనిలో అధికం.



పుచ్చకాయ తింటే... దీనిలో 90శాతం నీళ్లు ఉంటాయి. దాంతో డీహైడ్రేషన్ దరిచేరదు. గర్భిణులకు కాళ్లు, పాదాలు వాపు వస్తుంటాయి. పుచ్చకాయ తింటే ఈ పరిస్థితి నుం చి కాస్త ఉపశమనం కలుగుతుంది. పైగా ఇది తేలికగా జీర్ణమవుతుంది. గ్యాస్, హార్ట్‌బర్న్ వంటి సమస్యలు ఉండవు. దీనిలో విటమిన్ ఎ,సి పొటాషియం పుష్కలంగా ఉంటాయి. బిడ్డ ఎదుగుదలకు సహకరిస్తాయి ఇవి. చపాతీ... దీనిలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండి రోజంతా శక్తినిస్తాయి. ఫైబర్ కూడా అధికమే. మొదటి త్రైమాసికంలో వచ్చే మలబద్ధకం సమస్యని నియంత్రిస్తుంది. అన్నం కంటే చపాతీ నెమ్మదిగా జీర్ణం కావడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలూ స్థిరంగా ఉంటాయి. ఇందులో ఉండే ప్రొటీన్లు, విట మిన్లు, ఐరన్... బిడ్డ పెరుగుదలకు మేలు చేస్తాయి. అయితే అతి ఏదైనా అనర్థమే. అందుకే మితంగా అవసరానికి తగి నంత మాత్రమే తినాలి. ప్రతి రెండు గంటలకోసారి కొద్దికొద్దిగా తింటేమొదటి త్రైమాసికంలో ఎదురయ్యే చాలా సమస్యలకు చెక్ చెప్పేయొచ్చు. పాటిస్తారుగా మరి.

## ఆయాస పడుతున్నారట..!

గంటల తరబడి కదలకుండా ఒకే దగ్గర కూర్చోవడం, తెరలకే పరిమితం కావడం, శారీరకంగా చురుగ్గా లేకపోవడం పెద్దవాళ్లలోనే కాదు పిల్లలోనూ అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని ఇదివరకే చాలా సర్వేలు వెల్లడించాయి. అయినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు అంటోంది మరో అధ్యయనం. 'స్పోర్ట్జ్ విలేజ్ ఎడ్యూస్పోర్ట్స్' అనే సంస్థ మనదేశంలో ఇటీవల ఓ వార్షిక ఆరోగ్య సర్వేను చేపట్టింది. దీనిలో 333 స్కూళ్లలోని 1,41,840 మంది పిల్లలు భాగం అయ్యారు. వీళ్లందరికీ బీఎమ్ఐ, ఫిట్‌నెస్, కోర్ స్ట్రెంత్, ఫ్లెక్సిబిలిటీకి సంబంధించిన వివిధ వ్యాయామాలు, పరుగు వంటి పోటీలను పెట్టారట. దీనిలో 34శాతం మంది పిల్లలే ఏరోబిక్ సామర్థ్యాల్ని అందుకోగలిగారట. అంటే దాదాపు ముగ్గురిలో ఒకరు మాత్రమే ఆయాసం లేకుండా పరుగెత్తగలిగారు. ఆక్సిజన్ స్థాయుల్లోని హెచ్చుతగ్గుల్ని తట్టుకోగలిగారట. అంతేకాదు, బీఎమ్ఐ ప్రకారం 40 శాతం మంది పిల్లలు అధిక, తక్కువ బరువు సమస్యలతో సతమతం అవుతున్నట్లు తేలింది. కోర్ స్ట్రెంత్‌లోనూ 49శాతం మంది వెనకబడినట్లు వెల్లడించిందీ అధ్యయనం. ఆరుబయట ఆటలు తగ్గడం, ఒత్తిడి పెరగడం, సరైన ఆహార ప్రమాణాల్ని పాటించకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు నిపుణులు. పాఠశాలలు, తల్లిదండ్రులు ఇకనైనా వీటిపై ధ్యాస పెట్టాలని సూచిస్తున్నారు. ఇవే పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో వీళ్లం చిన్నవయసులోనే దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యే ముప్పు ఎక్కువని చెబుతోందీ సర్వే.



## అందానికి.. పసుపు నూనె!



అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి వివిధ రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ వాడడం మనకు అలవాటే! ఈ క్రమంలో పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన అత్యవసర నూనె వల్ల కూడా సౌందర్యపరంగా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. సీబమ్ ఉత్పత్తి పెరగడం వల్ల చర్మంపై ఎక్కువ నూనె ఉత్పత్తై జిడ్డుగా మారుతుంది. తద్వారా ముఖంపై మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. సీబమ్ ఉత్పత్తిని క్రమబద్ధీకరించి.. జిడ్డుదనాన్ని తొలగించడంలో పసుపు నూనె కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా మొటిమల బెడద తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. చర్మానికి తేమనందించి పొడి చర్మ సమస్యను దూరం చేస్తాయి. ముఖంపై ముడతలు, గీతలు రాకుండా చేసి.. తద్వారా యవ్వనంగా కనిపించేలా చేసేందుకు ఈ నూనె తోడ్పడుతుంది. ఈ ఎసెన్షియల్ ఆయిల్ వల్ల చర్మానికే కాదు.. కురులకు కూడా చక్కని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. చుండ్రుని నివారించడంతో పాటు జుట్టు రాలడాన్ని అరికట్టడంలోనూ ఇది ఉపకరిస్తుంది. అలాగే దీనిలో యాంటీ ఫంగల్ గుణాలు ఉండడం వల్ల ఇవి కుదుళ్లలో ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయి. దీనికోసం ఈ నూనెను నేరుగా కాకుండా మనం ఉపయోగించే సాధారణ నూనె (కొబ్బరినూనె, బాదంనూనె..)లో కొన్ని చుక్కలు కలుపుకొని ఉపయోగించాలంటున్నారు నిపుణులు. ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. కాబట్టి వాపు నుంచి ఉపశమనం పొందడానికి కూడా ఈ ఆయిల్‌ను ఉపయోగించచ్చు. పాదాల్లో పగుళ్లను తగ్గించడానికి కూడా ఇది బాగా ఉపకరిస్తుంది. దీనికోసం కొబ్బరినూనె లేదా ఆముదంలో రెండు చుక్కల పసుపు నూనె కలిపి ఆ మిశ్రమంతో రోజూ పాదాలను మృదువుగా మర్దన చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల తక్కువ సమయంలోనే పగుళ్లు తగ్గడంతో పాటు పాదాలు మృదువుగా మారతాయి.

ఇందులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయి.

కొన్ని రకాల మచ్చలను నివారించే సౌందర్యోత్పత్తుల్లో కూడా ఈ నూనెను వాడతారు.

గమనిక: పసుపు నూనె అత్యవసర నూనె. కాబట్టి దీన్ని నేరుగా చర్మానికి, కుదుళ్లకు అప్లై చేయకూడదు. కొబ్బరి, జొజోబా, ఆలివ్, రోజ్‌హిప్.. వంటి క్యారియర్ ఆయిల్స్‌లో ఈ నూనెను ఐదారు చుక్కలు కలుపుకొని ఉపయోగించడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఎదురుకాకుండా జాగ్రత్తపడచ్చు.

## చలువ చేసే గంజి!

వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచేందుకూ, శక్తిని ఇచ్చేందుకూ గంజిని మించిన ఔషధం లేదంటారు పెద్దలు. మరి ఇంతగా ఇందులో ఏం ప్రయోజనాలున్నాయి? అసలు దీన్ని ఎలా కాయాలి? తెలుసుకుందామా! బియ్యంతో: అన్నం ఉడికించిన తర్వాత వార్చిన నీటినే గంజిగా పిలుస్తారు. ఇది శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఎండ వల్ల కలిగే అలసటను తగ్గిస్తుంది. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల పోగొట్టుకున్న ఎలక్ట్రొలైట్స్‌ను ఇది తిరిగి సమకూరుస్తుంది. రాగులతో: రాగి పిండిని నీటిలో ఉడికించి, మజ్జిగ కలిపి తయారు చేస్తారు. రాగులకు సహజంగానే చలువ చేసే గుణం ఉంటుంది. దీన్ని గంజిగా కాయడం వల్ల ఇందులో కాల్షియం, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. ఫలితంగా శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుతుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తుంది. చద్ది అన్నంతో: రాత్రి మిగి లిన అన్నంలో నీళ్లు పోసి, మరుసటి రోజు ఉదయం తీసుకుంటే ఆ అన్నం మంచి అల్పాహారంగా, ఇందులోని నీరు... అద్భుతమైన ప్రోబయాటిక్ పానీయంగా ఉపయోగపడతాయి. ఈ గంజి పేగు ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలనూ, కడుపులో మంటనూ తగ్గిస్తుంది. సామలతో: చిరుధాన్యాల్లో ఒకటైన సామలను ఉడకబెట్టి గంజి చేస్తారు. ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఉత్తమమైన డైట్. ఇది నీరసాన్ని తగ్గించి, రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. సజ్జలతో: చలువ చేసే సజ్జ పిండిని పులియబెట్టి అంబలిలా కాస్తారు. దీన్నే సజ్జ గంజిగానూ పిలుస్తారు. ఇది శరీరంలోని వేడిని బయటకు పంపుతుంది. తీవ్రమైన ఎండలు ఉన్నప్పుడు శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇచ్చేందుకు ఇది బెస్ట్ డ్రింక్.



## ఈ పదార్థాలతో.. వేసవిలో చల్లగా..!

వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఈ కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి. అందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉపయోగపడతాయని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. ఈ క్రమంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి ఎలాంటి పదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాం రండి.. వేసవి వేడి నుంచి తట్టుకోవడానికి ఈ కాలంలో వచ్చే కొన్ని పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా తాటి ముంజలు, పుచ్చకాయ, తర్బూజా.. వంటి పండ్లు అటు రుచికి రుచితో పాటు ఇటు శరీరానికి చలువను అందిస్తాయట. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగడం తప్పనిసరి. అయితే నీళ్లతో పాటు నిమ్మరసం, లెమన్‌గ్రాస్ టీ, మిల్క్‌షేక్, కోకమ్ పండుతో చేసిన షర్బత్, గుల్‌కంద్, ఆమ్ పన్నా, సత్తు డ్రింక్ (శెనగలు–బెల్లం కలిపి సత్తుపిండితో చేసే పానీయం), అంబలి, కొబ్బరి నీళ్లు.. మొదలైనవి తీసుకోవాలి. ఇవి రుచికరంగా ఉండడమే కాదు.. వీటితో శరీరానికి ఎక్కువ మొత్తంలో నీరు కూడా అందుతుంది. డ్రింక్స్, పండ్లే కాదు.. మనం రోజూ రెండు పూటలా తీసుకునే భోజనం విషయంలోనూ పలు మార్పులు–చేర్పులు చేసుకోవాలి. పెరుగన్నం–అప్పడాలు కలిపి తీసుకోవడం, జొన్నల్ని బాగా ఉడికించుకొని సబ్జీ (అన్ని కూరగాయలను కలిపి చేసే కర్రీ)తో కలిపి తినడం, గంజి, పోహా, పెరుగు, అన్నం – మామిడికాయ పచ్చిపులుసు.. ఇలాంటి ఫుడ్ కాంబినేషన్స్‌ని భోజనంలో భాగంగా తీసుకోవాలి. ఫలితంగా ఇవి అధిక వేడి నుంచి శరీరాన్ని కాపాడి శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయి.



## ఈ అలవాట్లు దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయట!

నోటి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం' అంటున్నారు వైద్యులు. మరి, ఇది సాధ్యం కావాలంటే దంతాలు, చిగుళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అయితే ఈ క్రమంలో మనం పాటించే కొన్ని అలవాట్లు దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేమిటో తెలుసుకుందాం రండి.. మరీ ఎక్కువ సేపు బ్రష్ చేయకూడదన్న విషయం తెలిసిందే! అలాగని మరీ తక్కువ సమయం కూడా బ్రషింగ్‌కి సరిపోదంటున్నారు నిపుణులు. కనీసం రెండు నిమిషాలైనా దీనికి కేటాయించి.. ఈ వ్యవధిలో దంతాలు, చిగుళ్లు, పళ్ల వెనక భాగాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు. అలాగే ఈ క్రమంలో డెంటల్ ఫ్లాస్ ప్రక్రియను పాటించడం మర్చిపోకూడదు. దీనివల్ల పళ్ల మధ్యలో ఇరుక్కున్న పదార్థాల అవశేషాలు తొలగిపోయి పాచి పేరుకుపోకుండా జాగ్రత్తపడచ్చు. ఇందుకోసం ఫ్లాస్ దారాన్ని లేదంటే మౌత్‌వాష్‌ను ఉపయోగించచ్చంటున్నారు నిపుణులు. అయితే ఈ మౌత్‌వాష్ బ్రషింగ్‌కి ప్రత్యామ్నాయం కాదన్న విషయమూ గుర్తుపెట్టుకోవాలని చెబుతున్నారు. కొంతమంది బ్రషింగ్ బాగానే చేస్తారు.. కానీ నాలుక సంగతి మర్చిపోతుంటారు.. ఏదో అలా పైపైన శుభ్రం చేసుకుంటుంటారు. అయితే నాలుకను సరిగ్గా శుభ్రం చేసుకోవడం కూడా బ్రషింగ్‌లో ఓ ముఖ్య భాగం అంటున్నారు నిపుణులు. లేదంటే దానిపై బ్యాక్టీరియా పేరుకుపోయి నోటి దుర్వాసనకు కారణమవుతుందని చెబుతున్నారు. కొంతమందికి చల్లటి పదార్థాలు నోట్లో వేసుకోగానే పళ్లు జివ్వుమంటాయి.. మరికొందరికి ఏమీ అనిపించదు. కానీ ఈ అలవాటు దంత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. దీనివల్ల దంతాలపై ఉన్న ఎనామిల్‌పై కనిపించని పగుళ్లు ఏర్పడి.. క్రమంగా అది దంతాల డ్యామేజ్‌కి కారణమవుతుందంటున్నారు. కాబట్టి మరీ చల్లటి పదార్థాలు తీసుకోకపోవడమే మంచిదని చెబుతున్నారు. కొంతమందికి చిరుతిండ్లు అధికంగా తినే అలవాటుంటుంది. ఈ క్రమంలో ఎప్పుడు చూసినా ఏదో ఒకటి నములుతూనే ఉంటారు. ఇలా విరామం లేకుండా తినడం వల్ల ఆయా పదార్థాల్లోని ఆమ్లత్వాన్ని నోట్లోని లాలాజలం తటస్థీకరించలేకపోతుందట! దీనివల్ల దంతక్షయం వచ్చే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి గ్యాప్ లేకుండా తినే అలవాటును మానుకోమంటున్నారు. అలాగే దంతాల ఆరోగ్యాన్ని పెంచే ఆహారం తీసుకోమని సలహా ఇస్తున్నారు. ఇందులోనూ ముఖ్యంగా ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు, పాలు–పాల పదార్థాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే పదార్థాలు.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ముఖ్యమంటున్నారు. ఆమ్ల గుణాలతో కూడిన కొన్ని రకాల పండ్లు, పానీయాలు, వంటకాలు.. మొదలైన వాటిని (నిమ్మ, ద్రాక్ష, కమలా.. మొదలైనవి) తిన్న వెంటనే బ్రష్ చేస్తుంటారు కొందరు. దీనివల్ల పళ్లపై ఉన్న ఎనామిల్ తొలగిపోతుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఆమ్లత్వం ఎనామిల్‌ని బలహీనపరుస్తుందట! కాబట్టి ఈ పదార్థాలు తిన్న వెంటనే కాకుండా.. ఓ అరగంట ఆగి బ్రష్ చేసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే పళ్లు తోముకునేటప్పుడు కూడా బలంగా కాకుండా.. నెమ్మదిగా, మృదువైన బ్రిజిల్స్ ఉన్న చెక్క బ్రష్‌ని ఉపయోగించడం మేలంటున్నారు. ఈ అలవాట్లు పాటించడంతో పాటు దంతాలు, చిగుళ్లు, నోటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలేవైనా ఎదురైతే మాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం తప్పనిసరి అని గుర్తుంచుకోవాలి. తద్వారా సమస్య తీవ్రం కాకముందే నయం చేసుకోవచ్చు అని సూచిస్తున్నారు.



## అరికాళ్లలో.. ఆ సమస్య తగ్గాలంటే..!

ఒక్కోసారి అరికాళ్లలో, పాదాల వేళ్ల దగ్గర దురద పుడుతుంటుంది. చర్మం పొడిబారడం, పాదాలు నీళ్లలో ఎక్కువసేపు నానడం.. వంటివి ఇందుకు కారణం కావచ్చు. ఈ సమస్య మితిమీరితే.. చర్మం ఎర్రబడడం, దద్దుర్లు/వాపు రావడం, పొలుసుల మాదిరిగా ఊడిపోవడం, రక్తం కారడం.. మొదలైన లక్షణాలూ కనిపిస్తాయి. అయితే ఇంట్లోనే లభించే కొన్ని సహజసిద్ధమైన పదార్థాలను ఉపయోగించి ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. మరి, ఆ పదార్థాలేంటి, వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం రండి.. ఒక టబ్‌లో పాదాలు మునిగేంత వరకు నీళ్లు తీసుకొని అందులో అరకప్పు ఎప్సమ్ సాల్ట్ వేసి బాగా కలపాలి. ఇందులో పాదాలు పూర్తిగా మునిగేలా ఉంచి, పది నిమిషాలు నాననివ్వాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. పొడిచర్మం కారణంగా అరికాళ్లలో దురద వచ్చినప్పుడు పెట్రోలియం జెల్లీ చక్కని పరిష్కారంగా పని చేస్తుంది. ఇది పొడిబారిన చర్మాన్ని తిరిగి మృదువుగా మార్చడమే కాకుండా, అధిక సమయం పాటు తేమ నిలిచి ఉండేలా కాపాడుతుంది. తద్వారా దురద కూడా తగ్గుముఖం పడుతుందట. ఈ ఫలితం పొందడానికి మనం చేయాల్సిందల్లా సమస్య ఉన్న ప్రాంతంలో కాస్త పెట్రోలియం జెల్లీ రాయడమే! పొడిచర్మ సంబంధిత సమస్యలను తగ్గించడంలో పెప్పర్‌మింట్ ఆయిల్ కూడా బాగా పని చేస్తుంది. అందుకే కొద్దిగా కొబ్బరి లేదా ఆలివ్ నూనె తీసుకొని అందులో నాలుగైదు చుక్కల పెప్పర్‌మింట్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు అప్లై చేసి కాసేపు అలాగే ఉంచాలి. లేదంటే టబ్‌లో కొన్ని గోరువెచ్చని నీళ్లు తీసుకొని అందులో కొన్ని చుక్కల పెప్పర్‌మింట్ ఆయిల్ వేసి పాదాలు రెండూ మునిగి ఉండేలా కాసేపు ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఇది చర్మాన్ని మృదువుగా మార్చడంతో పాటు పొడి చర్మ సమస్యకు చెక్ పెడుతుంది. ఒక టబ్‌లో కొన్ని గోరువెచ్చని నీళ్లు తీసుకొని అందులో రెండు కప్పుల ఓట్స్ వేసి కాసేపు నాననివ్వాలి. తర్వాత ఈ మిశ్రమంలో పాదాలు మునిగేలా కాసేపు ఉంచి, అనంతరం బయటకు తీసి శుభ్రం చేసుకోవాలి. తర్వాత పాదాలకు నాణ్యమైన మాయిశ్చరైజర్ రాసుకుంటే సరిపోతుంది. ఇలా చేయడం ద్వారా పాదాలు, అరికాళ్లలో వచ్చే దురద తగ్గుముఖం పట్టడమే కాకుండా అక్కడి చర్మం మృదువుగా మారుతుందట.



## మెడని నిర్లక్ష్యం చేస్తున్నారా?

ముఖం అందంగా కనిపించడం కోసం ఎన్నో రకాల క్రీములు, ప్యాక్‌లు వాడతాం. కానీ మెడ భాగానికొచ్చేసరికి నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇరవైల్లో పెద్దగా తేడా తెలియకపోయినా.. వయసు పెరిగే కొద్దీ ఆ ప్రభావం మెడ మీద బాగా కనిపిస్తుంది. మెడ చుట్టూ నల్లటి వలయం, సన్నటి ముడతలు, చిన్న చిన్న పొక్కులతో క్రమంగా చర్మం కాంతి విహీనంగా తయారవుతుంది. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మెడ సౌందర్యాన్ని తిరిగి పెంపొందించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందామా మరి..! ముఖంపై ఉండే చర్మం కన్నా మెడ చర్మం చాలా పల్చగా, సున్నితంగా ఉంటుంది. అందుకని ఎక్కువ గాఢత కలిగిన సబ్బులను వాడకూడదు. వీలైనంత వరకు రసాయనాలు లేని సబ్బు/బాడీ వాష్‌లను వాడాలి. అంతేకాదు.. ముఖాన్ని శుభ్రం చేసుకునే ప్రతిసారీ మెడను కూడా శుభ్రపరచుకోవడం అలవాటు చేసుకోవాలంటున్నారు నిపుణులు. చెమట వల్ల మెడపై చాలా త్వరగా మురికి చేరుతుంది. అంతేకాదు నిత్యం మన ధరించే చెయిన్ల వల్ల కూడా మెడ పైన మురికి పేరుకునే అవకాశం ఉంది. సబ్బుతో పైపై మురికి పోయినా, చర్మ రంధ్రాల్లో పేరుకున్న మలినాలు పోవాలంటే స్క్రబ్బర్ తప్పనిసరి. ఇలా జరగకుండా ఉండాలంటే మనం వేసుకునే చెయిన్లను శుభ్రంగా ఉంచుకోవాలి. వారానికి రెండుసార్లు స్క్రబ్బర్ వాడాలి. బాదం పలుకలని బరకగా పొడి చేసి, కొద్దిగా పాలు కలిపి పేస్ట్‌లా చేసి మెడకు పట్టించాలి. భుజాల నుంచి ముఖం వైపుగా నిమిషం పాటు స్క్రబ్ చేసి, చల్లటి నీటితో కడిగేయాలి. నిమిషానికి మించి స్క్రబ్ చేయకూడదు. ఎందుకంటే అతిగా స్క్రబ్ చేయడం వల్ల పల్చని మెడ చర్మం దెబ్బతినే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ఫేస్ ప్యాక్ వాడుతున్న ప్రతిసారీ మెడకి కూడా ప్యాక్ వేసుకోవడం తప్పనిసరి. బాగా పండిన అరటి పండు, లేదా గుమ్మడి పండు, బొప్పాయి గుజ్జుతో ప్యాక్ వేసుకుని 20 నిమిషాల తర్వాత కడగడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. ముఖంపై చర్మానికి టోనర్ వాడేటప్పుడు మెడకు టోనర్ అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. కానీ మెడకి టోనర్ రాసుకునేప్పుడు నేరుగా చేతి వేళ్లతో కాకుండా దూదిని వాడాలని సూచిస్తున్నారు నిపుణులు.



## భారీగా పెరిగిన సిలిండర్ ధర



దేశ వ్యాప్తంగా ఒఖఉ కొరత ఉన్న నేపథ్యంలో సామాన్యులకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఎల్పీజీ కమర్షియల్ సిలిండర్ ధర భారీగా పెరిగిపోయింది. ప్రతి నెల ఒకటో తేదీన ధరల మార్పు ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కమర్షియల్ సిలిండర్ ధరలు పెంచాయి ఆయిల్ కంపెనీలు. 19 కేజీల సిలిండర్ పైన రూ.195.50 పెంచుతూ ఆయిల్ కంపెనీలు షాకింగ్ నిర్ణయాన్ని తీసుకున్నాయి. గత నెలలో ఇదే సిలిండర్ పై రూ.115 పెంచిన సంగతి తెలిసిందే. ఇక ఈ నెల దాదాపు మరో వంద రూపాయలు పెరిగింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత దేశ వ్యాప్తంగా ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఈ క్రమంలోనే సిలిండర్ ధరలు పెరుగుతున్నాయి. అయితే, డొమెస్టిక్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పులు జరుగలేదు. దీంతో గృహ వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు.




## ఆంథ్రోపిక్ సోర్స్ కోడ్ లీక్..

### స్పందించిన కంపెనీ

అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఆంథ్రోపిక్‌కు చెందిన సోర్స్ కోడ్ ఆన్‌లైన్‌లో లీకవ్వడం చర్చనీయాంశమైంది. ఆంథ్రోపిక్ తన 'క్లాడ్ కోడ్' ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోడ్‌ను ఎన్‌పీ



ఎం రిజిస్ట్రీలో ఉంచగా.. అది అనూహ్యంగా బహిర్గతం అయ్యింది. అందులో క్లాడ్ కోడ్ ఎలా పనిచేస్తుంది? దాని ఆర్కిటెక్చర్ ఏంటి వంటి వివరాలు అందులో ఉన్నాయి. లీక్‌ను ఆంథ్రోపిక్ కూడా ధ్రువీకరించింది. మానవ తప్పిదం వల్ల జరిగిందంటూ పేర్కొంది. ఆంథ్రోపిక్ సంస్థ తాము భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామంటూ చెప్పుకుంటూ ఉంటుంది. అలాంటి సంస్థ తన సొంత సోర్స్ కోడ్‌ను కాపాడుకోకపోవడాన్ని సైబర్ నిపుణులు తప్పుబడుతున్నారు. అంతేకాదు ఏఐ వల్ల నష్టం పొంచి ఉందని, దానిపై నియంత్రణ అవసరమంటూ పలుమార్లు ఆంథ్రోపిక్ చెప్పుకొచ్చింది. అయితే, ఏఐ ఎంత ప్రమాదకరమోనంటూ ప్రపంచానికి నీతులు చెప్పే చెప్పే సంస్థకే ఈ పరిస్థితి ఎదురవడంపై నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు. సోర్స్ కోడ్ లీక్‌పై విమర్శలే కాదు.. ఆంథ్రోపిక్‌కు ఓ విధంగా దెబ్బనే చెప్పాలి. ముఖ్యంగా 380 బిలియన్ డాలర్ల ఐపీఓకు ఆంథ్రోపిక్ సన్నాహాలు చేసుకుంటున్న వేళ ఈ లీక్ జరగడం ఆ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లీక్ అంశం కేవలం మానవ తప్పిదం వల్ల జరిగిన పొరపాటని ఆంథ్రోపిక్ వివరణ ఇచ్చింది. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

## ఓలా ఎలక్ట్రిక్.. విక్రయాల్లో భారీ వృద్ధి



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మళ్లీ పుంజుకొంది. మార్చి నెల చివరి వారంలో రోజుకు సగటున వెయ్యి యూనిట్లు విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. మార్చి మొత్తానికి గానూ 10,117 రిజిస్ట్రేషన్లు పూర్తైనట్లు వాహన్ డేటా ప్రకారం తెలుస్తోంది. ఫిబ్రవరి నెలలో ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్ల సంఖ్య 3,973 యూనిట్లతో పోలిస్తే గత నెలలో 150 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఓలా సర్వీసు సెంటర్ల వద్ద తాత్సారం, విడిభాగాలు లభ్యం కాకపోవడం వంటి కారణాలతో ఓలా సేవల పట్ల వినియోగదారుల్లో అసంతృప్తి నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో మార్కెట్ వాటా పరంగా ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఈ సంస్థ.. తన వాటాను కోల్పోతూ వచ్చింది. ఈ క్రమంలో సర్వీసు సెంటర్లను విస్తరించింది. పనితీరును మెరుగుపరిచింది. సర్వీసింగ్‌కు వచ్చే వాహనాల్లో దాదాపు 80 శాతం అదే రోజు పూర్తి చేసి ఇస్తున్నట్లు ఓలా పేర్కొంది. స్పేర్ పార్టుల లభ్యత పెంచినట్లు ఓలా తెలిపింది. ఓలా ఎలక్ట్రిక్ పట్ల కస్టమర్లలో పెరిగిన విశ్వాసం కారణంగా మార్చి నెల విక్రయాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. మొత్తంగా 1 మిలియన్ విక్రయాలు సాధించిన తొలి ఈవీ కంపెనీగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఇదే పనితీరును భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరిగే మార్పులు ఇవే!



భారతదేశ ప్రజలకు బిగ్ అలర్ట్. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త రూల్స్ అమలులోకి రాబోతున్నాయి. ప్రతి నెల ఒకటో తారీఖు వచ్చిందంటే చాలు ధరలు హెచ్చుతగ్గులు కావడం, లేదా బ్యాంకులకు సంబంధించిన ఏదైనా అప్డేట్ రావడం లాంటివి జరుగుతూ ఉంటాయి.అయితే ఇవాళ్టి నుంచి కూడా కొన్ని కీలక మార్పులు జరగబోతున్నాయి.ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడు కేవలం ఓటీపీ ద్వారా మనం చేసేవాళ్లం. కానీ ఇకపై ప్రతి ట్రాన్సాక్షన్ కు పిన్/పాస్ వర్డ్, రిజిస్టర్డ్ డివైజ్, ఫింగర్ ప్రింట్ లేదా ఫేస్ ఐడీ లాంటివి కనీసం రెండు ఉండాలి. సైబర్ స్కాంలను నియంత్రించేందుకు గాను ఈ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఇండియాలోని అన్ని పెట్రోల్ బంక్ ల్లో ఇ-20 పెట్రోల్ తప్పనిసరి చేసింది కేంద్రం. కేవైసీ చేయని ఫాస్ట్ ట్యాగ్ అకౌంట్లు బ్లాక్ అవుతాయి. ఇక కొన్ని బ్యాంకులు డెబిట్ కార్డు నిర్వహణ చార్జీలను అమాంతం పెంచేశాయి. అలాగే ఇకపైన కొత్త బీమా పాలసీలను తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ రూపంలోనే జారీ చేయాల్సి ఉంటుంది. అలాగే గోల్డ్ లోన్ రీ-పేమెంట్ గడువు 180 రోజుల నుంచి 270 రోజులకు పెంచినట్లు తెలుస్తోంది.

## లక్ష మార్క్ ఆశలు ఆవిరి..

స్టాక్ మార్కెట్లలో లాభాల పంట పండుతుందని ఆశించిన ఇన్వెస్టర్లకు గతేడాది కోలుకోని దెబ్బ తీసింది. గడిచిన ఏడాది కాలంగా అంతర్జాతీయ యుద్ధ మేఘాలు, ముడి చమురు సెగలు, రూపాయి పతనం, దేశీయ వృద్ధి రేటుపై అనుమానాలు, భయాలు వంటి ముప్పేట దాడులతో దలాల్ స్ట్రీట్ అతలాకుతలమైంది. కష్టపడి దాచుకున్న లక్షల కోట్ల రూపాయల సంపద కళ్లముందే హరించుకుపోవడంతో సామాన్య ఇన్వెస్టర్ల నుండి బడా ట్రేడర్ల వరకు అంతా గొల్లుమంటున్నారు. ఆర్థిక సంవత్సరం 2025-26లో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 7 శాతం, నిఫ్టీ 5 శాతం మేర కుంగిపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరం ఇన్వెస్టర్లకు భారీ నష్టాలను మిగిల్చింది. విదేశీ ఇన్వెస్టర్లు సుమారు రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను మరింత అగాధంలోకి నెట్టింది. మరోవైపు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూపాయి 95 మార్కును దాటడం ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. వెరసి గతేడాది మార్కెట్ సంబరం కాస్తా విషాదంగా మారి



మదుపర్ల జేబులకు భారీ చిల్లులు పెట్టింది. గతేడాది సెప్టెంబర్ నుంచి భారత ఈక్విటీ మార్కెట్లు పెట్టుబడిదారులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,00,000 మార్కును చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేయగా.. దానికి విరుద్ధంగా ప్రస్తుతం సూచీలు రెండేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతో 2025-26 మార్కెట్లకు గడ్డుకాలంగా మారింది. 2025 మార్చి ముగింపు నాటికి సెన్సెక్స్ 77,414 వద్ద ముగిసింది. ఈ ఏడాది సెన్సెక్స్ 5,467 పాయింట్లు లేదా 7 శాతం పతనమై మార్చి 30 నాటికి 72,000 దిగువన 71,947కు పరిమితమయ్యింది. గత రెండేళ్లలో సెన్సెక్స్ రెండుసార్లు 85,000 మార్కును తాకినప్పటికీ ఆ స్థాయిని నిలబెట్టుకోలేకపోయింది. మార్కెట్ అస్థిరతను సూచించే 'ఇండియా విఐఎక్స్ ఇండెక్స్ గత ఏడాది కాలంలో 120 శాతం పెరిగి 27.89 వద్ద ముగియడం మార్కెట్లలో నెలకొన్న భయాందోళనలకు అద్దం పడుతోంది. 2025-26లో బిఎస్ఇలో లిస్టింగ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.413.75 లక్షల కోట్ల నుండి రూ.412.41 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే ఇన్వెస్టర్లు సుమారు రూ.1,34,414 కోట్ల మేర తమ సంపదను కోల్పోయారు.

## రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు




దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## లక్షన్నర దాటిన బంగారం ధర..



బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి.వరుసగా మూడో రోజు కూడా వాటి జోరు కొనసాగింది. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగా రం ధర ఏకంగా రూ. 1,51,500కి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. మరోవైపు కిలో వెండి ధర కూడా రూ. 5,000 పెరిగి రూ. 2,37,000కి ఎగబాకింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో కొనుగోళ్ల ఆసక్తి పెరగడం ధరల పెరుగుదలకు దోహదపడింది. ఇరాన్‌తో యుద్ధం రెండు, మూడు వారాల్లోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అంతర్జాతీయంగా పసిడి ధరలు బలపడ్డాయి. ఆసియా ట్రేడింగ్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 1.25శాతం పెరిగి 4,737 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయనే అంచనాలు ధరలకు మద్దతునిచ్చాయి. దేశవ్యాప్తంగా సగటున 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,250 మేర పెరిగింది. ప్రస్తుతం ఒక గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,827 పలుకుతుండగా, ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.13,591గా ఉంది. ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం సోమవారం నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,733గా ఉంది. మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం మార్కెట్లకు సెలవు కావడంతో అవే ధరలు కొనసాగాయి.




## నాగలక్ష్మికి స్వర్ణం, దత్తుకు రజతం

చత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా గిరిజన క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల రెజ్లింగ్ 57 కేజీల విభాగంలో నాగలక్ష్మి స్వర్ణంతో మెరిసింది. ఫైనల్లో ఆమె 10-0తో సాయి సిద్ధి (కర్ణాటక)ను చిత్తు చేసింది. గ్రీకో రోమన్ పురుషుల 77 కేజీల్లో జాదవ్ చరణ్, 135 కేజీల్లో రాజు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. 110 మీటర్ల హర్డిల్స్‌లో ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' అథ్లెట్ సపావత్ దత్తు రజతంతో మెరిశాడు. దత్తు 16.00 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచాడు.



సపావత్ దత్తు
నాగలక్ష్మి

## అదొక్కటి మీకు చెప్పను: లఖ్‌నవూ కోచ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తొలి మ్యాచ్‌ను ఆడేందుకు సిద్ధమైంది. మరికాసేపట్లో ఏకనా స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా ఆడతాడనేది



ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి నెలకొంది. మరోవైపు అతడు ఏ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడనేది కూడా కీలక అంశమే. గత సీజన్‌లో అతడు కేవలం 269 పరుగులు మాత్రమే చేశాడు. అందులో ఒక సెంచరీ కూడా ఉంది. తన రూ. 27 కోట్ల ప్రైస్ ట్యాగ్‌కు న్యాయం చేయాల్సిన బాధ్యత అతడిపై ఉంది. ఈ క్రమంలో పంత్‌ను ఎక్కడ ఆడిస్తారని లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ ఎదుట ప్రశ్న ఉత్పన్నమైంది. ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అతడు మాట్లాడాడు. 'ఈ ప్రశ్న అడిగినందుకు ధన్యవాదాలు. దీనికి సమాధానం నేను చెప్పను. మీరే మ్యాచ్‌లో చూడాలి. రిషభ్ పంత్ ఎక్కడైనా ఆడే సత్తా ఉన్న ప్లేయర్. నేను ఇప్పుడే చెబితే ఢిల్లీ క్యాపిటల్స్ అందుకు సన్నద్ధమవుతుంది. ఇవాళ రాత్రి 7.30గంటలకే మీరు చూస్తారు. దూకుడుగా ఎలా ఆడటం తెలుసో.. ఇన్నింగ్స్‌ను నిర్మించగలడు. గతేడాది కూడా చేసి చూపించాడు. ఈసారి మరింత మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తాడు'' అని లాంగర్ వెల్లడించాడు.

## సెంట్రల్ కాంట్రాక్ట్ పోయింది..

### గ్లెన్ మ్యాక్స్‌వెల్ కెరీర్ ముగిసినట్లేనా?



ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌ను ప్రకటించింది. 2026-27 సీజన్‌కు గాను 21 మందికి అవకాశం కల్పించింది. అయితే, వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు అవకాశం రాలేదు. అతడికి ఎటువంటి కేటగిరీలోనూ చోటు కల్పించలేదు. మ్యాక్స్‌వెల్ 2017లో చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడాడు. దీంతో రాబోయే సీజన్‌లో ఎక్కువ టెస్టులు ఆడే వారికే సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వడం గమనార్హం. భారత్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌తో ఆసీస్ టెస్టు సిరీస్‌లను ఆడనుంది. టెస్టు జట్టులో స్థానం లేని మ్యాక్సీ గతేడాది వన్డేలకు వీడ్కోలు పలికాడు. ఈ 37 ఏళ్ల ఆటగాడు కేవలం అంతర్జాతీయ టీ20ల్లోనే కొనసాగుతున్నాడు. అయితే, గత టీ20 ప్రపంచకప్‌లోనూ పెద్దగా ప్రభావం చూపించలేదు. మళ్లీ రెండేళ్ల తర్వాత పొట్టి కప్ రానుంది. దానికోసం క్రికెట్ ఆస్ట్రేలియా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులోభాగంగా గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు చోటు కల్పించడం దాదాపు కష్టమే. దీంతో గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని క్రికెట్ వర్గాల అంచనా. టెస్టులే ప్రామాణికంగా..

ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్‌ను చూస్తే టెస్టు ఫార్మాట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లైంది. మెరుగ్గా రాణించేవారికే క్రికెట్ బోర్డు చోటు కల్పించింది. ఇటీవల టెస్టులకు రిటైర్‌మెంట్ ప్రకటించిన ఉస్మాన్ ఖవాజాకు అవకాశం దక్కలేదు. భారత్‌తో బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ 2024లో అదరగొట్టిన ఓపెనర్ కొన్‌స్టాస్ ఇటీవల తేలిపోయాడు. దీంతో అతడినీ పక్కన పెట్టేసింది. ఇదీ జాబితా: జేవియర్ బార్ట్‌లెట్, స్కాట్ బార్ట్‌లెట్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్, బ్రెండన్ డగెట్, నాథన్ ఎలిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కున్హెమన్, మార్నస్ లబుషేన్, నాథన్ లయన్, మిచెల్ మార్ష్, టాడ్ మర్ఫీ, మైకెల్ నెసెర్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జేక్ వెదర్లాండ్, బ్యూ వెబ్‌స్టర్, ఆడమ్ జంపా

## మనకు ఎవరూ హద్దులు గీయొద్దు



మనకు ఇంకొకరు హద్దులు గీసే అవకాశం ఇవ్వకూడదని పారా ఆర్చర్ శీతల్ దేవి అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్చరీ సమాఖ్య 2025 సంవత్సరానికి తనను ఉత్తమ పారా ఆర్చర్‌గా ఎంపిక చేసిన నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది. తనకీ పురస్కారం ఎంతో ప్రత్యేకమని పేర్కొంది. ''ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారిణులతో పోటీ పడి ఈ పురస్కారానికి ఎంపిక కావడం మరపురాని అనుభూతి. ఇది నాకెంతో ప్రత్యేకం. మన కష్టాన్ని, తట్టుకున్న ఎదురుదెబ్బలను, త్యాగాలను ఇది ప్రతిబింబిస్తుంది. నాకు ఆశీస్సులు అందిస్తున్న రాణీ మాత ముందు నేను మోకరిల్లుతున్నా. నా కుటుంబానికి, కోచ్‌కు, నా బృందానికి.. నా మీద నమ్మకముంచి అండగా నిలచిన ప్రతి ఒక్కరికీ నేను రుణపడి ఉంటా. వాళ్లందరూ లేకపోతే నేనిలా ముందుకు సాగేదాన్ని కాదు. మన పరిమితులను ఇంకెవరూ నిర్దేశించే అవకాశం ఇవ్వకూడదు. ఓపిగ్గా ఉంటూ, ఒక ప్రక్రియను అనుసరిస్తూ ముందుకు సాగిపోవాలి. ఎవరిలోనూ లోపం ఏమీ ఉండదు. కష్టించే తత్వమే తక్కువ ఉంటుంది. కెరీర్లో నేను ఎదుర్కొన్న అతి పెద్ద సవాలు.. గత ఏడాది నా టెక్నిక్‌ను మార్చుకోవాల్సి రావడమే. అదంత తేలికగా సాగలేదు'' అని శీతల్ చెప్పింది.

## ఎల్ఎస్జీ కెప్టెన్‌కి ఈ సీజన్ సవాలే!



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 2026 ఐపీఎల్ లో టైటిల్ వేటకు సిద్ధమైంది. ఈ సీజన్‌లో తన తొలి మ్యాచ్‌లో బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఢీకొంటుంది. లఖ్‌నవూ కెప్టెన్ రిషబ్ పంత్‌కు ఈ సీజన్ సవాలే. అతడు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు. ఎల్ఎస్జీ తరపున తన తొలి సీజన్‌లో నిరుడు పంత్ కెప్టెన్‌గా, ప్రధాన బ్యాటర్‌గా రాణించలేకపోయాడు. కీలక ఆటగాళ్లు, ముఖ్యంగా ఫాస్ట్‌బౌలర్లు గాయాల బారిన పడడం అతడి పనిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈసారి పంత్‌కు పూర్తి ఫిట్‌గా ఉన్న జట్టు అందుబాటులో ఉంది. పేస్ బౌలర్లు షమి, నోకియాల చేరికతో లఖ్‌నవూ మరింత బలోపేతమైంది. గాయాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్న యువ ఫాస్ట్‌బౌలర్ మయాంక్ యాదవ్.. గత ఏడాది కాలంలో తన ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడానికి చాలా శ్రమించాడు. తమ నమ్మకాన్ని అతడు నిలబెడతాడని ఎల్ఎస్జీ ఆశిస్తోంది. పేసర్ మోసిన్ ఖాన్ కూడా గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేస్తున్నాడు. మిస్టరీ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ ఈసారి మరింత సత్తా చాటా లనే పట్టుదలతో ఉన్నాడు. బౌలింగ్ విభాగంతో పోలిస్తే ఎల్ఎస్జీ బ్యాటింగ్ మరింత స్థిరంగా కనిపిస్తోంది.

## నిన్నటి వరకూ భారత్‌ది..

## ఇప్పుడు కివీస్‌దే ఆ రికార్డు



మహిళా క్రికెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. నిన్నటివరకూ ఆ ఘనత టీమ్‌ఇండియా ఖాతాలో ఉంది. ఇప్పుడు న్యూజిలాండ్ మహిళా జట్టు రికార్డు సృష్టించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారీ టార్గెట్‌ను ఛేదించింది. మహిళా క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం గమనార్హం. మూడు వన్డేల సిరీస్‌లో మొదటి మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా గెలిచింది. ఇక రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే సిరీస్ సఫారీలదే. కానీ, కివీస్ ఆ ఛాన్స్ ఇవ్వలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 346/6 స్కోరు చేసింది. ఇంత చేశాక ఓడిపోవడం అసాధ్యమే కదా.. కానీ, న్యూజిలాండ్ చరిత్రను తిరగరాసేలా విజయం సాధించింది. 49.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 350 పరుగులు చేసి గెలిచింది. దీంతో మహిళా క్రికెట్‌లో అత్యధిక లక్ష్య ఛేదన చేసిన జట్టుగా అవతరించింది. అంతకుముందు కివీస్ పైనే భారత్ 341/5 టార్గెట్‌ను ఛేదించి విజయం సాధించింది. ఇప్పుడు ఆ రికార్డు కనుమరుగైంది.

చితక్కొట్టిన అమెలియా కెర్

ఓవైపు భారీ లక్ష్యం. ఓపెనర్ల నుంచి మెరుపు ఆరంభమే రాలేదు. కానీ, అమెలియా కెర్ (179★: 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడు ప్రదర్శించింది. ఫోర్లతో విరుచుకుపడింది. ఆమెకుతోడుగా ఇసాబెల్లా గేజ్ (68) అండగా నిలిచింది. అయితే, దక్షిణాఫ్రికా బౌలర్లు విజృంభణతో.. స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు పడటంతో కివీస్ శిబిరంలో ఆందోళన మొదలైంది. కానీ, కెర్ మాత్రం పట్టువిడవకుండా చివరివరకూ ఉండిపోయింది. చివరికి 49.4 ఓవర్లలో కివీస్ లక్ష్యాన్ని పూర్తిచేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా అమెలియా కెర్ నిలిచింది. మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లూ 1-1 సమంగా నిలిచాయి. ఆఖరి వన్డే ఏప్రిల్ 4వ తేదీన జరగనుంది.




# సినిమా

## హెచ్ పీవీ వ్యాక్సిన్ డ్రైవ్ కు మద్దతుగా ఏఏఎఫ్ఏ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ హెచ్ పీవీ వ్యాక్సిన్ డ్రైవ్ కు మద్దతుగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ ఏడాది మొత్తం ప్రజల్లో హెచ్ పీవీ వ్యాక్సిన్ పై అవగాహన కార్యక్రమాలు చేయనుంది. ఏడాదికో మంచి పని చేయాలంటూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చెప్పిన మాటల్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఇనిషేటివ్ తీసుకుంది. హెచ్ పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మన ఆడ బిడ్డలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారు. 9 నుంచి 26 ఏళ్ల వయసున్న బాలికలు, మహిళలు ఈ వ్యాక్సిన్ ను ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఉచితంగా తీసుకోవచ్చు. కేంద్రప్రభుత్వం స్వస్తి నారీ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా బాలికలకు, మహిళలకు ఉచితంగా హెచ్ పీవీ వ్యాక్సిన్ అందిస్తోంది. ఈనెల 8వ తేదీన అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి మంచి సామాజిక కార్యక్రమానికి ఫ్యాన్స్ అసోసియేషన్ ముందుకురావడం అభినందనీయం.




## తెలుగు రెవెన్యూ కంటే మలయాళంలో ఎక్కువ

### పల్లిచట్టంబి ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్

తెలుగులో సినిమాలు నిర్మించాలంటే మరింత జాగ్రత్తగా ఉండాలని అన్నారు ప్రముఖ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్. టొవినో థామస్ కొత్త సినిమా పల్లిచట్టంబిని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు బన్నీ వాస్. ఈ సినిమా ప్రెస్ మీట్ లో పాల్గొన్న బన్నీ వాస్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగులో విజయవంతమైన సినిమా ద్వారా నిర్మాతకు దక్కుతున్న థియేట్రికల్ రెవెన్యూ మలయాళంలో చూస్తే తక్కువగా ఉంటోందని ఆయన అన్నారు. మలయాళం థియేట్రికల్ రెవెన్యూతో అక్కడి నిర్మాతలు హ్యాపీగా ఉన్నారని ఆయన చెప్పారు.

తెలుగులో థియేటర్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ బాగుండాలనే ప్రయత్నంలో భాగంగానే వీలైనన్ని ఇతర భాషల చిత్రాలను తెలుగులోకి తీసుకొస్తున్నట్లు బన్నీ వాస్ చెప్పారు.

మనకు తెలిసిన వాళ్లు మలయాళంలో మూవీ ప్రొడ్యూస్ చేస్తున్నారంటూ డైరెక్టర్ మారుతి ఈ ప్రొడ్యూసర్స్ టీమ్ ను పరిచయం చేశారు. వాళ్లతో మాట్లాడిన తర్వాత ఒక ప్రెస్టీజియస్ మూవీ చేస్తున్నారని తెలిసింది. కొచ్చి తీసుకెళ్లి ఈ సినిమా చూపించారు. మన తెలుగు వాళ్లు కేరళ వెళ్లి ఇలాంటి ఒక భారీ చిత్రాన్ని నిర్మించడం ఆశ్చర్యాన్ని కలిగించింది. సినిమా టెక్నికల్ చాలా క్వాలిటీగా హ్యూజ్ గా ఉంటుంది. తెలుగు ఆడియెన్స్ కు ఒక కొత్త కమర్షియల్ మూవీ అవుతుంది. మలయాళం మూవీస్ అంటే మనం కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీస్ గాన భావిస్తాం కానీ పల్లిచట్టంబి ఒక భారీ మంచి కమర్షియల్ మూవీ. సీనియర్ ప్రొడ్యూసర్ గా మీకు ఈ సలహా ఇస్తున్నా. ఎందుకంటే తెలుగులో ఓ సినిమా సక్సెస్ అయితే వచ్చే ఆదాయం కన్నా, మలయాళంలో ఒక మూవీ సక్సెస్ అయితే వచ్చే ఆదాయం ఎక్కువ.



## వంద దేవుళ్లు నుంచి ఇది కలనో

'బిచ్చగాడు' లాంటి బ్లాక్ బస్టర్ తరువాత మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో 'వంద దేవుళ్లు' అనే సినిమా రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.



రీసెంట్ గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. విజయ్ ఆంటోనీ, స్వాసిక మాసీ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ మూవీ నుంచి 'ఇది కలనో' అంటూ సాగే మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటలో విజయ్ ఆంటోని, స్వాసిక కనిపిస్తున్న తీరు, వారి ప్రేమను వ్యక్త పరుస్తున్న విధానం ఎంతో చక్కగా ఉంది. ఇక ఈ పాటకు భాగ్య శ్రీ అందించిన సాహిత్యం, శిభి శ్రీనివాసన్, శిరీష భాగవతుల గాత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. బాలాజీ శ్రీరామ్ అందించిన బాణీ శ్రోతల్ని ఇట్టే కట్టి పడేసేలా ఉంది.

ఈ మూవీకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేస్తున్నారు. ముమ్మందు మరిన్ని అప్డేట్ లతో ఆడియెన్స్‌ను టీం అలరించనుంది. ఈ సినిమాని సమ్మర్ కానుకగా మే నెలలో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.



## కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్ టైటిల్ సాంగ్ లాంచ్



హైదరాబాద్ ఐటిసి కాకతీయలో జరిగిన ఫంక్షన్ లో శ్రీలంక బుద్ధిజం రిలీజియన్స్ కేంద్ర శాఖ మంత్రి డాక్టర్ శ్రీ సునీల్ సేనేవి కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్ అనే టైటిల్ సాంగ్ ను అధికారికంగా లాంచ్ చేశారు. ఇరాన్ ఇజ్రాయిల్, ఉక్రెయిన్ రష్యాతో పాటు 50 దేశాల్లో జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని "కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్" సత్యారెడ్డి చేస్తున్న గొప్ప ప్రయత్నాన్ని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అమెరికాలో ప్రారంభించి థాయిలాండ్, మలేషియా, వియత్నాం, కాంబోడియా, లావోస్, ఇండోనేషియా లాంటి బుద్దిస్ట్ దేశాల్లో షూటింగ్ జరుపుకోవడం హర్షనీయమని ఆయన అన్నారు. త్వరలో తమ శ్రీలంక దేశంలో షూటింగ్ జరుపుకోవడానికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ప్రపంచ చరిత్రలో ఇన్ని బౌద్ధ దేశాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఏకైక చిత్రంగా కింగ్ బుద్ధ నిలిచిపోతుందని ఆయన అన్నారు. అన్ని బౌద్ధ దేశాల సహాయ సహకారాలు ఈ చిత్రానికి అందిస్తారని ఆయన ఆశించారు. అనుబాంబు దాడులకు గురైన హీరోషిమా నాగసాకి ఇప్పటికీ కోలుకోలేదని ఆయన గుర్తు చేశారు. మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఉండాలన్న, ప్రపంచం శాంతి మార్గంలో నడవాలన్నా ప్రపంచానికి బుద్ధిజమే ఏకైక మార్గం అని ఆయన అన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది బౌద్ధ బిక్షువులు పీస్ వాక్ చేస్తున్నారని కోట్లాదిమంది ప్రజలు వారిని ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. కింగ్ బుద్ధ హాలీవుడ్ మూవీలో చిత్రీకరించిన సీన్లు కొన్ని తను చూసానని, దర్శకుడు సత్యారెడ్డి అద్భుతంగా చిత్రీకరించాడని ఆయన కొనియాడారు.

## కార్మేని సెల్వం

### ధైర్యాన్నిచ్చే సినిమా : దర్శకుడు రామ్ చక్రి

పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపి, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రామ్ చక్రి ఇలా ముచ్చటించారు. 'కార్మేని సెల్వం' విషయానికొస్తే.. ఈ సినిమా మధ్య తరగతి జీవితంపై ఆధారపడి ఉంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ కథతో కనెక్ట్ అవుతారు. ముఖ్యంగా అప్పుల సమస్యతో బాధపడుతున్న వారికి ఈ సినిమా ఒక ధైర్యాన్ని ఇస్తుంది. మధ్య తరగతి కుటుంబాల్లో అప్పులు అనేవి కామన్‌గా ఉంటాయి. వాటి కారణంగా కుటుంబంలోని సంబంధాలు, వారు తీసుకునే నిర్ణయాలు ఎలా ప్రభావితం చేస్తాయనేది ఇందులో చూపించబోతున్నాం. చాలా రియలిస్టిక్‌గా మూవీ ఉంటుంది. సముద్రఖని గారు ఆయన పాత్రలోని ప్రతి షేడ్‌ను అద్భుతంగా పండించారు. మధ్యతరగతి భర్తగా, తండ్రిగా తనదైన ఎమోషన్‌ను పండించారు. ఆయనతోపాటు గౌతమ్ మీనన్ గారు, లక్ష్మీ ప్రియా, అభినయ పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.



## సమంత ఫాలో అయ్యే ఫార్ములా ఇదే

నటి సమంత తాజాగా తన మార్నింగ్ రొటీన్‌ను అభిమానులతో పంచుకున్నారు. దీనిని 'పవర్ మార్నింగ్' అని పేర్కొన్నారు. ఇది తన జీవితాన్ని ఎంతగానో మార్చిందని చెప్పారు. ''ఉదయం ప్రశాంతంగా మొదలైతే మిగిలిన రోజంతా ఉత్సాహంగా గడుస్తుందని నమ్ముతుంటా. ఇప్పటివరకూ ఎన్నో మార్నింగ్ రొటీన్స్‌ను ఫాలో అయ్యా. చివరకు ఒక సులభతరమైన ఫార్ములాకు అలవాటు పడ్డా. అది ఉపయోగపడింది. అదే నా పవర్ మార్నింగ్. నిద్రలేచే సమయానికి ఒత్తిడికి గురి చేసే హార్మోన్లు ఎక్కువ స్థాయిలో ఉంటాయి. ఇది ఎవరికైనా సాధారణం. కాబట్టి, నిద్ర లేచిన వెంటనే మనం ఏం చేస్తున్నామనేది ముఖ్యం. చాలామంది ఫోన్లు పట్టుకుంటారు. మెయిల్స్ చూడటం, వర్క్ గురించి ఆలోచిస్తారు. దీనివల్ల ఉదయాన్నే మరింత ఒత్తిడికి గురవుతారు'' అని సమంత అన్నారు.



## మొదట తిరస్కరించా

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న చిత్రం 'రామాయణ'. ఇందులో రణ్‌బీర్ రాముడిగా కనిపించనున్నారు. ఆయన ఈ పాత్ర గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. చిత్రబృందం తనను సంప్రదించినప్పుడు మొదట తిరస్కరించినట్లు తెలిపారు. కుమార్తె రాహా కోసమే ఈ పాత్రను అంగీకరించినట్లు చెప్పారు.

''సుమారు నాలుగేళ్ల క్రితం నిర్మాత నమిత్ మల్హోత్రా నాకు ఈ పాత్రను ఆఫర్ చేసినప్పుడు, వెంటనే 'నో' చెప్పాను. ఆ పాత్రకు న్యాయం చేసేంత సామర్థ్యం నాకు లేదని, నేను దానికి తగినవాడిని కాదని అనుకున్నా. కానీ, రాహా నా ఆలోచన విధానాన్ని మార్చేసింది. ఇలాంటి అవకాశాలు చాలా తక్కువ మందికి వస్తాయి. భయం వదిలిపెట్టి ధైర్యంగా ముందడుగు వేయాలి అనుకున్నా. అందుకే అంగీకరించా'' అని రణ్‌బీర్ చెప్పారు. ఒక తండ్రిగా తన బాధ్యతలను తెలుసుకున్న తర్వాత, శ్రీరాముడి వంటి ఆదర్శవంతమైన పాత్రను పోషించడం తన వ్యక్తిగత ఎదుగుదలకు కూడా సహాయపడుతుందని భావించినట్లు తెలిపారు. భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో 'రామాయణ' రూపొందుతోంది. మొదటిభాగం దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు.



## ఫ్యామిలీ అంతా కలిసి చూసే మూవీ

# పల్లిచట్టంబి

### హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లిచట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజేష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. "పల్లి చట్టంబి" సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్.

హీరో టొవినో థామస్ మాట్లాడుతూ దర్శకుడు డిజో నాకు చాలాకాలంగా తెలుసు. మేమిద్దరం ఒక ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటూ ఉండేవాళ్లం. కొన్ని మూవీస్ కు డిస్కషన్స్ చేసుకున్నాం. అయితే అప్పటికి నాకు ఉన్న సినిమాల కారణంగా వెంటనే ఆయనతో సినిమా చేయలేకపోయాను. డిజో, నేను కలుస్తూనే ఉండేవాళ్లం. డిజో పల్లిచట్టంబి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్ గా అనిపించింది. ఈ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాం. ఆ తర్వాత నేను కమిట్ మూవీస్ ఫినిష్ చేశాను. డిజో కూడా జనగణమన సినిమాతో పాటు మరో మూవీ రూపొందించాడు. ఆ తర్వాత ఈ సినిమా వర్క్స్ ప్రారంభించాం. కొద్ది రోజుల తర్వాత ప్రొడ్యూసర్ మారారు. మేము వేరే ప్రొడ్యూసర్స్ ను ప్రాజెక్ట్ లోకి తీసుకున్నాం.

ఈ కథ ప్రకారం హీరో బలంగా కనిపించాలి. విలన్స్ ను విసిరిపారేసేలా ఉండాలి. అందుకే వెయిట్ పెరిగాను. అప్పటిదాకా డైటింగ్ చేసే నేను ఈ చిత్రం కోసం డైటింగ్ పక్కనపెట్టాను. హెయిర్ స్టైల్, మీస కట్టుతో ఒక మంచి లుక్ లోకి మారాను. డిజోతో వర్క్ చేయడంలో ఎలాంటి ప్రెజర్ ఉండదు. సెట్ లో కూల్ గా వర్క్ చేసుకుంటూ వెళ్తాడు. ఆయనకు కోపం వస్తుందా అనేది కూడా తెలియదు.

షూటింగ్ గ్యాప్ లో వెకేషన్స్ కు వెళ్తుంటా. నాకు ట్రావెలింగ్ అంటే ఇష్టం. మా ఫ్యామిలీతో వెకేషన్స్ లో సమయం గడపడం నాకు ఇష్టం. హెక్టిక్ షెడ్యూల్స్ పెట్టుకుని బ్యాక్ టు బ్యాక్ వర్క్ చేయడం నాకు ఇష్టం ఉండదు. కొంత విరామం తీసుకుంటేనే ఇండస్ట్రీ ఎలా ఉంది గమనించగలుగుతాం. నేను ఇండస్ట్రీలో ఉన్నా, ఇండస్ట్రీ బయటివారిలా అన్నీ గమనించాలని అనుకుంటా. తెలుగులో ఇప్పటిదాకా చాలా మూవీస్ కు డిస్కషన్స్ జరిగాయి. కానీ ఏదీ కన్ఫర్మ్ కాలేదు. మలయాళంలో నేను స్ట్రాంగ్ పొజిషన్ లో ఉన్నాను. అక్కడ మూవీస్ వదిలి మరో భాషకు వస్తే నన్ను నమ్ముకుని ప్రాజెక్ట్స్ చేసే వాళ్లు నష్టపోతారు. నేను తెలుగులో సినిమా చేయకున్నా తెలుగు ప్రేక్షకులు నా మలయాళ మూవీస్ చూసి ఆదరిస్తుండటం సంతోషంగా ఉంది.

నిర్మాతలు నౌఫల్, బ్రిజేష్ తో గతంలో వర్క్ చేశాను. వాళ్లు నా మూవీస్ ను డిస్ట్రిబ్యూట్ చేసేవారు. దర్శకుడు డిజో ఈ సినిమా కోసం ఏది అడిగినా అది కాంప్రమైజ్ కాకుండా ఇచ్చారు. తెలుగు నుంచి ప్రొడ్యూసర్స్ చైతన్య, చాణక్య, చరణ్ వచ్చి మా మూవీ చేయడం హ్యాపీగా అనిపించింది. జేక్స్ బిజోయ్ తన మ్యూజిక్ తో మా మూవీలోని ఇంటెన్సిటీని, ఎఫెక్ట్ ను మరింతగా పెంచారు. ఆయనతో గతంలోనూ నేను వర్క్ చేశాను. జేక్స్ చాలా మంచి మ్యూజిక్ డైరెక్టర్. పల్లిచట్టంబి సినిమా 50వ దశకంలో కేరళలో జరిగిన ఇన్సిడెంట్స్ స్ఫూర్తిగా ఫిక్షనల్ గా సాగే మూవీ. అప్పుడు సామాజికంగా ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటినే మూవీలో చూపించాం. అంతేకానీ ఆ పరిస్థితుల నేపథ్యాన్ని మా అభిప్రాయ కోణంలో చూపించలేదు. మీరు ఒక్కసారి సినిమా చూస్తే మూవీ సోల్ అర్థమవుతుంది. మా మూవీలో మానవత్వం ముఖ్యమనే పాయింట్ ను చూపిస్తున్నాం. నా వ్యక్తిగత అభిప్రాయంలో కూడా మనమంతా ఒక్కటే. ఎవరు తక్కువ, ఎవరు ఎక్కువ కాదు. పల్లిచట్టంబి ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫిలిం, ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. పల్లిచట్టంబిలో మతాల గురించిన ప్రస్తావన, ఏ మతాన్ని తక్కువ చేయడం కానీ చూపించలేదు. కథానుసారం చర్చి నేపథ్యంగా సన్నివేశాలుంటాయి. ఆ ప్లేస్ లో మరో ఆలయాన్ని పెట్టుకున్నా, కథలో మార్పేమీ ఉండదు. సోషియో పొలిటికల్ అంశాలు ప్రధానంగా ఉంటాయి. సినిమాను ఆస్వాదించేందుకు భాష అవసరం లేదు. మనం ప్రపంచభాషల్లోని అనేక సినిమాలను ఓటీటీ ద్వారా చూసి ఎంజాయ్ చేస్తున్నాం. నేను తెలుగు తెలియకున్నా చిన్నప్పుడు ఎన్నో తెలుగు మూవీస్ ను చూసి ఎంజాయ్ చేశాను. పల్లిచట్టంబి సినిమాకు సీక్వెల్ అనుకోవడం లేదు.

హీరోయిన్ కయదు లోహర్ మాట్లాడుతూ డ్రాగన్ మూవీ కంటే ఓకే అయిన చిత్రమిది. నేను నటించిన మలయాళ మూవీ పాథోన్పథం నూట్టండు చూసి దర్శకుడు డిజో ఈ మూవీ కోసం అప్రోచ్ అయ్యారు. ఈ కథ విన్నాక నా కెరీర్ లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందని అనిపించింది. ఇప్పటి దాకా నేను ఏ మూవీలో నటించని తరహా పాత్ర ఈ సినిమాలో చేశాను. ఈ చిత్రంలో రెబెకా అనే పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్ర ఇంటెలెక్చువల్, రూటెట్ గా ఉంటుంది. గ్లామర్ అనే కోణంలో ప్రేక్షకులు నా పాత్రను చూడరు. మూవీలో నా పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ సినిమా కోసం నేను బాగా కష్టపడాలి అనుకున్నా. ఈ సినిమా నన్ను నాయికగా మరింత మంచి పొజిషన్ కు తీసుకెళ్తుందనే నమ్మకం ఉంది. నేను బయటకు మోడరన్ అమ్మాయిలా కనిపిస్తా కానీ రూరల్ అమ్మాయి మనస్తత్వమే నాలో ఉంటుంది. డైరెక్టర్ డిజో సపోర్ట్ తో రెబెకా పాత్రను సంతృప్తికరంగా పోషించగలిగాను. నేను నాకు తెలియని భాషల్లో సినిమాలు చేస్తున్నప్పుడు ఆ మూవీ కోసం తప్పకుండా వర్క్ షాప్స్ చేస్తాను. భాష తెలిసిన వారి సహాయం తీసుకుంటాను. కనీసం ఐదు నుంచి పది రోజులు వర్క్ షాప్స్ చేసి, స్క్రిప్ట్ అర్థం చేసుకుని సెట్స్ లోకి వెళ్తాను. ఈ సినిమా కోసం కూడా అలాంటి వర్క్ షాప్స్ చేశాను. స్క్రిప్ట్ విన్న తర్వాత నేను కొంత రీసెర్చ్ చేశాను, కొన్ని బుక్స్ చదివాను. అయితే డిజో గారు స్క్రిప్ట్ పరిధిలోనే ఆలోచించి, నటించమని చెప్పారు. మనం ఎక్కువ రీసెర్చ్ చేసినా కన్ఫ్యూజ్ అవుతాం. అందుకే డిజో చెప్పినట్లు స్క్రిప్ట్ లో ఉన్నది పర్ ఫార్మ్ చేశాం.

రెండు రకాల లుక్స్ లో నేను కనిపిస్తాను. నేను ఈ మూవీలో ఎలా కనిపించాలి అనే విషయంలో దర్శకుడు డిజో పూర్తి స్పష్టతతో ఉన్నారు. ఎప్పుడైనా బాగా ప్రిపేర్ అయిన డైలాగ్స్ మార్చినప్పుడు మాత్రం ఇబ్బందిగా ఉండేది. నేను ఎవరితో కలిసి నటించినా ధైర్యంగా నటిస్తా కానీ టొవినోతో కలిసి నటించినప్పుడు ఎందుకో భయమేసింది. పర్ ఫార్మెన్స్ లో ఆయన నాకంటే ముందుంటారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. టొవినోను చూసి ఇన్స్ పైర్ అయి నటించాను.

పల్లిచట్టంబి ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫిలిం. ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ కలిసి చూడొచ్చు. మా మూవీకి ఎలాంటి కేటగిరీ రెస్ట్రిక్షన్ లేదు. ఒకసారి మీరు సినిమా చూస్తే ఈ స్క్రిప్ట్ తెరకెక్కించడంలో ఉద్దేశం తెలుస్తుంది. ప్రత్యేకంగా ఏ అజెండా ఈ సినిమా వెనక లేదు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.